ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 253 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం 12 ఫిబ్రవరి, 2018 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5119

శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం।
ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం,
కృష్ణపక్షం; తిథి: బహుళ ద్వాదశి రా.8.13;
నక్షత్రం: పూర్వాషాఢ రా.2.23;
వర్జ్యం: ఉ.10.24 నుండి 12.10 వరకు
విశేషాలు: కుంభమాసారంభం
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు, తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు

కుప్పకూలిన రష్యా విమానం

71మంది దుర్మరణం

మాస్కో, ఫిబ్రవరి 11: రష్యా రాజధాని మాస్కో శివారులో ఓ ప్రయాణికుల విమానం కూలిపోయిన దుర్ఘటనలో 71 మంది దుర్మరణం చెందారు. మాస్కోలోని డొమండెడోవ్ విమానాశ్రయం నుంచి బయలు దేరిన ఎఎన్-148 అనే విమానంలో ప్రమాద సమయానికి ఆరుగురు సిబ్బంది, 65మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ విమానం మాస్కో నుంచి ఓర్స్క్ పట్టణానికి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. మంటల్లో ఉన్న ఈ విమాన శకలాలు కింద పడటాన్ని తాము చూశామని అర్గునోవో గ్రామ ప్రజల్ని ఉటంకిస్తూ కథనాలు వెలువడ్డాయి. విమాన శకలాలు మంచు ప్రాంతంలో పడ్డ దృశ్యాలు చానళ్లలో ప్రసారం అయ్యాయి. దట్టమైన మంచుకారణంగా ప్రమాద స్థలానికి వెంటనే అత్యవసర సర్వీసు బృందాలను తరలించడం సాధ్యం కాలేదని, కాలినడకనే సిబ్బంది అక్కడికి వెళ్లాల్సి వచ్చిందని రష్యా ఎమర్జెన్సీ సర్వీసుల విభాగం తెలిపింది. మాస్కో నుంచి బయలుదేరిన నాలుగు నిముషాల్లోనే ఈ విమానం రాడార్ పరిధి నుంచి అదృశ్యమైనట్టు తెలుస్తోంది. మానవ తప్పిదం, దట్టంగా మంచు కురవడం సహా అనేక అంశాలు ఈ దుర్ఘటనకు కారణమై ఉండవచ్చునని భావిస్తున్నారు.

నద్వీపై బోర్డు బహిష్కరణ వేటు

అయోధ్య వివాదంలో వ్యాఖ్యలపై మండిపాటు

బాబ్రీ మసీదుపై వెనకడుగు లేదన్న ఏఐఎంపిఎల్‌బి


ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: అయోధ్యలో రామాలయం నిర్మాణానికి సహకరిస్తామని, తమకు ప్రత్యామ్నాయంగా భూమి ఇస్తే సరిపోతుందని వ్యాఖ్యానించిన అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు మౌలానా సయ్యద్ సల్మాన్ హుస్సేన్ నద్వీపై బోర్డు బహిష్కరణ వేటువేసింది. బాబ్రీ మసీదు స్థలం విషయంలో వెనకడుగు వేసేది లేదని, సాధించే వరకూ పోరాటం కొనసాగిస్తామని ముస్లిం పర్సనల్ లా బోర్డు తేల్చి చెప్పింది. ఇటీవల ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవి శంకర్ బెంగళూరులో - మిగతా 6వ పేజీలో

ఘనగామా



మీలాగే వాళ్లకూ ఢిల్లీలో చేయించమంటున్నారు సార్!!



ఒపెరా హౌస్‌లో భారత సంతతి ప్రజలకు శిరసువంచి అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ. ఇన్‌సెట్‌లో యూఏఈలో నిర్మించనున్న స్వామి నారాయణ ఆలయ నమూనా

ఆనందంగా ఉంది

యుఏఈలో హిందూ ఆలయానికి మోదీ శంకుస్థాపన

దుబాయ్, ఫిబ్రవరి 11: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మొట్టమొదటి హిందూ ఆలయ నిర్మాణ ప్రాజెక్టుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. దుబాయ్ ఒపెరా హౌస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వామినారాయణ ఆలయానికి మోదీ శంకుస్థాపన చేస్తూ, మానవత్వం, సామరస్యం, భారతీయతకు ఈ పవిత్ర ప్రాంతం తలమానికంగా నిలువగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నమూనాను ఆవిష్కరించారు. 55వేల చదరపు మీటర్ల స్థలంలో బోచసాన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఆలయ నిర్మాణ ప్రాజెక్టుకు అనుమతించిన దుబాయ్ యువరాజుకు 125 కోట్ల భారతీయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.


అబుదాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ స్వయంగా ఆలయ నిర్మాణం పట్ల ఆసక్తి కనబర్చడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ప్రవాస భారతీయుల హర్షధ్వానాల మధ్య వెల్లడించారు. భారత్-యూఏఈల మధ్య ఉన్న సంబంధాలు కేవలం వ్యాపార వాణిజ్యాలకే పరిమితమైనవి కావని, అనేక రంగాల్లో ఇవి ఎంతగానో విస్తరించాయన్నారు. అంతర్జాతీయ స్థాయికి భారత్‌ను తీసుకెళ్లాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఒక్క గల్ఫ్ దేశాలతోనే కాకుండా ప్రపంచ దేశాలు అన్నింటితోనూ ఈ రకమైన సంబంధాలనే భారత్ కోరుకుంటోందన్నారు.

లెక్కకు లెక్కే జవాబు

- సాయంపై స్పష్టత వస్తేనే శాంతం
- ప్రకటన వచ్చే వరకూ ఆందోళన
- ఎంపీలకు సీఎం చంద్రబాబు పిలుపు
- కేంద్రానివి కాకి లెక్కలు: కళా
- ఆకలి వేసినప్పుడే అన్నం పెట్టాలి: రామ్మోహన్
- హరిబాబు ప్రకటనలో కొత్తదనమేదీ లేదని తెలుగుదేశం వ్యాఖ్య

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 11: కేంద్రం చెబుతున్న లెక్కలకు మనమూ లెక్కలతోనే సమాధానం చెప్పాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఎంపీలను ఆదేశించారు. ఆదివారం తన పార్టీ ఎంపీలతో సమావేశమైన చంద్రబాబు, కేంద్రం నుంచి స్పష్టత వచ్చే వరకూ ఆందోళన విరమించవద్దని ఆదేశించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు హరిబాబు ఇచ్చిన లెక్కల్లో కొత్తదనమేదీ లేదని, జైట్లీ చెప్పినవే ఆయనా చెప్పారని ఎంపీలు ఆయన దృష్టికి తెచ్చినపుడు స్పందించిన చంద్రబాబు. మనమూ లెక్కలతోనే సమాధానం చెప్పాలన్నారు. అందరితోపాటు సమానంగా ఏపీకి ఇచ్చేదేదో ఇస్తూ, రాష్ట్రానికేదో ప్రత్యేకంగా ఇస్తున్నట్లు కేంద్రం పెద్దలు మాట్లాడటమేంటని ప్రశ్నించారు. మార్చి 5వరకూ వేచి చూద్దామని, అప్పటికి కేంద్రం నుంచి స్పష్టత వస్తుందేమో చూద్దామన్నారు. అప్పటికీ స్పందన రాకపోతే ఆందోళన కొనసాగిద్దామని అన్నారు. 'మనకు ఎవరితోనూ మొహమాటాలు లేవు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ఢిల్లీలో జరిగే పరిణామాలు, సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోండి' అని ఎంపీలకు సూచించారు.



కేంద్రానివి కాకి లెక్కలు

ప్రజల మనోభావాలకు విరుద్ధమైన విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి వాస్తవంగా దక్కాల్సిన ప్రయోజనాలను ఇవ్వాలని మాత్రమే తాము కేంద్రాన్ని కోరుతున్నామని తెలుగుదేశం పార్టీ పేర్కొంది. నాలుగేళ్లలో రాష్ట్రానికి కేంద్రం ఏమిచ్చిందో వివరిస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు శనివారం విడుదల చేసిన 27 పేజీల ప్రెస్‌నోట్‌పై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు, ఎంపీలు గల్లా జయదేవ్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు ఆక్షేపణ వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుతో సమావేశమైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ కేంద్రానికి కాకిలెక్కలని విమర్శించారు. అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినట్టే ఏపీకీ ఇచ్చారు తప్ప, ప్రత్యేకంగా ఏమీ ఒనగూర్చలేదని ఆక్షేపించారు.

అసంతృప్తితో ఉన్నాం: కళా

ఏపీని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని కళా వెంకట్రావు స్పష్టం చేశారు. ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొనవన్నీ కేంద్రం నెరవేర్చాల్సిందేనని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కావాల్సిన కేటాయింపులు కేంద్ర బడ్జెట్‌లో లేవన్నారు.

బడ్జెట్‌లో కేటాయింపులపై మిత్రపక్షంగా తాము అసంతృప్తిగా ఉన్నామని, రాష్ట్ర ప్రయోజనాలే టీడీపీకి ముఖ్యమని స్పష్టం చేశారు. ఆకలి వేసినప్పుడే అన్నం పెట్టాలని కేంద్రం తెలుసుకుంటే మంచిదని. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లయినా హామీలు నెరవేర్చలేదని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు విమర్శించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏపీకి ప్రత్యేకంగా నెరవేర్చవలసినవేనన్నారు. విజయవాడ, విశాఖ నగరాలకు మెట్రో రైల్ కూడా విభజన చట్టంలో పేర్కొన్న హామీలేనని గుర్తుచేశారు. 'పొరుగు రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందాలని ఆంధ్రులు కోరుకోవడం తప్పా? పదేళ్ల సమయం ఉంది కదా అని ఎప్పుడో చేస్తామని చెప్పడం ఏమిటి? ఆకలి వేసినప్పుడే అన్నం పెట్టాలి' అని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌ను ప్రజలంతా నిరాకరించారని గుర్తు చేశారు.



రాష్ట్రానికి రూ.588 కోట్లు

- సింహభాగం మహారాష్ట్రకే..
- స్మార్ట్ నిధుల వివరాలిచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఆంధ్రప్రదేశ్‌కు 588 కోట్లు సహా దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీల నిర్మాణంలో భాగంగా వివిధ రాష్ట్రాలకు 9,940 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో మహారాష్ట్రకు అత్యధిక స్థాయిలో 1378 కోట్లు, రెండోస్థానంలోవున్న మధ్యప్రదేశ్‌కు 984 కోట్లు లభించాయి. కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కేంద్ర ప్రభుత్వ సహాయంతో నిర్మించే 99 స్మార్ట్ సిటీలను ప్రకటించిన విషయం తెలిసిందే. వీటి నిర్మాణం కోసం మొత్తం 2.03లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాలని కేంద్రం సంకల్పించింది. పూణె, నాసిక్ సహా మహారాష్ట్రకు 8 స్మార్ట్ సిటీలు లభించాయి. అలాగే మధ్యప్రదేశ్‌కు ఏడు స్మార్ట్ సిటీలను కేంద్రం ప్రకటించింది. అత్యధిక స్థాయిలో 11 స్మార్ట్ సిటీలను పొందిన తమిళనాడుకు 848 కోట్ల రూపాయలను కేంద్రం ఇప్పటి వరకూ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిపాదించిన నాలుగు నగరాలకు ఇప్పటి వరకు 588 కోట్లు ఇచ్చామని తెలిపింది.

ఉత్తరప్రదేశ్‌కు 547, గుజరాత్‌కు 509 కోట్లు లభించాయి. నగరాల నిర్మాణంతోపాటు అత్యున్నతస్థాయి సౌకర్యాల కల్పనే లక్ష్యంగా స్మార్ట్ సిటీల ప్రాజెక్టును ప్రభుత్వం ప్రకటించింది.



జనసేన కార్యాలయంలో మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత ఉండవల్లితో ఏపీ సమస్యలపై చర్చిస్తున్న పవన్ కల్యాణ్

వచ్చినదెంత? వెచ్చించినదెంత!?

- కేంద్రం సాయంపై శ్వేతపత్రం విడుదల చేయండి
- 15లోగా నిధుల లెక్కలు ప్రజలకు తెలియాలి
- తరువాత సంయుక్త నిజనిర్ధారణ పరిశీలిస్తుంది
- ఏపీ సర్కారుకు పవన్ కల్యాణ్ డిమాండ్
- జనసేన ఆఫీసులో మాజీ ఎంపీ ఉండవల్లితో భేటీ
- పవన్ ఆలోచన బాగుందన్న మాజీ ఎంపీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణతో ఏపీ కాంగ్రెస్ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆదివారం కీలక భేటీ నిర్వహించారు. రాష్ట్ర సమస్యలు, కేంద్రం తీరు, ప్రభుత్వ తప్పిదాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏపీ సర్కారుకు ఈనెల 15 వరకు డెడ్‌లైన్ విధిస్తూ, అప్పట్లోగా కేంద్రం మంజూరు చేసిన నిధులు, ఎంత ఖర్చు చేశారు?, ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులకు సంబంధించి సమగ్ర వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు తాను ఎన్నోసార్లు అడిగినా ప్రభుత్వం నుంచి నిధుల విషయంలో స్పందన లేదని పవన్ కల్యాణ్ అన్నారు. శ్వేతపత్రం విడుదల చేస్తే ఉండవల్లి, లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ వంటి వివిధ రంగాలకు చెందిన మేధావులతో సంయుక్త నిజ నిర్ధారణ కమిటీ నియమించి చర్చిస్తామన్నారు. ఆపై ఏం చేయాలనేది - మిగతా 6వ పేజీలో


ఇంధన పొదుపులో మీరే టాప్

ఏపీకి టీఈఆర్ఐ చీఫ్ అజయ్ మాథుర్ ప్రశంస

- ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సుకు బాబుకు ఆహ్వానం
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం: చంద్రబాబు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 11: ఇంధన పొదుపులో దేశానికి మీరే ఆదర్శమని, ఈనెలలో ఢిల్లీలో జరిగే ప్రపంచ సదస్సుకు హాజరై ఇంధన పొదుపులో విజయ రహస్యాలు, విధానాలపై దిశా నిర్దేశం చేయాలని టీఈఆర్ఐ చైర్మన్ అజయ్ మాథుర్ సీఎం చంద్రబాబుని కోరారు. ఢిల్లీలో 15 నుంచి 20 వరకూ నిర్వహించనున్న ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సులో పాల్గొనాల్సిందిగా చంద్రబాబుని కేంద్ర ఇంధన, వనరుల సంస్థ ఆహ్వానించింది. పునరుత్పాదక ఇంధనం, ఇంధన పొదుపు అంశాల్లో ముందు చూపుతో రాష్ట్రం చేపడుతున్న అనేక కార్యక్రమాల వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధ్యమవనుంది. ప్రపంచ వ్యాప్తంగా హరిత ఇంధన కార్యక్రమాల అమలులో ప్రభుత్వాలు, మేధావులు కలిసి పనిచేసేలా చూడటమే తమ లక్ష్యమని టీఈఆర్ఐ చైర్మన్ డాక్టర్ అజయ్ మాథుర్ సీఎంకు వివరించారు. వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు చేసిన తీర్మానాల అమలులో ఆంధ్రలాంటి క్రియాశీలక రాష్ట్రాలు తప్పనిసరిగా భాగస్వాములవ్వాలని కోరారు. 'ఇంధన సామర్థ్యంలో మీరు దేశంలోనే ఛాంపియన్. మీ అనుభవాల నుంచి ఎంతో మంది స్ఫూర్తి పొందుతారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను తక్షణమే చేపడతారని' పేర్కొన్నారు. తనను సదస్సుకు ఆహ్వానించిన మాథుర్‌కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం చేపట్టే చర్యలకు తాము సంపూర్ణ మద్దతిస్తామని స్పష్టం చేశారు. వివిధ రంగాలు, వర్గాల మధ్య మంచి సమన్వయం, సహకారంతో పాటు అవసరమైన ఆర్థిక వనరులు, ఉత్తమ విధానాలు కలిగిన పాలన ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో ఉంటారని చెప్పారు. పర్యావరణ హిత కార్యక్రమాల అమలులో భాగంగా తమ ప్రభుత్వం 100 శాతం కాలుష్య రహిత వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. తిరుపతి, విశాఖపట్నం, అమరావతిలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రారంభించి, వాటిని రాష్ట్రమంతటికీ విస్తరిస్తామన్నారు. ఈ-వాహనాలకు అవసరమైన ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి విద్యుత్ సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించామన్నారు. ఇది పర్యావరణ హిత కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న మరో విప్లవాత్మక చర్య అన్నారు.



కాషాయం జోలికెళ్తే కటీఫ్

రజనీతో పొత్తుపై కమల్‌హాసన్ మెలిక 5

ఒడిశా నుంచి వేరుపడితేనే అభివృద్ధి

❖ వాజపేయి హయాంలో ఏడు జోన్ల ఏర్పాటు ❖ అప్పుడు లేని కమిటీ ఇప్పుడు ఎందుకు?

❖ విశాఖ జోన్ వల్ల ఒడిశాకు నష్టం రాదు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 11: విశాఖ రైల్వే జోన్... ఇప్పుడు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కుదిపేస్తున్న అంశం. 70వ దశకంలో తెన్నేటి విశ్వనాథం ఎంపీగా ఉన్నప్పటి నుంచి విశాఖ రైల్వే జోన్ గురించి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ వచ్చారు. ఇప్పుడు ఈ రైల్వే జోన్ విశాఖ ప్రజలకు సెంటిమెంట్‌గా మారింది. దీనికి కారణం ఒడిశా అధికారుల ఆధిపత్యం! తెలుగువారిని చులకనగా చూడ్డం, తెలుగు వారికి కొత్త రైళ్లు రాకుండా చేయడం. కనీసం కొత్త కోచ్‌లు కూడా ఇవ్వడానికి ఇష్టపడని అధికారుల నిర్లక్ష్య ధోరణి... రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్షల కోసం తెలుగు అభ్యర్థులు ఒడిశాకు వెళితే, వారి హాల్ టిక్కెట్‌లు చించేసి, రక్తం వచ్చునట్టు కొట్టిన వైనాన్ని విశాఖ వాసులు ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. వీటన్నింటికన్నా, విశాఖ డివిజన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కేవలం 30 నుంచి 40 శాతం మంది మాత్రమే తెలుగువాళ్లు. మిగిలిన వారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. ఈ బాధలు తట్టుకోలేకే, ఒడిశా నుంచి తెగతెంపులు చేసుకోవాలని తెలుగువారు భావిస్తున్నారు.

ఏడాదికి ఎనిమిది వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్న వాల్తేరు డివిజన్ అభివృద్ధికి నోచుకోపోవడానికి కారణం కేవలం ఒడిశా అధికారుల సవతి తల్లి ప్రేమే.

∷ 1997 ఆగస్ట్ తొమ్మిదో తేదీన భువనేశ్వర్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోనల్ కార్యాలయానికి అప్పటి ప్రధాని దేవేగౌడ్ శంకుస్థాపన చేశారు. ఇదే సమయంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో వాల్తేరు డివిజన్‌ను చేర్చొద్దంటూ విశాఖలో ద్రోణంరాజు సత్యనారాయణ నేతృత్వంలో చలసాని గాంధీ, ఎంపీలు కొండపల్లి పైడితల్లి నాయుడు, ఎర్రన్నాయుడు తదితరులు విశాఖలో మహా ధర్నా చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీన 2003 నుంచి ఆ కార్యాలయం పనిచేసింది. మొదట కుర్దా, సంబల్‌పూర్ డివిజన్‌లతో ఏర్పడిన ఈ జోన్, ఆ తరువాత విశాఖ డివిజన్‌ను కూడా అందులో విలీనం చేసుకుంది. అప్పటి నుంచి వాల్తేరు డివిజన్ ఒడిశా మోచేతి నీరు తాగాల్సి వస్తోంది.

∷ ఒడిశాకు 15 ఏళ్ళ కిందట రైల్వే జోన్ వచ్చింది. అలాగే, కొత్త డివిజన్ కూడా వచ్చింది. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే జోన్ ఇస్తామని ప్రకటించిన కేంద్రం ఇప్పుడు మీన మేషాలు లెక్కపెట్టడంలో అర్థంలేదు.

∷ వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఏడు కొత్త రైల్వే జోన్‌లు ఏర్పాటు చేశారు. హుబ్లీ(కర్ణాటక), అలహాబాద్(ఉత్తరప్రదేశ్), బిలాస్‌పూర్(ఛత్తీస్‌గఢ్), జైపూర్(రాజస్థాన్), హాజీపూర్(బీహార్), భువనేశ్వర్(ఒడిశా), జబల్‌పూర్(మధ్యప్రదేశ్) జోన్‌లుగా ఏర్పడ్డాయి. ఆ తరువాత కేవలం 50 కిలో మీటర్ల నిడివిలో ఉన్న కోల్‌కతా మెట్రో రైల్‌ను అప్పటి రైల్వే మంత్రి మమతా బెనర్జీ రైల్వే జోన్‌గా ప్రకటించారు. ఈజోన్ ల ఏర్పాటుపై ఎటువంటి కమిటీలను అప్పటి ప్రభుత్వం నియమించలేదు. విశాఖ రైల్వే జోన్ కోసం కమిటీ ఏర్పాటు చేయడం కేవలం ఈ అంశాన్ని వెనక్కు నెట్టడం తప్ప, వేరొకటి కాదు.

∷ వాల్తేరు డివిజన్‌ను ఈస్ట్‌కోస్ట్ రైల్వే నుంచి వేరు చేయడం వలన ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఆదాయం తగ్గుతుందన్నది కేవలం వితండ వాదన. వాల్తేరు డివిజన్‌ను ఈస్ట్‌కోస్ట్ నుంచి వేరు చేస్తే, ఒడిశా ఆధిపత్యం తగ్గిపోతుందనే విశాఖ జోన్‌కు ఒడిశా అధికారులు అడ్డుపడుతున్నారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వేకు ఏడాదికి 18,000 కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. ఇందులో 8,000 కోట్ల రూపాయల ఆదాయం వాల్తేరు డివిజన్ నుంచే సమకూరుతోంది. ఇటువంటి వాల్తేరు డివిజన్‌ను ఈస్ట్‌కోస్ట్ రైల్వే వదులుకున్నా, సౌత్ ఈస్ట్రన్ రైల్వేలోని బాలాసూర్, రౌర్‌కెలాలను ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో చేర్చడానికి ఎటువంటి అభ్యంతరాలు ఉండవు.

∷ విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలనుకుంటే, కుర్దా డివిజన్‌లోని సోంపేట, ఇచ్ఛాపురం, పలాస, అరకు సరిహద్దుల నుంచి విశాఖ జోన్ ప్రారంభం కావల్సి ఉంటుంది. ఇందులో వాల్తేరు డివిజన్‌తోపాటు, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్‌లు వస్తాయి. అవసరమైతే సామర్లకోట లేదా రాజమండ్రిని కొత్త డివిజన్‌గా ఏర్పాటు చేసుకోవచ్చు.

∷ జోన్ వస్తే, భారతీయ రైల్వేలో అక్కడక్కడ పనిచేస్తున్న తెలుగువారంతా ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. కొత్త రైళ్ల పెరిగే అవకాశం ఉంది. రైల్వే జనరల్ మేనేజర్ విశాఖలోనే ఉండడం వలన ఏపీ ఎంపీలు ఎప్పటికప్పుడు ఆయనను కలిసేందుకు వీలుంటుంది. ఏపీ ముఖ్యమంత్రికి రైల్వే జీఎం అందుబాటులో ఉండడం వలన రైల్వేపరంగా అనేక సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుంది. కొత్త ఉద్యోగాలు వస్తాయి. కొత్త ప్రాజెక్ట్‌లు వస్తాయి.

∷ విశాఖలో రైల్వే స్థలాలు అధికంగా ఉన్నాయి. ఒకవేళ రైల్వే జోన్ వస్తే, కొమ్మాది వద్ద రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంది. భారతీయ రైల్వేలో అత్యంత ప్రతిష్ఠాత్మక డీజిల్, ఎలక్ట్రికల్ లోకో షెడ్ విశాఖలోనే ఉన్నాయి. రైల్వే సిబ్బంది అంతటికీ సరిపడినన్ని క్వార్టర్స్ ఉన్నాయి. అతి పెద్ద రైల్వే ఆసుపత్రి ఉంది.



విలేఖర్లతో మాట్లాడుతున్న ఎంపీ గల్లా జయదేవ్

బీజేపీ మద్దతుతోనే విభజన

నష్టం కలిగిస్తే సహించం: ఎంపీ గల్లా జయదేవ్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 11: బీజేపీ మద్దతుతోనే రాష్ట్ర విభజన జరిగిందని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ వ్యాఖ్యానించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆధ్వర్యంలో ఎంపీల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన ఎలా జరిగిందో అందరికీ తెలిసిందేనని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాలతో ఏపీని చూడాలని కేంద్రానికి సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే సహించబోమని, రాష్ట్ర విభజనతో చాలా ఆస్తులు కోల్పోయామని తెలిపారు. రాష్ట్రాన్ని అసంబద్ధంగా విడదీసారని, తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉందని తెలిపారు. విభజన సమయంలో ఏపీకి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని విస్మరించారని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలతో సమానస్థాయి వచ్చే వరకు కేంద్రం సాయం చేయాలని డిమాండ్ చేశారు. పన్నుల్లో మినహాయింపు ప్రోత్సాహకాలను ఇచ్చి విభజన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు.

బతికున్నానని చెప్పాల్సిందే!

మృతుల పేరిట పెన్షన్ల జారీతో కళ్లుతెరచిన ట్రెజరీ శాఖ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 11: ఏనాడో మరణించిన ఉద్యోగుల పేరిట కూడా ఏళ్ల తరబడి నెలనెలా కోట్లాది రూపాయల్లో పెన్షన్లు జారీ కావటం తాజాగా తెనాలి ఘటనతో బట్టబయలు కావటంతో రాష్ట్ర ట్రెజరీశాఖ అప్రమత్తమైంది. ఇక నుంచి ప్రతి పెన్షన్‌దారు కూడా ఎక్కడ నివసిస్తున్నప్పటికీ తన ఖాతా కల్గిన సబ్ ట్రెజరీ కార్యాలయానికి ఏడాదికోసారి వెళ్లి తాను జీవించి ఉన్నట్లుగా సర్టిఫికెట్ ఇస్తేనే మరుసటి నెల నుంచి పెన్షన్ జారీ అవుతుంది. ఇటీవల కాలంలో పెన్షన్‌దారు స్వయంగా రాకపోయినప్పటికీ ఏడాదికోసారి గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరణతో ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ పంపిస్తే సరిపోయేది. అయితే కొందరు ప్రబుద్ధులు తమ కుటుంబాల్లో మరణించిన పెన్షన్‌దారుల సమాచారాన్ని అందించకుండా వీరు జీవించి ఉన్నట్లుగా ఫోర్జరీ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పంపుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. తెనాలిలో ఓ ప్రబుద్ధుడు పదేళ్ల క్రితం మరణించిన తల్లి పేరిట నెలనెలా పెన్షన్ పొందుతున్న వైనం.. అదీ ఆ కుటుంబంలోని ఒకరు పంపించిన ఆకాశరామన్న లేఖతో గాని బట్టబయలు కాలేదు. దీనిపై ఇటీవలే తెనాలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావటం అతను అరెస్ట్ కావటం జరిగిపోయాయి. తెనాలి ప్రాంతానికి చెందిన వాణిజ్య పన్నుల శాఖ రిటైర్డ్ అధికారి ఒకరు తన తల్లి లక్ష్మీభాయి ఫ్యామిలీ పెన్షన్ పొందుతూ 2010లో మరణించినప్పటికీ ఆమె మరణాన్ని కప్పిపుచ్చి ప్రతి ఏటా తల్లి బతికి ఉన్నట్లుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పంపుతూ లక్షలాది రూపాయల మేర స్వాహా చేశాడు. ఇలాంటి ఘటనలే విశాఖ, విజయనగరం తదితర జిల్లాల్లో జరిగాయి. దీంతో ట్రెజరీ శాఖ తిరిగి కాలం చెల్లిన విధానాన్ని తెరపైకి తీసుకువచ్చింది. అయితే బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రతో లైఫ్ సర్టిఫికెట్ అందచేయాల్సి ఉంది. అయితే 70ఏళ్లకు పైబడిన వృద్ధుల వేలిముద్రలు సక్రమంగా పడకపోవడాన్ని గమనించిన ట్రెజరీ శాఖ వారి వరకు కొంత మినహాయింపు నిస్తూ పాత విధానం ప్రకారం లైఫ్ సర్టిఫికెట్ అందచేస్తే సరిపోతుంది. ఇక వ్యాధుల బారిన పడటం లేదా వృద్ధాప్యం కారణంగా మంచం మీద నుంచి లేవలేని పెన్షన్‌దారులు ఎవరైనా ఉంటే ఏడాదికోసారి సంబంధిత సబ్ ట్రెజరీశాఖ ఉద్యోగి ఒకరు ఆ ఇంటికెళ్లి లైఫ్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంది.

మస్కట్ బాధితులను ఆదుకోవాలి

విజయవాడ (క్రైం), ఫిబ్రవరి 11: మస్కట్ సుల్తానా మోసానికి బలై సహాయం కోసం ఎదురు చూస్తున్న బాధిత మహిళలను వెంటనే స్వగ్రామానికి తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని కాపునాడు డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కాపునాడు జాతీయ కార్యదర్శి గాళ్ళ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు ఒక ప్రకటనలో కోరారు. సుల్తానా వసూలు చేసిన డబ్బును కూడా బాధితులకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని, స్వగ్రామాలకు తిరిగి వచ్చిన తర్వాత వారికి ప్రభుత్వం నుంచి తగిన ఉపాధి, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. దుబాయిలో ఉద్యోగాల పేరుతో మహిళలను మోసం చేసిన మాయలేడి సయ్యద్ మజహర సుల్తానాను మస్కట్‌లోని బాధితుల సమాచారంతో హైదరాబాద్‌లోని విమానాశ్రయ అధికారులు అప్రమత్తమై సుల్తానాను అదుపులో తీసుకున్నారు. నిందితురాలిని పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సుల్తానాపై మస్కట్‌లోని భారత దౌత్య కార్యాలయంలో గతంలోనే ఫిర్యాదు చేసిన శాంతి అనే బాధితురాలి భర్త, కుటుంబ సభ్యులు విశాఖపట్నం జిల్లా భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అంతా.. మీరే చేశారు!

❏ నాలుగేళ్లు అనాధగా వదిలేశారు ❏ పార్టీని టీడీపీకి అప్పగించేశారు ❏ ఏం చేయాలో స్పష్టత ఇవ్వలేదు ❏ ఏం జరుగుతోందో మాకే తెలియడం లేదు ❏ ఇప్పుడు మాట్లాడితే నమ్మేదెవరు? ❏ నాయకత్వంపై కమలదళాల అసంతృప్తి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో పార్టీ వెనుకబాటుతనానికి, తమకు గళం లేకుండా పోవడానికి తమ నాయకత్వం అనుసరిస్తోన్న విధానాలే కారణమని బీజేపీ నాయకులు విరుచుకుపడుతున్నారు. నాలుగేళ్లు పార్టీని టీడీపీ నాయకత్వానికి, వారికి అనుకూలంగా ఉండే తమ పార్టీ అగ్రనేతలకు విడిచి పెట్టి ఇప్పుడు ఎదురుదాడి చేస్తే ఫలితం ఏమిటన్న ప్రశ్నలు కమల దళాల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటిదాకా టీడీపీపై ఎలా వ్యవహరించాలో స్పష్టత లేదని, పై స్థాయిలో ఏం జరుగుతోందో? పార్టీ వ్యూహమేమిటో తెలియనంత గందరగోళంలో ఉన్నామన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల వ్యవహారంపై టీడీపీ-బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం ముదురుపాకాన పడింది. కేంద్రం తమకేమీ చేయడం లేదని ప్రజలు నమ్మే పరిస్థితికి రావడానికి తమ కేంద్ర నాయకత్వం అనుసరిస్తోన్న నిర్లిప్త వైఖరే కారణమని బీజేపీ సీనియర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా పార్టీని ఒక సామాజికవర్గం పెత్తనానికి, వారి అభీష్టానికి వదిలేసిన నాయకత్వం, అసలు రాష్ట్రంలో ఏం జరుగుతోందో కూడా తెలుసుకోలేనంత నిర్లిప్తవైఖరి ప్రదర్శించిందని గుర్తు చేస్తున్నారు. చివరకు రాష్ట్ర పార్టీని ప్రభావితం చేసే వర్గం నేతల వ్యవహారాలను ప్రశ్నిస్తూ, కేంద్ర పార్టీకి నివేదికలిచ్చే సంస్థాగత ప్రధాన కార్యదర్శికి వ్యతిరేకంగా కథనాలు రాయించే పరిస్థితి వచ్చినా, ఢిల్లీ నాయకత్వం మిన్నకుండిపోయిందని గుర్తు చేస్తున్నారు.

'ఈ వైఖరితో పొత్తు రెండు పార్టీల మధ్యనా? లేక ఇద్దరు వ్యక్తులు, రెండు కులాల మధ్యనా అన్న గందరగోళం క్యాడర్‌లో ఉందని మేం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. పార్టీని, చివరకు మోదీని టీడీపీ వాళ్లు విమర్శించినా మా రాష్ట్ర అధ్యక్షుడు మౌనంగా ఉన్నా దాన్ని ఢిల్లీ నాయకత్వం పిలిచి ప్రశ్నించలేదు. మా మంత్రులిద్దరిలో ఒకాయన టీడీపీ కార్యకర్త కంటే ఎక్కువ పనిచేస్తుంటే, ఇంకొకాయన సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. గడువు తీరినా ఇప్పటి దాకా కొత్త అధ్యక్షుడిని ప్రకటించలేదు. పార్టీ ఆఫీసులో ఇంకా ఒక వర్గం వారి పెత్తనం ఉన్నందుకే నేతలెవరూ అటు వెళ్లడం లేదు. అటు జిల్లాల్లో మా పార్టీ వారికి గౌరవం లేదని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే ఇక ఈ రాష్ట్రంలో బీజేపీ ఉన్నట్లా? లేనట్లా?' అని ఓ సీనియర్ నేత తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

ఇప్పుడు రాష్ట్రానికి కేంద్రం ఏమిచ్చిందో చెప్పాలని ఆదేశిస్తున్న ఢిల్లీ నాయకత్వం.. ఆ పని రెండేళ్ల క్రితమే చేసి ఉంటే రాష్ట్రంలో ఈ దుస్థితి వచ్చేది కాదని మెజారిటీ నేతలు స్పష్టం చేస్తున్నారు. అసలు ఇప్పటివరకూ స్వయంగా రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రం ఏమిచ్చిందో వివరించలేదని, అధ్యక్షుడు సహా ఇద్దరు మంత్రులు టీడీపీ విమర్శలను తిప్పికొట్టకపోగా, ఎదురుదాడి చేసిన వారి ప్రతివిమర్శను వ్యక్తిగత అభిప్రాయంగా కొట్టిపారేస్తూ, నైతిక స్థైర్యం దెబ్బతీసేలా వ్యవహరిస్తుంటే రాష్ట్రంలో బీజేపీ ఏవిధంగా ఎదుగుతుందన్న ప్రశ్నలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం రాష్ట్ర పార్టీలో సోము వీర్రాజు, పురంధ్రీశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ మాత్రమే టీడీపీ విధానాలకు వ్యతిరేకంగా, పార్టీ విధానాలకు మద్దతుగా మాట్లాడుతుంటే.. వారి విమర్శలన్నీ వ్యక్తిగతమేనని, వాటితో పార్టీకి సంబంధం లేదనే రాష్ట్ర అధ్యక్షుడిని ఇన్నేళ్ల తమ రాజకీయ జీవితంలో ఇప్పుడే చూస్తున్నామని సీనియర్లు వాపోతున్నారు. రాష్ట్రానికి వచ్చే కేంద్ర మంత్రులను పార్టీ ఆఫీసుకో, లేక పార్టీ నేతల ఇళ్లలో భోజనాలకో కాకుండా నేరుగా సీఎం ఇంటికి భోజనానికి తీసుకువెళ్లడంలో, ఇద్దరు ప్రముఖులు ప్రతిసారీ హైజాక్ రాజకీయాలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. గతంలో నితిన్ గడ్కరీ, స్మృతి ఇరానీ, సురేష్ ప్రభు వంటి ప్రముఖులను పార్టీ ఆఫీసుకు రానీయకుండా ఓ మంత్రి లాబీయింగ్ చేసి సీఎం ఇంటికి తీసుకువెళ్లారని గుర్తు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో అసలు రాష్ట్రంలో పార్టీ ఉందా? మా రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ఆందోళన పెరుగుతోందంటున్నారు. పార్టీలో ఎప్పటి నుంచో పనిచేస్తున్న తమ మనోభావాలే ఈవిధంగా ఉంటే, కాంగ్రెస్‌లో కీలక స్థానాల్లో పనిచేసిన పురంధ్రీశ్వరి, కన్నా, కావూరి వంటి సీనియర్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చివరకు తమ నాయకత్వం నాలుగేళ్ల నిర్లిప్త వైఖరి వల్ల తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటి? పార్టీలో ఉండాలా? లేక టీడీపీకి అనుకూలంగా మారాలా? అవీ కాకపోతే పార్టీ నుంచి వెళ్లిపోయి వ్యాపారాలు చేసుకోవాలా అన్న వైరాగ్యం వస్తోందని ఓ సీనియర్ నేత ఆవేదన వ్యక్తం చేశారు.

తాజా పరిణామాల్లో టీడీపీ పైచేయి సాధిస్తూ, మైనస్ నుంచి ప్లస్ వైపు వెళుతోందని గ్రహించిన నాయకత్వం.. రాష్ట్రానికి ఏం చేశామో చెప్పాలని ఇప్పుడు ఆదేశించడం, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడమేనని సీనియర్లు విశ్లేషిస్తున్నారు. నాలుగేళ్లు మౌనంగా ఉండి, పార్టీ భవిష్యత్తును టీడీపీ ఇష్టానికి వదిలేసి, ఇప్పుడు అదే పార్టీపై ఎదురుదాడి చేస్తే నమ్మేదెవరంటున్నారు. ఢిల్లీలో కేంద్రం ఇచ్చిన జాబితాను మీడియాకు వినిపించే సమయంలో కూడా, తమ రాష్ట్ర అధ్యక్షుడు టీడీపీని కించిత్తు కూడా విమర్శించలేదని గుర్తు చేశారు.

రౌడీషీటర్ దారుణ హత్య

నరసరావుపేట, ఫిబ్రవరి 11: పట్టణంలో రద్దీగా ఉండే ప్రదేశమైన మురళీకృష్ణ రెస్టారెంట్ వద్ద రౌడీషీటర్ బొల్లు నాగరాజు (35) ఆదివారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణంలోని ఎస్‌ఆర్‌కేటీ కాలనీలో నివాసముంటున్న రౌడీషీటర్ బొల్లు నాగరాజు బస్‌స్టాండ్ వద్ద టీ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో జరిగిన పలు హత్యాకేసుల్లో నాగరాజు ముద్దాయి. హత్య ఎవరు చేసారో వివరాలు తెలియరావాల్సి ఉంది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేసుకుని పరిస్థితిని సమీక్షించారు.

సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందే

❖ 'అనంత'లో కొనసాగుతున్న న్యాయవాదుల రిలేదీక్షలు

ఆంధ్రభూమి బ్యూరో



రిలే దీక్షల్లో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం, ఫిబ్రవరి 11 : రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే దాకా ఉద్యమిస్తామని అనంతపురం జిల్లా న్యాయవాదులు స్పష్టం చేశారు. గత నెల 23వ తేదీ నుంచి ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టిన తరుణంలో అనంతపురం న్యాయవాదులు ఆదివారం కూడా నిరవధిక నిరాహార దీక్షను కొనసాగించారు. సీమలో హైకోర్టు ఏర్పాటు సీమ హక్కు... దానిని ఎవరూ కాలరాయరాదంటూ ఉద్యమిస్తున్నారు. అధికార టీడీపీ మినహా బీజేపీ సహా అన్ని పార్టీలు, కుల, ప్రజాసంఘాలు న్యాయవాదుల దీక్షలకు మద్దతు ప్రకటించి సంఘీభావంగా ఆందోళనల్లో పాల్గొంటుండటం విశేషం. తద్వారా రాయలసీమ వాసుల అభీష్టం ప్రతిఫలిస్తోందనే చెప్పాలి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయిన అనంతరం ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల పెద్దమనుషులు కుదుర్చుకున్న శ్రీభాగ్ ఒడంబడిక మేరకు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన వెంటనే రాయలసీమ ప్రాంత వాసుల ఆకాంక్ష మేరకు రాజధాని లేదా హైకోర్టులో ఏది కోరితే అది ఇవ్వాలని నిర్ణయించారన్నారు. 1953 అక్టోబర్ 1వ తేదీ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడగా కర్నూలు రాజధానిగా 1954 జూలై 5వ తేదీ గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారని గుర్తుచేస్తున్నారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన సమయంలో శివరామకృష్ణన్ కమిటీ సూచించిన మేరకు అధికార వికేంద్రీకరణ చేయకుండా పెడచెవిన పెట్టి సీమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో ఉద్యమం నిరవధికంగా సాగుతోంది. అనంతపురం న్యాయవాదుల సంఘం(బార్ అసోసియేషన్)తో పాటు జిల్లాలోని అన్ని న్యాయవాద సంఘాల ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆందోళన కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. వీరి ఆందోళనలకు అధికార టీడీపీ మినహా బీజేపీ, ఇతర పార్టీలన్నీ మద్దతు ఇచ్చి సంఘీభావం తెలపడంతో సీమ ప్రజల హైకోర్టు ఏర్పాటు ఆకాంక్షకు అద్దం పట్టింది. గత 10 రోజులుగా రాయలసీమలో ఉద్యమం తీవ్రతరమైన తరుణంలో జనవరి 23వ తేదీ నుంచి కడప, కర్నూలు, చిత్తూరు జిల్లా మదనపల్లితో పాటు అనంతపురం జిల్లాలోని న్యాయవాదులు ప్రత్యక్ష పోరుకు దిగారు. తొలుత జనవరి 23 నుంచి 29వ తేదీ వరకూ కోర్టు విధులు బహిష్కరించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. 7వ తేదీ నుంచి అనంతపురం నగరంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట న్యాయవాది బి.నారాయణరెడ్డి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో ఆ మరుసటి రోజే పోలీసులు భగ్నం చేశారు. 8వ తేదీ అర్ధరాత్రి దీక్షా శిబిరాన్ని తొలగించి న్యాయవాది నారాయణరెడ్డిని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసుల చర్యను నిరసిస్తూ న్యాయవాదులు భారీ ర్యాలీ నిర్వహించి రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం న్యాయవాది జే.రాజారెడ్డితో పాటు మరికొందరు న్యాయవాదులు గత రెండు రోజులుగా నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు.

కర్నాటకలో కమలానికి 'తెలుగు' సెగ!

❏ సోషల్ మీడియాలో ఉద్ధృతమవుతున్న ప్రచారం ❏ తెలుగువారిని సమాయత్తం చేస్తున్న వైనం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, ఫిబ్రవరి 11: ఏపీకి మొండి చేయి చూపిస్తున్న కేంద్రంలోని బీజేపీకి కర్నాటక ఎన్నికల్లో తమ వాడి చూపేందుకు కర్నాటక తెలుగు వారు సిద్ధమవుతున్నారు. రానున్న కర్నాటక ఎన్నికల్లో అధికారంలోకి రావాలని పరితపిస్తున్న బీజేపీకి అక్కడి తెలుగువారు షాక్ ఇవ్వాలన్న పిలుపు సోషల్ మీడియా ప్రచారరూపంలో ఉధృతమవుతోంది. రాష్ట్రాన్ని విభజించినందుకు కాంగ్రెస్-బీజేపీని ఓడించి ఢిల్లీలో తెలుగు ప్రజలు ఆప్‌ను గెలిపించిన విధంగానే, రానున్న కర్నాటక ఎన్నికల్లో కూడా ముఖ్యంగా ఏపీకి, తెలుగు రాష్ట్రాలకు బీజేపీ చేస్తున్న సహాయ నిరాకరణకు ఓటు రూపంలో జవాబు చెప్పాలన్న ప్రచారం తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది.

బీజేపీకి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారిన కర్నాటక ఎన్నికల్లో ఓ వైపు విజయం సాధించాలన్న లక్ష్యంతో ఆ పార్టీ అడుగులు వేస్తుంటే, మరోవైపు తెలుగు రాష్ట్రాలకు ఆ పార్టీ చేసిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవాలనే ధోరణి అక్కడి తెలుగువారిలో బలంగా కనిపిస్తోంది. ఆ మేరకు గత వారం రోజుల నుంచి బెంగళూరు కేంద్రంగా సోషల్ మీడియాలో వస్తున్న అభిప్రాయాలు, పిలుపులు పరిశీలిస్తే తెలుగువాడి ప్రభావం ఎన్నికల్లో బీజేపీపై స్పష్టంగా చూపే ప్రమాదం కనిపిస్తోంది.

కర్నాటక రాజధాని బెంగళూరు నగరంలోని జయనగర్, వైట్‌ఫీల్డ్, జెపి నగర్, ఇందిరానగర్, కెఆర్ పురం, సదాశివనగర్, ఉత్తరెల్లి ప్రాంతాల్లో తెలుగువారి ప్రాధాన్యం అధికంగా ఉంది. ఇక్కడ ఏపీ, తెలంగాణకు చెందిన తెలుగువారు పలు ఐటీ కంపెనీలతోపాటు, ఇతర ప్రైవేటు కంపెనీల్లో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇక మైసూరు, బళ్లారి, చిక్‌బల్లాపూర్, హొస్పేట, కోలార్, సింధనూరు, చిత్రదుర్గ వంటి ప్రాంతాల్లో అయితే ఏపీకి చెందిన తెలుగువారు కొన్ని దశాబ్దాల క్రితమే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరిలో కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు ఎక్కువ కాగా, బెంగళూరు నగరంలో రాయలసీమకు చెందిన రెడ్డి, బలిజ వర్గాల సంఖ్య ఎక్కువ. వ్యాపారరంగంలో కమ్మ-రెడ్డి వర్గాల ప్రభావం అధికం.

ప్రధానంగా బెంగళూరు రియల్ ఎస్టేట్, ఇసుక, లిక్కర్ రంగాల్లో తెలుగువారి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీ-దేవెగౌడ సారథ్యంలోని జనతాదళ్ మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న నేపథ్యంలో.. 5-10 వేల ఓట్లు ఏ పార్టీకయినా కీలకం కానున్నాయి. దీనిని తెలుగువారికి అన్యాయం చేసిన బీజేపీకి వ్యతిరేక ప్రచార చేయడం ద్వారా, వినియోగించుకోవాలన్న అభిప్రాయం అక్కడి తెలుగుఓటర్లలో వ్యక్తమవుతున్నట్లు అక్కడి నుంచి మొదలైన సోషల్ మీడియా ప్రచారంతో స్పష్టమవుతోంది.

అందులో భాగంగా, శని-ఆది వారాల్లో తెలుగువారు నివసించే ప్రాంతాల్లోని టీ బంకులు, చౌరస్తాలు, అపార్టుమెంట్ కాంప్లెక్సులు, ఆఫీసు క్యాంటిన్లు, పార్కుల వద్ద గుంపులుగా ఏర్పడి, తెలుగు రాష్ట్రాలకు బీజేపీ ప్రభుత్వం చేసిన అన్యాయంపై చర్చించాలన్న పిలుపు సోషల్ మీడియాలో మొదలయింది. తెలుగు రాష్ట్రాలకు, ముఖ్యంగా ఏపి విభజన చట్టం హామీలు నెరవేర్చకుండా బీజేపీ చేసిన అన్యాయానికి సంబంధించి ముద్రించిన కరపత్రాలను ఆ చర్చల్లో పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఇవి తెలుగువారున్న ప్రాంతాల్లో విస్తృతంగా పంపిణీ అవుతున్నాయంటున్నారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని, బీజేపీ చేసిన అన్యాయం ప్రతి తెలుగువాడికి అర్థమయ్యేలా కరపత్రాలు తెలుగువారికి చేర్చి, బీజేపీకి కర్నాటక ఎన్నికల్లో తగిన జవాబు చెప్పాలని హీరో శివాజీ, చలసాని శ్రీనివాస్ పేరుతో సోషల్ మీడియాలో చేసిన విజ్ఞప్తి వైరల్ అవుతోంది.

కాగా ఈ ప్రభావం వచ్చే ఎన్నికల్లో ఏవిధంగా ఉంటుందన్న అంశంపై కర్నాటక తెలుగు అసోసియేషన్, కర్నాటక తెలుగు రాజకీయ చైతన్య వేదిక నేతల అభిప్రాయాన్ని ఆంధ్రభూమి సేకరించింది. ఆ ప్రకారంగా.. ఇప్పటివరకూ తెలుగు ప్రజలు బీజేపీనే సమర్థిస్తున్నారని, గతంలో దేవెగౌడ సారథ్యంలోని జనతాదళ్‌కు మద్దతునిచ్చేవారని చెప్పారు.

'తెలుగువాళ్లకు బీజేపీ అన్యాయం చేస్తుందన్న ఆవేదన అందరిలో ఉంది. కానీ మేం ఇక్కడ మైనారిటీలం. మేము ఎప్పుడో ఇక్కడకు వచ్చిన సెటిలర్లమైనందున ఏ పార్టీతో బహిరంగంగా గొడవ పెట్టుకోలేం. అయితే, ఎవరైనా ముందుకు వస్తే మేం వారికి సహాయం చేస్తామ'ని చిత్తూరు నుంచి కొన్ని దశాబ్దాల క్రితమే వెళ్లిన కర్నాటక తెలుగు అసోసియేషన్‌కు చెందిన ఓ ప్రముఖుడు చెప్పారు.

ఏపీకి అన్యాయం చేసిన బీజేపీకి కర్నాటకలో బుద్ధి చెబితే తప్ప, ఆ పార్టీ ధోరణిలో మార్పు రాదన్న అభిప్రాయం ఇక్కడి తెలుగువారిలో ఉందని కర్నాటక తెలుగు రాజకీయ చైతన్య వేదిక కన్వీనర్ బి.శివశంకర్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన పాపంలో బీజేపీకీ పాత్ర ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చిన ఆ పార్టీకి న్యాయం చేయాల్సిన బాధ్యత కూడా ఉన్నప్పటికీ తెలుగువారంటే లెక్కలేకుండా చూస్తోందన్న ఆగ్రహం ఇక్కడి ప్రతి తెలుగువారిలోనూ ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగువారు ఏ పార్టీకి ఓటేసినా ఫర్వాలేదు. ఏపీకి అన్యాయం చేసిన బీజేపీకి మాత్రం వేయవద్దన్న నినాదంతో తెలుగువారిలో చైతన్యం తీసుకువస్తామని శివశంకర్‌బాబు స్పష్టం చేశారు.

పరిస్థితులను త్వరలోనే చక్కబెడతాం

- రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్‌పై త్వరలోనే సానుకూల నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేస్తే బందరులో పోర్టు నిర్మిస్తాం
- ఆర్థిక లోటు కింద రాష్ట్రానికి మరో రూ.2వేల కోట్లు
- సెంట్రల్ వర్సిటీ, ట్రైబల్ వర్సిటీలకు రూ.20కోట్లు ఇచ్చాం
- రాష్ట్ర విభజన ద్రోహులు మోదీని విమర్శించడం బాధాకరం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు



ఆంధ్రభూమి బ్యూరో

మచిలీపట్నం, ఫిబ్రవరి 11: ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులు త్వరలోనే చక్కబడతాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు కంభంపాటి హరిబాబు అన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్‌తో కలిసి ఆదివారం కృష్ణాజిల్లా మచిలీపట్నం పర్యటనకు వచ్చిన ఆయన కొద్దిసేపు విలేఖర్లతో మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైసీపీ, కాంగ్రెస్, వామ పక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. ఇప్పటికే ఈ విషయంలో రాష్ట్రానికి గడిచిన మూడున్నర ఏళ్లల్లో ఏ మేర నిధులు కేటాయించామో స్పష్టమైన ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న ప్రతి ఒక్క అంశాన్ని ప్రధాని మోదీ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ బంద్ చేసిన కాంగ్రెస్ నాయకులు ఆ నాడు రాష్ట్రాన్ని విభజించిన సమయంలో పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన పునర్విభజన చట్టంలో ఆ అంశాన్ని ఎందుకు ప్రవేశ పెట్టలేదో చెప్పాలన్నారు. పోలవరానికి తూట్లు పొడిచే విధంగా చట్టం చేసిన కాంగ్రెస్ నేతలు నేడు పోలవరంకు నిధులు ఇవ్వలేదని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. 1981వ సంవత్సరంలో పోలవరం నిర్మాణానికి శంకుస్థాపన చేయగా ఆ తర్వాత 17 యేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు పోలవరాన్ని ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ తొలి కేబినెట్ సమావేశంలోనే తెలంగాణలో ఉన్న ఏడు ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వటంతో పాటు వేల కోట్లు నిధులు ఇచ్చి ఒక రూపం తీసుకు వచ్చారన్నారు. పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 93లో 13వ షెడ్యూలులో ప్రవేశ పెట్టిన అంశాలను పదేళ్లల్లో పూర్తి చేయాల్సి ఉండగా పలు అంశాలను తమ ప్రభుత్వం గడిచిన మూడున్నర ఏళ్లల్లో పూర్తి చేసిందన్నారు. నిధుల కేటాయింపుల విషయంలో కొంత మేర బేధాభిప్రాయాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒక అంగీకారంతో సమస్య పరిష్కారానికి కేంద్రం కృషి చేస్తోందని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీలో రాష్ట్రానికి రావల్సిన నిధుల్లో 60శాతం - 90 శాతం మధ్య ఉన్న నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఐదేళ్లకు 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రూ.4వేల కోట్లు నిధులు ఇచ్చామన్నారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఐదు సంస్థలను పేర్కొనగా ఇప్పటికే అనంతపురంలో కేంద్ర విశ్వ విద్యాలయం, విజయనగరంలో ట్రైబల్ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. వీటికి పార్లమెంట్‌లో చట్టం చేయాల్సి ఉండగా తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఒక్కొక్క సంస్థకు రూ.10కోట్లు మేర నిధులు కేటాయించినట్లు వివరించారు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి రక్షణ శాఖ, ఇస్రో అభ్యంతరం తెలిపాయన్నారు. దుగ్గరాజపట్నంకు బదులుగా మచిలీపట్నంలో ఓడరేవు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేస్తే ఖచ్చితంగా నిర్మిస్తామన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప స్టీలు ఫ్యాక్టరీల ఏర్పాటుకు సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్నాయన్నారు. వీటిని కూడా పరిష్కరించేందుకు కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకుందని కంభంపాటి హరిబాబు స్పష్టం చేశారు.

ఆంధ్రులను వంచించారు

- బీజేపీ, టీడీపీపై సీపీఎం ధ్వజం
- మహాసభలో మొత్తం 29 తీర్మానాలు
- వివరించిన పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కారత్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్‌కారత్

ఆంధ్రభూమి బ్యూరో

భీమవరం, ఫిబ్రవరి 11: విభజనకు గురైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రజలను వంచించాయని సీపీఎం రాష్ట్ర 25వ మహాసభ తీర్మానించింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న మహాసభల రెండవ రోజు ఆదివారం 29 తీర్మానాలను ఏకగ్రీవంగా తీర్మానించారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంవిఎస్ శర్మ తీర్మానాలను ప్రవేశపెట్టగా మరో కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి బలపరిచారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాష్‌కారత్ తీర్మానాలను మీడియాకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి, వాటికి అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక, విభజన చట్టంలో హామీలను అమలుచేయడం, కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంపై తీర్మానాలు చేశామన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కరవు ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయడానికి ప్రాధాన్యత, విశాఖ ఉక్కుకు స్వంత గనుల కేటాయింపు, చక్కెర కార్మాగారాలు, స్పిన్నింగు మిల్లులు, ఇతర మూతపడిన పరిశ్రమలను తెరిపించడం, ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని మహాసభల్లో తీర్మానించామన్నారు. రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) గ్యారంటీ చట్టం-రైతు రక్షణ నిధి ఏర్పాటు, రుణ మాఫీ, ప్రైవేటు రుణ నియంత్రణ చట్టం అమలుచేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. కార్మిక హక్కులను దెబ్బతీసే చట్టాలను రద్దుచేయ్యాలని, కార్మిక చట్టాలను అమలుచేసే యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.18వేలు కనీస వేతనం ఇచ్చి ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలుచెయ్యాలని తీర్మానించామన్నారు. కులవివక్ష అంతం చేయడం, దళితులకు, బలహీనవర్గాలకు సంపూర్ణ రక్షణ, భూమి లేని నిరుపేదలకు ఉచితంగా రెండు ఎకరాల భూ పంపిణీ, వ్యవసాయ కార్మికులకు ఏడాది పొడవునా పనులు, కనీస కూలి రోజుకు రూ.300 అమలుచేసి, పేదలకు ఉచిత విద్యుత్తు, ప్రతీ ఇంటికీ మరుగుదొడ్డి నిర్మాణం, మంచినీరు, గ్యాస్ సరఫరా చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తోందని ప్రకాష్ కారత్ వివరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తాం: వైసీపీ

- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఉమ
- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తొలగించిన వైనం

గుడివాడ, ఫిబ్రవరి 11: కృష్ణా జిల్లా నందివాడ మండలం అరిపిరాల తారక రామ ఎత్తిపోతల పథకం శంకుస్థాపనకు సంబంధించి ప్రొటోకాల్ రగడపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు వైసీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. అరిపిరాలలో తారకరామ ఎత్తిపోతల పథకానికి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు శనివారంనాడు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు కొడాలి నానిని ఆహ్వానించకపోవడమే కాకుండా ఆవిష్కరించిన శిలాఫలకంపై ఎమ్మెల్యే పేరు కూడా వేయలేదు. అంతేకాకుండా శిలాఫలకంపై తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పేరు వేశారు. ఎమ్మెల్యే అధ్యక్షతన జరగాల్సిన ఈ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని జిల్లా కలెక్టరు లక్ష్మీకాంతానికి ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్వాపరాలు తెలుసుకున్న కలెక్టర్ శనివారంనాడు మంత్రి ఉమ ఆవిష్కరించిన శిలాఫలకాన్ని తొలగించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా నందివాడ మండలంలో ఎంపీపీలు, జడ్పీటీసీల పేర్లు కూడా శిలాఫలకంలో కన్పించకపోవడంతో గుడివాడ ఆర్డీవో చక్రపాణి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడి శిలాఫలకాన్ని తొలగింపజేశారు.

ఈ సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేత పాలడుగు రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా నిర్వహించడం దారుణమన్నారు.



మంత్రి దేవినేని ఉమ ఆవిష్కరించిన శిలాఫలకం. తొలగించిన శిలాఫలకం.



ప్రజాసంకల్ప పాదయాత్రలో అభిమానులు బహూకరించిన నాగలితో వైకాపా అధినేత జగన్

అండగా ఉంటా

ప్రజలకు జగన్ భరోసా ■ జనం నడుమ సాగిన పాదయాత్ర

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, ఫిబ్రవరి 11: అన్ని వర్గాల ప్రజలకు తాను అండగా ఉంటానని వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర 84వ రోజు ఆదివారం నెల్లూరు జిల్లాలోని కావలి నియోజవర్గం దగదర్తి మండలంలోని బోడిగుడిపాడు శివారు ప్రాంతం నుంచి ప్రారంభమై ఉదయగిరి నియోజకవర్గం కలిగిరి మండలం అనంతపురం వరకు సాగింది. ఉదయగిరి నియోజకవర్గంలో జగన్ ఐదు రోజుల పాటు పర్యటించనున్నారు. 84వ రోజు పాదయాత్రలో ఆయన 15.7 కిలోమీటర్లు నడవడం ద్వారా ఇప్పటి వరకు మొత్తం 1140.9 కిలోమీటర్ల యాత్రను పూర్తిచేశారు. బోడిగుడిపాడు శివారు ప్రాంతంలో ప్రారంభమైన యాత్ర జక్కెపల్లిగూడూరు క్రాస్‌రోడ్డు మీదుగా జలదంకి మండలం కొత్తపాళెం గ్రామానికి చేరుకున్న సమయంలో అక్కడ ఆయనకు పార్టీ రాజకీయ సలహా కమిటీ సభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అభిమానుల కోరికను కాదనలేక ఎడ్లబండి ఎక్కి చెర్నాకోలు పట్టుకొని బండిని నడిపి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కొత్తపాళెం గ్రామంలో మహిళలు, వృద్ధులు, రైతులు తమ తమ సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రుణమాఫీ పేరుతో చంద్రబాబు తమను అప్పుల ఊబిలో ముంచేశారని రైతులు, మహిళలు ఈ సందర్భంగా జగన్ ముందు వాపోయారు. మీ అందరి ఆశీస్సులతో మన ప్రభుత్వం వచ్చాక అన్ని సమస్యలను తీరుస్తానని వారికి ఆయన భరోసా ఇచ్చారు. విశాఖపట్నానికి చెందిన పలువురు వైద్యులు ఆదివారం నాటి యాత్రలో జగన్‌ను కలసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. హైదరాబాదు నుంచి తరలివచ్చిన పలువురు యువకులు కూడా ఆయనను కలసి యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తూర్పుగుడ్లదొన క్రాస్‌రోడ్డు వద్ద భోజన విరామం అనంతరం పడమర గుడ్లదొన మీదుగా అనంతపురం శివారు ప్రాంతానికి చేరుకున్న ఆయన ఆదివారం నాటి పాదయాత్రను ముగించారు.

వాతావరణంలో ఒక్కసారిగా మార్పు

తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి జల్లులు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 11: సెంట్రల్ ఇండియా మీదుగా పశ్చిమ దిశ నుంచి తూర్పు వైపు, తూర్పు దిశ నుంచి పశ్చిమ వైపు ప్రయాణిస్తున్న గాలులు ఒకచోట కలవడంతో భారత దేశంలోని అనేక ప్రాంతాల్లో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చినట్టు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ఆదివారం రాత్రి వెల్లడించింది. దీనిని వెస్టన్ డిస్ట్రబెన్స్ అని అంటారు. దీని ప్రభావం వలన సెంట్రల్ ఇండియాలో అనేకచోట్ల చిరు జల్లులు కురుస్తాయి. అలాగే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఒకటి, రెండుచోట్ల చిన్నపాటి జల్లులు కురుస్తాయి. సోమవారం తెలుగు రాష్ట్రాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

ఘనంగా ముగిసిన 'గుణదల' తిరునాళ్లు

భక్తులు హృదయ పరివర్తన పొందాలి ■ బిషప్ తెలగతోటి రాజారావు



గుణదల మేరీమాత ఉత్సవాల్లో సమష్టి దివ్య పూజాబలి సమర్పిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు

విజయవాడ (పటమట) ఫిబ్రవరి 11: ఇక్కడి గుణదలమాత తిరునాళ్లలో మరియ మాతను దర్శించుకున్న భక్తులు హృదయ పరివర్తన పొందాలని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు పిలుపునిచ్చారు. గత మూడు రోజులుగా విజయవాడలోని గుణదల కొండపై జరుగుతన్న గుణదలమాత మహోత్సవాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయి. ఈ ముగింపు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఆశేష భక్తకోటికి సందేశమిచ్చారు. 1885లో ఫ్రాన్సులో ఒక కుగ్రామమైన లూర్దు నగరంలోని బెర్నదత్ అనే 13 ఎళ్ల బాలికకు మరియమాత 18 సార్లు దర్శనమిచ్చిందని తెలిపారు. లూర్దు మాత దర్శనిమిచ్చిన స్థలంలో నిర్మించిన గ్రామం నేడు మహా పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోందని బిషప్ చెప్పారు. నాటి నుండి ప్రపంచ దేశాల భక్తులు లూర్దుమాతను దర్శించుకుని తరిస్తున్నారని అన్నారు. లూర్దుమాత క్షేత్రం సమీపంలో ఉన్న సెలయేరు నీటిని తాగిన వ్యాధిగ్రస్తులు స్వస్థత పొందుతున్నారని చెప్పారు.

అనంతరం కొండ దిగువన ఉన్న బిషప్ గ్రాసి హైస్కూల్ గ్రౌండ్‌లో కొత్తగా నిర్మించిన ఆధ్యాత్మిక కళావేదికపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మోన్‌సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ యం గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టార్ యేలేటి విలియం జయరాజు, ఎస్ఎస్‌సి డైరెక్టర్ ఫాదర్ పసల థోమస్ 'సమష్టి దివ్యపూజాబలి' సమర్పించారు. పూజానంతరం బిషప్ రాజారావు, గురువులు కతోలిక క్రైస్తవులకు దివ్యసత్ప్రసాద అందచేశారు. చివరి రోజు ముగింపు ఉత్సవాలు ఆదివారం కావటంతో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులతో గుణదల కొండ కిక్కిరిసిపోయింది. కొండపై మరియమాత (గుణదలమాత)ను, కొండ శిఖరాన ఏసుక్రీస్తు శిలువను భక్తులు బారులుతీరి దర్శించుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు పీఠం పూర్వ పీఠాధిపతులు మాథ్యూ చెరియన్ కున్నెల్, ఫాదర్ తెలగతోటి పాల్, లయోలా కళాశాల రెక్టార్ ఫాదర్ డి.రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులపై పనిభారం తగ్గిస్తాం

రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడల ముగింపు సభలో ఉప ముఖ్యమంత్రి కేఈ



ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, ఫిబ్రవరి 11: రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి కెఇ కృష్ణమూర్తి చెప్పారు. రెవెన్యూ శాఖలో ఖాళీలను భర్తీ చేస్తామని, త్వరలో 162 తహశీల్దారు పోస్టులను భర్తీచేయనున్నట్టు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి 5వ రెవెన్యూ క్రీడలు ఆదివారం రాత్రి ముగిశాయి. ముగింపు సభలో ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఉండే రెవెన్యూ ఉద్యోగులకు ఆటవిడుపు కోసం ఇటువంటి క్రీడా కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడల్లో పాల్గొనే ఉద్యోగులు మానసికంగా, శారీరంగా ఆరోగ్యవంతులుగా ఉంటారని, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపే ఉద్యోగులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని తెలిపారు. పోటీల విజేతలను మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, సంయుక్త కలెక్టర్ మల్లికార్జున, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అంజిబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో సుప్రీం న్యాయమూర్తులు


విజయవాడ (ఇంద్రకీలాద్రి) ఫిబ్రవరి 11: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న ఆదిపరాశక్తి శ్రీ జగన్మాత శ్రీకనకదుర్గమ్మను ఆదివారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రంజన్ గొగాయ్, నూతలపాటి వెంకట రమణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అంతరాలయంలోనికి తీసుకువెళ్ళారు. అమ్మవారి దర్శనం అనంతరం అమ్మవారి రాయబార మంటపంలో అర్చకులు న్యాయమూర్తులకు అమ్మవారి దివ్య అశీస్సులను అందచేయగా ఆలయ సహాయ ఈవోశ్రవణం అచ్యుతరామయ్యానాయుడు వీరికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రత్యేక ప్రసాదాలను అందచేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు సహాయ ఈవో అలయ విశిష్టత గురించి వివరించారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు దుర్గమ్మ జ్ఞాపికలు, ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

ఎమ్మెల్యేలతో చర్చించి నిర్ణయం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరుపై వైసీపీ నేత సుబ్బారెడ్డి



నరసాపురం, ఫిబ్రవరి 11: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాలా, వద్దా అనే అంశాన్ని తమ పార్టీ శాసన సభ్యులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు, వైసీపీ రాష్ట్ర నాయకుడు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తమ ఎన్నికల గుర్తుపై గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రలోభపెట్టి తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవడం అనైతికమన్నారు. వారిలో నలుగురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కట్టబెట్టటం అప్రజాస్వామ్యమన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేయగా, ఈ అంశంపై అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం స్పష్టంచేసిందన్నారు. దీంతో తమ ఎమ్మెల్యేలు గతంలో అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించారని గుర్తుచేశారు. తాజాగా రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు తమ పార్టీ శాసన సభ్యులు హాజరు కావాలా వద్దా అనే అంశంపై చర్చిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్ర విభజన హామీలను అమలుచేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే అంశంలో కలసివచ్చే పార్టీలతో ఉమ్మడి పోరాటం చేస్తామని సుబ్బారెడ్డి ప్రకటించారు. అలాగే రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే పార్టీలతో పొత్తుకు సైతం సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం అవినీతిమయం చేస్తోందని, అందువల్లే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని చిన్నచూపు చూస్తోందని ఎంపీ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. సమావేశంలో వైసీపీ నాయకులు ముదునూరి ప్రసాదరాజు, గుణ్ణం నాగబాబు, పివిఎల్ నర్శింహారావు, గ్రంధి శ్రీనివాసు, కవురు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సిరివెన్నెలకు నాగభైరవ అవార్డు

ప్రదానం చేసిన మంత్రి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 11: మహోన్నతమైన కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక అవార్డు ప్రదానోత్సవంలో తాను పాల్గొనటం ఎంతో సంతోషంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టౌన్‌హాలులో ఆదివారం నిర్వహించిన డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు 9వ స్మారక అవార్డును ప్రముఖ సినీకవి సిరివెన్నెల సీతారామాశాస్త్రికి అందజేశారు. ఈ ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ ఆదర్శవంతమైన పాటల రచయిత సిరివెన్నెలకు ఈ అవార్డు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ఆయన పాటలు యువతలో ఉత్తేజం నింపటంతో పాటు వారి భవితకు సంబంధించిన చక్కటి సందేశం దాగి ఉంటుందన్నారు. విశాల దృక్పథంతో ప్రేక్షకులకు సమతా భావాలను తన సాహిత్యం ద్వారా అందిస్తున్న సిరివెన్నెల తెలుగు భాషలోని పద్యం, కవిత్వం, సాహిత్యంపై తనదైన ముద్ర వేశారన్నారు. అనంతరం సిరివెన్నెల సీతారామశాస్త్రి మాట్లాడుతూ 2009 నుండి అవార్డు అందజేస్తున్న అవార్డు కమిటీ నాగభైరవ కోటేశ్వరరావు 9వ స్మారక అవార్డుకు తనను ఎంపిక చేయటం ఆనందంగా ఉందన్నారు. భాషా వైభవాన్ని భావితరానికి అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. ఇలాంటి అవార్డులు అందుకున్న గ్రహీతలు రేపటి తరం భాషా వికాసం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం అవార్డు గ్రహీత సిరివెన్నెల సీతారామశాస్త్రితో పాటు డాక్టర్ నాగభైరవ స్ఫూర్తి అవార్డు గ్రహీతలు వంజావాక సతీష్‌రెడ్డి, డాక్టర్ ఈదూరు సుధాకర్, కొండెపోగు బి డేవిడ్ లివింగ్‌స్టన్, పి లక్ష్మణరావు, కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు, ఆవాల శారద, కాళిదాసు పురుషోత్తంలను ఘనంగా సత్కరించారు. తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ స్మారక అవార్డు సభలో రాజధాని కమిటీ సలహా సంఘం సభ్యులు బీద మస్తాన్‌రావు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, అవార్డు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెన్నెలకంటి రాజేశ్వరరావు, చిన్ని నారాయణరావు, బీరం సుందరరావు, నాగభైరవ కుటుంబ సభ్యులు కూకట్ల రాజ్యలక్ష్మి, దూళిపాళ్ల రవీంద్రకుమారి, మన్నం మనోరమ తదితరులు పాల్గొన్నారు.

సాహితి

email: sahiti@andhrabhoomi.net



సాయంకాలాన్నీదుకుంటూ...

చరమ మోహనమగు దివాచ్ఛాయలందు
సంజ కెంజాయ దానిమ్మ సగము విచ్చె
ప్రణయ సుకుమార గీతముల్ పాడుకొంచు
ముగ్ధ హృదయాలు క్రొంగొత్త మోసులెత్తె...

గోధూళి నీరెండ గొనబు
ఆకురాలు క్షణాన్ననుభవిస్తూ
నక్షత్ర గుచ్ఛం నాలుకొలిపె ముహూర్తాన్ని
ఆకాశానికందిస్తాయి...

పక్షులు స్నానం చేసే
పొలాల మీది స్వేచ్ఛావాయువులు
మానవ స్పృహ మార్మిక జన్మబీజానికి
ఊపిరి దోసిళ్ళొత్తుతాయి...

కలల శిల్పాలు చెక్కే నిద్రను మోస్తున్న
రాత్రి కనుపాపలు
సుప్రభాత సౌందర్యాన్ని మేల్కొలిపే
సూర్యకిరణాన్ని మీటుతాయి...

ప్రభాత పరిమళాలు
పూలరేకుల మీంచి
హరివిల్లును మోసే మంచుబిందువుగా
తెరల బాఋ తుంచే...

కడు విలాసమీ వెన్నెల కాల్వదాటి
సర్వమొక భావనా చిత్రశాలయగును
తెల్లవారుచునుండ విదీర్ణతటిని
స్వప్నమొక్కటి చుక్కయై జారిపడును...

- సాంధ్యశ్రీ, 8106897404


వ్యంగ్య సృజనకు రా'రాజు'.. విశ్వనాథ

సాహిత్య ప్రక్రియలో అన్నిటికన్నా వాడి అయినదీ, వేడి అయినదీ వ్యంగ్యం. వ్యంగ్యం అంటే వంకరగా విమర్శించటం, ఎద్దేవా చేయటం కాదు. అత్యంత సృజనాత్మక ప్రక్రియ వ్యంగ్యం. ఉన్నది ఉన్నట్టు చూపుతూ, ఉన్నదానిలోని అనౌచిత్యము అసందర్భమూ అయిన అంశాలను ఎత్తి చూపిస్తూ పఠితను ఓ వైపు హాస్యం స్ఫురిస్తూ కూడా మరోవైపు లోతైన అవగాహన, దీర్ఘమైన ఆలోచనను కలిగించేదే వ్యంగ్యం. అలాంటి వ్యంగ్య సృజనలో విశ్వనాథ అందెవేసిన చేయి. ఆయన లాంటి వ్యంగ్యాన్ని మరెవరూ సృజించలేదు. ఇంకెవరూ సృజించలేరు. ఇందుకు చక్కని నిదర్శనం- విశ్వనాథ విరచిత కథ 'రాజు'.

రాజు-కథ చదవటం అంటే భారతీయ సాంప్రదాయ చరిత్రను, సామాజిక పరిణామ క్రమాన్ని విహంగ వీక్షణం చేయటం లాంటిది. ఇదొక ఉధృతమైన ప్రవాహ మధ్యలో నుంచుని పరుగులిడే నదీ ప్రవాహాన్ని దర్శించటం లాంటిది. భారతీయ సాంప్రదాయిక విశ్వాసం ప్రకారం యుగాలు నాలుగు కృత, త్రేత, ద్వాపర కలి. కృత యుగాన్ని సత్య యుగం అంటారు. అంతా సత్యమే. ఎలాంటి వాదాలు వివాదాలు లేకుండా అంతా శాంతంగా సాగిపోతుంది. ఆ తరువాత నుంచి ఇంకో యుగానికి సామాజిక జీవనం, మానవ ప్రవర్తన, ఆలోచనలు దిగజారుతుంటాయి. దీనికి పరాకాష్ఠ కలియుగం. ఆ తరువాత ప్రళయం సంభవించి సృష్టి మళ్లీ ఆరంభమవుతుంది. ఈ సిద్ధాంతం ఆధారంగా భారతీయ సామాజిక జీవనంలో ఆలోచనల్లో కనిపిస్తున్న విపరీత ధోరణిని, మానవ సంబంధాలలో కనిపిస్తున్న విచ్ఛిన్నకర ధోరణిని వ్యంగ్యంగా ఎత్తి చూపించడమే కాదూ, జగద్రక్షక సిద్ధాంతాలుగా తెరపైకి వచ్చి మానవ జీవనాన్ని విచ్ఛిన్నం చేస్తూ ఆలోచనలను విషపూరితం చేస్తున్న విదేశీ సిద్ధాంతాలను అత్యంత వ్యంగ్యంగా విమర్శించడం 'రాజు' కథలో కనిపిస్తుంది. ఈ కథలో నలుగురు రాజులు రాజ్యానికి వస్తారు. నలుగురు నాలుగు యుగాలకు ప్రతినిధులు. ఈ దృష్టితో కథను చదవడం ఆరంభిస్తే ఈ కథలో విశ్వనాథ చెప్పదలచుకున్న విషయం, చెప్పిన విషయం, అందులోని వ్యంగ్యం, ఆవేదనలు, ఆలోచనలు స్పష్టమవుతాయి. రచయిత భావనా బలానికి ఆలోచన వైశిష్ట్యానికి అత్యద్భుతమైన సృజనాత్మకతకు ఆశ్చర్యం కలుగుతుంది. చెప్పదలచుకున్న అంశాన్ని స్పష్టంగా చెప్తూనే ప్రతి పదంలో ప్రతి వాక్యంలో సముద్రమంత అగాథమైన అర్థాలను ఇముడ్చి ప్రదర్శించడమనే రచనా సంవిధానానికి జోహార్లర్పించాలనిపిస్తుంది.

సుధర్ముడనే రాజు రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలిస్తుంటాడు. ఆయన యోగ శక్తితో రోజూ వారణాసి వెళ్లి వస్తూంటాడు. రాజ్యం సుభిక్షంగా, ప్రజలు సుఖంగా ఉంటారు. అలా సాగుతున్న రాజ్యంలో ఓరోజు, పొలం దున్నుతున్న కాపు గుర్రంపై వెళ్తున్న క్షత్రియుడిని చూచి 'నేనెన్నేళ్ళని దున్నటం? ఇష ఇక్కణ్ణుంచి నువు దున్ను. నేను గుర్రాన్ని ఎక్కుతా?' అంటాడు. 'నాలా యుద్ధం చేయలేవు' అన్న క్షత్రియుడితో అతడు 'మహా నువ్వే యుద్ధ చేస్తావులెద్దూ. అలవాటయితేసరి, ఎవరుపడితే వారే చేస్తారు' అంటాడు. వారిద్దరూ తీర్పు కోసం రాజు దగ్గరకు వెళ్తారు. వారి వివాదం విన్న రాజు 'నేను చాలా రోజులు రాజ్యం చేసాను. నేను అడవికి వెళ్తున్నాను. మీ తగాదా కొత్త రాజుకు చెప్పుకోండి' అని అడవికి వెళ్లిపోతాడు. అంటే కృతయుగం అయిపోయిందన్నమాట. అంతవరకూ తగాదాలు, అహంకార పోరాటాలు లేకుండా కలసిమెలసి అన్నదమ్ముల్లా, హెచ్చు తగ్గులు లేకుండా సామరస్య పూర్వకంగా జీవించిన సమాజంలో విచ్ఛిన్నకరమైన విషబీజానికి అంకురార్పణ జరిగిందన్నమాట.

ఆయన కొడుకు ధర్ముడు రాజ్యానికి వస్తాడు. వివాదాన్ని విన్న



అత్యంత సృజనాత్మక ప్రక్రియ వ్యంగ్యం. ఉన్నది ఉన్నట్టు చూపుతూ, ఉన్నదానిలోని అనౌచిత్యము అసందర్భమూ అయిన అంశాలను ఎత్తి చూపిస్తూ పఠితను ఓ వైపు హాస్యం స్ఫురిస్తూ కూడా మరోవైపు లోతైన అవగాహన, దీర్ఘమైన ఆలోచనను కలిగించేదే వ్యంగ్యం. అలాంటి వ్యంగ్య సృజనలో విశ్వనాథ అందెవేసిన చేయి.

ఆయనకేమీ పాలుపోలేదు. వేదవేదాంగ పారంగతులు, నిత్యాగ్నిహోత్రులు అయిన బ్రాహ్మణుల్ని పిలిచి అభిప్రాయం అడుగుతాడు. వారు తపోదృష్టితో చూసి 'ఎవరి పని వారు చెయ్యాల్సిందే. మీరు పోట్లాడకూడదు' అంటారు. ఆ సమస్య అక్కడితో ఆగిపోతుంది. అయితే సుధర్ముడి యోగ శక్తి లేని ధర్ముడు రోజూ కాశీకి వెళ్లలేడు. నది ఒడ్డున రాజధాని కట్టించుకుంటాడు. అయితే ఏమైనా తగాదాలు వచ్చినప్పుడు మాత్రం తీర్పుకు బ్రాహ్మల్ని పిలుస్తూంటాడు. వాళ్లు అగ్నిహోత్రం వదలి అధిక సమయం రాచకార్యాల మీద గడుపుతుంటారు. ఇంతలో ఓరోజు చెమటలు జారుతున్న ఓ కాపు ఎర్రగా బుర్రగా వున్న బ్రాహ్మణుడిని చూస్తాడు. 'ఆయన సుఖంగా ఇంట్లో కూర్చుంటోంటే దబ్బ పండులా వున్నాడు. దున్ని దున్ని నా రెక్కలు విరిగిపోతున్నాయి. ఇక నేను దున్నలేను. ఎల్లకాలం ఒక్కడు దున్నటం ఎట్లాగేమిటి? అనుకుంటాడు. బ్రాహ్మణుడిని నిలదీస్తాడు. ఇద్దరూ రాజు దగ్గరకు వెళ్తారు. బ్రాహ్మలు ఇంతకుముందు చెప్పినట్టే తీర్పు చెప్తారు. దానికి కాపు 'నాకు న్యాయం జరగలేదు. ఈయనా బ్రాహ్మడే. వారూ బ్రాహ్మలే' అని ఆక్షేపిస్తాడు. రాజు తీర్పుని సమర్థిస్తే, రాజును ఎదిరిస్తాడు. 'మీ అచ్చమైన బుద్ధి వారి బుద్ధి మూలంగా కలుషితమయింది' అని ఆరోపిస్తాడు. దాంతో రాజు అడవికి వెళ్లిపోతాడు. మరో యుగం అంతమయింది.

అతని తరువాత ధర్మరాజు రాజ్యానికి వస్తాడు. మళ్లీ అదే వ్యాజ్యం వస్తుంది. అదే తీర్పు వస్తుంది. అదే ఆక్షేపణ, ఆరోపణలు వస్తాయి. అయితే రాజు ఖడ్గం చూపి బెదిరిస్తే కానీ వివాదం సమసిపోదు. కానీ రాజు ఖడ్గం చూపితేకానీ తీర్పులను ఎవ్వరూ ఆమోదించకపోవడం ఆనవాయితీ అవుతుంది. అయితే ప్రజలలో మార్పు వస్తుంది. బ్రాహ్మలు పొలాలు దున్నుతూంటారు. కొందరు కాపులు వేదాలు చదువుతూంటారు. క్షత్రియులు యుద్ధాలు మానేస్తారు. వైశ్యులు పేరుకు మిగులుతారు. వ్యాజ్యాలు, తగాదాలు, పితూరీలు పెరుగుతాయి. దాంతో వివాదాలు, వాటికి ఇచ్చిన తీర్పులు తాటాకుల్లో రాయించి దాస్తూంటారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు ఇదీ తీర్పు అని చెప్పేందుకన్నమాట (ఆధునిక న్యాయ శాస్త్రంపై విసురు). రాజు కూడా ప్రతి వివాదాన్ని వినటం మాని తాటాకుల ఆధారంగా తీర్పు చెప్పేవారిని నియమిస్తాడు. ఇంకొన్నాళ్లకి వ్యాజ్యాలు మరీ విషమంగా వస్తూంటాయి. కారణం తాటాకుల తీర్పులు అని తెలుస్తాయి. ఇంతలో ఆయన మరణిస్తాడు. అతని తరువాత అతని ముగ్గురు కొడుకుల్లో పెద్దవాడు రాజవుతాడు. అతని దగ్గరకో విచిత్రమైన వివాదం వస్తుంది. ఒక స్త్రీ యందు బ్రాహ్మణుడు, శూద్రుడు కొడుకులను కంటారు. ఆ పిల్లల్లో బ్రాహ్మణ పిల్లవాడు పొలం దున్నాలని, శూద్ర పిల్లవాడు పౌరోహిత్యం చేయాలని అనుకుంటారు. కానీ పొలం వున్న శూద్ర పిల్లవాడు పొలం ఇవ్వనంటాడు. వివాదం విన్న రాజు రాజ్యం వదలి అడవికి వెళ్లిపోతాడు. తరువాత రాజు అయిన రెండోవాడు ఎవరికీ చెప్పకుండా అడవికి వెళ్లిపోతాడు. దాంతో మూడవవాడు రాజు అవుతాడు. కలియుగం ప్రారంభమవుతుంది.

వివాదం విన్న రాజు పగలబడి నవ్వుతాడు. 'ధర్మం రెండు విధాలుగా ఉంటుందని' చెప్పి బ్రాహ్మడు పొలం చేసి వచ్చే ధనం శూద్రుడికివ్వటం, శూద్రుడు పౌరోహిత్యం చేసి వచ్చే డబ్బు బ్రాహ్మడికి ఇవ్వాలని లేకపోతే ఇద్దరూ రెండు పనులు 'సగం సగం' చేయాలని తీర్పునిస్తాడు. వాళ్లు రెండో తీర్పు ప్రకారం నడుస్తామంటారు. అంతే కాదు, ఎవరు ఎక్కువ తీర్పులిస్తే వారు గొప్ప అవుతారు. అయితే కథ ఇంతటితో అయిపోతే విశ్వనాథ కథ కానేకాదు. అందరూ ఒక దెబ్బకి రెండు పిట్టలను కొడితే విశ్వనాథ ఒక దెబ్బకి పది పిట్టల్ని కొడతాడు. ఎవరయినా రాజుతో ముత్తాత గురించి, అంటే కృతయుగం గురించి చెప్తే 'అవి అన్నీ కల్లబొల్లి మాటలోయి, మా ముత్తాత అనేవాడు లేడు. ప్రపంచమంతా మా నాన్నతో మొదలెట్టి వుండాలి. నేనెరిగినప్పటి నుంచే ప్రపంచకం అసలు కన్ను తెరచింది. ఆ సంగతి నాకు తెలుసు' అంటాడు. కాదన్నవాడిని ఉరితీస్తాడు. ఇదీ విశ్వనాథ వ్యంగ్యాత్మక సృజనాత్మక శక్తికి పరాకాష్ఠలాంటి కథ 'రాజు' కథ.

చివరి వాక్యంతో కథ స్వరూపం మారిపోతుంది. ఈ వ్యంగ్యం కేవలం యుగం ప్రకారం మారే సామాజిక మనస్తత్వానికి పరిమితం కాదనీ, విదేశీ మూకలు తమ బలంతో ఈ దేశ సంస్కృతి సాంప్రదాయాలతో అలాంటి తాండవం చేసే సమాజంలో సృష్టించిన విపరీత ధోరణులు, నాటిన విషబీజాలపైన అనీ తెలుస్తుంది. అంతేకాదు విదేశాలలో జనించిన పలు విచ్ఛిన్నకర సిద్ధాంతాల విషవాయువుల తాడితమైన భారతీయ సమాజం ఎలా తనని తాను మరచి, తన అసలు స్వరూపాన్ని విస్మరించి వారి రంగుటద్దాలతో తనని తాను చూసుకుని కుచింపచేసుకుని ఎలా వికృతమవుతోందో స్పష్టంగా ప్రదర్శిస్తుందీ కథ. అయితే ఈ కథ సాంప్రదాయిక వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్థిస్తున్నదనుకుంటే పొరపాటు. ఈ కథ ద్వారా విశ్వనాథ ఒకప్పటి సమాజంలో వర్ణాశ్రమ ధర్మాలు ఈనాడు దుర్బుద్ధులు, సమాజంపట్ల అవగాహన లేక విదేశీ రంగుటద్దాలు ధరించినవారు ప్రచారం చేస్తున్న రీతలో లేదని, ఒకప్పుడు ఎలాంటి భేదభావాలు, హెచ్చుతగ్గులు, అహంకారాలు, న్యూనత భావాలు, అణచివేతలు లేని ఉత్కృష్టమైన సమాజం మనదని, దానిలో విషబీజాలు నాటి దుష్ప్రచారం చేస్తున్నారన్న భావనను సూచనప్రాయంగా ప్రదర్శిస్తాడు విశ్వనాథ. మన సమాజాన్ని, గతాన్ని, సామాజిక ప్రవృత్తిని, మనస్తత్వాన్ని తెలుసుకోకుండా విదేశీ పాలకులు, విదేశీ సిద్ధాంత ప్రభావితులు మన నడుమ నాటిన విష బీజాలు, నిర్మిస్తున్న అడ్డుగోడల ప్రభావంతో చెలరేగుతున్న విచ్ఛిన్నకరమైన ధోరణులపై విశ్వనాథ ప్రయోగించిన వ్యంగ్యాస్త్రం ఈ 'రాజు' కథ. అందుకే ఈ కథ రంగుటద్దాల, కళ్లకు గంతల సాహిత్య ప్రపంచంలో ప్రచారం పొందలేదు.

- కస్తూరి మురళీకృష్ణ, 9849617392

ఆణిముత్యాల కరదీపిక సారస్వత సరాలు

తెలుగు, ఆంగ్లం, సంస్కృత భాషలను చక్కగా అధ్యయనం చేసి ఆధ్యాత్మిక, ఇతిహాస, నీతి గ్రంథాల నుంచి ఆణిముత్యాల లాంటి అంశాలను 112 పేజీలలో అందించడం అంటే కత్తిమీద సాము లాంటిదే. సారస్వత సరాలు అనే విలువైన పుస్తకాన్ని డాక్టర్ శ్రీమతి కె అరుణావ్యాస్ అందించారు. ఈ కరదీపికలో 17 అంశాలపై రచయిత్రి చక్కగా విపులీకరించారు. ప్రముఖ సాహితీవేత్త చిలకమర్తి రాసిన రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా అనే నాలుగు పంక్తుల అద్భుతమైన పద్యాన్ని అందించారు. ఇంత మంచి పద్యం మన సాహిత్యంలో ఉన్న సంగతి సాహితీవేత్తలకు మాత్రమే తెలుస్తుంది. తెలుగు భాషను సుసంపన్నం చేసిన మహా రచయితల పేర్లు ఈ పుస్తకంలో దర్శనమిస్తాయి. తెలుగు సాహిత్యాన్ని ఔపోసన పట్టినవారే ఇంత చిన్న పుస్తకంలో అనేక అంశాలను స్పృశించగలుగుతారు. తెలుగదేలయన్న దేశంబు తెలుగు, ఆడవాళ్లు- ఆత్మరక్షణ, కొడిగడుతున్న చిరుదివ్వెలు, సదా మీ సంరక్షుణ్ణి, వినిపించని రాగాలు, పువ్వులు విరిసిన నవ్వులు, అతి మధురం అన్నమయ్య పదం, రామాయణ పాత్రల వైశిష్ట్యం, నాటి గుర్తుల నీడలో సాహిత్యంతో సేద, బుల్లితెర విన్యాసాలలో పేర్కొన్న అనేక అంశాలు బాగున్నాయి. మనోవేదనతో తల్లడిల్లే వారికి ఉపశమనం ఇచ్చే విధంగా రచయిత్రి అనేక అంశాలను ఒక్కో శీర్షికలో పొందుపరిచారు. విద్వేషాలతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న ప్రస్తుత సమాజానికి ఉపయోగపడే విధంగా శ్రీరామచంద్రుడి సందేశాన్ని ప్రస్తావించారు. శ్రీరామచంద్రుడు విభీషణుడికి అతని సోదరుడు రావణుని దహన సంస్కారాలు చేయాలని ఆదేశిస్తారు. 'వైరాలు అనేవి చావుతో ముగుస్తాయ్, మేము అనుకున్న పని పూర్తయింది. ఇతనికి దహన సంస్కారాలు చేయి. ఇతను నీకెంతో నాకూ అంతే అని శ్రీరామచంద్రుడు విభీషణుడికి బోధిస్తారు. రామా ఏమి క్షమాగుణం, ఎంతటి ఔదర్యం, ఆకాశమంత ఎత్తు ఎదిగిన సంస్కారం, అందుకే లక్ష్మణుడు, 'రిపుణామ పివత్సవ' అని రాముడిని ప్రశంసించాడు అనే నీతి వాక్యాలను రచయిత్రి సేకరించి రాశారు. శత్రువు, రాక్షసుడైన రావణుడిని పొగడడానికి ఎంత సంస్కారం, నైతిక బలం కావాలని రావణుడు మరణించాక విభీషణుడు దహన సంస్కారాలు చేయనంటే, రాముడు వారించి చేయమంటారు. ఈ పుస్తకంలో నీతి సంబంధమైన అనేక విషయాలు చదువరులను ఆకట్టుకుంటా యనడంలో సందేహం లేదు. ఈ పుస్తకాన్ని తెలంగాణ డిజిపి కార్యాలయంలో ఉన్న తెలంగాణ సురక్ష పబ్లికేషన్స్ ప్రచురించింది.




- కెవిఎస్

కాగిత్తప్పడవలు

ఈ రోజంతా అచ్చంగా నాదే
ఇంటికి వచ్చి రావటంతోనే
రారమ్మని పిలిచే సన్నజాజి తీగెలు
పెరట్లోకి ఇంకా తొంగి చూడలేదనే కోపంతో
తూనీగల దండులా చేసే దాడిని
మురిపెంగా వారిస్తుంటే
కొన్ని అలకలుః
మరికొన్ని వేడుకోళ్లు
వెక్కిరిస్తూ కొన్ని
వేదనలో ఇంకొన్ని

ధనుర్మాసపు మంచులో
నువ్వూ నేను తడిసిన సందర్భాలన్ని
ఒక్కో మొక్కా పట్టి చూపిస్తుంటే
ఒక్కో పూవూ ఒక్కో తలపుల
పేజీల్ని తిప్పుతుంటే
ఆ ఊసుల్లో ప్రవహించటం
మనం నదులమని గుర్తు చేయటమేగా

మత్తో మైకమో
ఏకాంతపు రుచిని
మరిగిందిక్కడే మరి
నీదో జీవితం
నాదో జీవితం
మనదొక్కటే జీవితమనే
ఊహల లోకంలోకి ఎగిరేలా నేర్పింది



ఈ గూటిలోనేగా

ఒక ఆనందాన్ని
ఒక వేదనను
ఒక సంతోషాన్ని
ఒక ఆసక్తిని
చినుకుల్లా చల్లిన
ఈ అక్షర నక్షత్రాల్లో
మనసు గిరికీలు కొడుతుంటే
ఒక క్షణం ఆశ్చర్యం
ఒక క్షణం నిస్సారం
కాలపు పిట్టకెంత ఆవేశమో
మనకింత నిస్సహాయితల్ని రాలుస్తూ

ఇప్పుడు
ఇదో ఘనీభవించిన సరస్సు
సాగిపోలేని కాగిత్తప్పడవలతో ★

-లాస్య ప్రియ కుప్పా
9640551664

అల్పాక్షరాల్లో ప్రతిధ్వనించే 'తుషార' పరిమళాలు


ఆధునిక కవిత్వం కొత్త ప్రక్రియలకు జీవం పోస్తున్న క్రమంలో వైవిధ్యపూరితమైన కవితా నిర్మాణ రీతులు ఊపిరి పోసుకుంటూ వస్తున్నాయి. ఈ కోవకి చెందిన ఆధునిక కవితా ప్రక్రియే 'త్రిపాద కవిత'. ఇది త్రిపద అంటే మూడు పదాల అక్షర వాక్యాలతో రూపొందించబడింది. త్రిపదం అనే అర్థాన్ని సూచిస్తుంది. గతంలో వచ్చిన హైకూలు, నానీలు, రెక్కలు మున్నగు కవితా రీతుల్ని తలపించేదే ఈ త్రిపాద కవిత. 1300 కవితలు కలిగిన ఈ 'తుషార మాలిక' సంపుటి కవయిత్రి సిరి వడ్డే. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని కేంబ్రిడ్జ్‌లో నివాసముంటున్న కవయిత్రి పదునైన భావసాంద్రతతో కవితలకు ప్రాణప్రతిష్ఠ చేసింది. అలతి వాక్యాల్లో అనల్పార్థ భావ రచన చెయ్యడం దీని ప్రత్యేకత. వచన శైలిలో గాఢతను పుణికిపుచ్చుకొని ఆస్వాదింప జెయ్యడం వీటిల్లో కనిపిస్తుంది. భావుకత, తాత్త్వికత, సాంప్రదాయకత, మమేకత, గత స్మృతుల నెమరువేత, సున్నిత భావాల కలబోత ఒకచోట కుప్పగా పోసి కవిత్వీకరించిన తీరు దీనిలో వ్యక్తమవుతుంది.

'హరివిల్లు బడాయి పోతోంది/ ఒయారాలు ఒలకబోతలో/ తాను ఇమిడిపోగానే...' అని అంటున్నపుడు సహజసిద్ధమైన వాస్తవిక దృశ్యానికి వ్యంగ్యంతో కూడిన చమత్కార గుణాన్ని జోడించి చెప్పడం కవయిత్రి సిరి వడ్డే లోచూపు దృక్పథాన్ని అద్దం పట్టిస్తుంది. మామూలు విషయాన్ని కూడి కవిత్వమయం చేసే నేర్పు లక్షణాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. వ్రక్రంగా వొదిగిపోయే సుతారమైన అంశాన్ని లౌక్య దృష్టితో మేళవించి చెప్పడం ఈమె ప్రతిభకు గీటురాయిగా నిలుస్తుంది.

'తానో కాంతిపుంజమే/నా మనోనేత్రాన్ని/ తాకినపుడల్లా' అంటూ చెబుతున్నపుడు లోలోపటి ఆంతరంగిక ధ్వని లీలా మాత్రంగా బొమ్మ కడుతుంది. అంతర్లీనమైన ఆలోచనలలో మనసుని స్పృశించినపుడు ఉప్పొంగే చైతన్య భావదీప్తిని కళ్లకి కట్టించడంలో కవయిత్రి మెలకువతో నిండిన అనుభూతి స్పర్శని రగిలించారు. విషయం చిన్నదే అయినప్పటికీ వ్యక్తీకరించే వైనం కట్టిపడేస్తుంది. ఈ ఒడుపులోని నేర్పరితనం రహస్యమే కవయిత్రిని పాఠకులకు దగ్గరగా చేరుస్తుంది.

'ఉరితాడును నేస్తూనే ఉంటుంది/ మనస్సు లేని కొయ్య మగ్గం/ చినిగిన పంచెలతోనో.. కాలే కడుపులతోనో' అని దిగులు చెందుతున్నపుడు ఆకలి చావులతో ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికుల దుస్థితి ఆవిష్కృతమవుతుంది. సిరిసిల్లను పోలిన కన్నీటి కష్టాలను అతుకుల బతుకులతో ముడిపెట్టి రెక్కాడి తేగాని డొక్కాడని జీవన సంఘర్షణ ప్రతిరూపాలను సామాజిక వెతలుగా చిత్రించడం ఇందులో కానవస్తుంది. నేసిన దారపు కండెనే ఉరితాడుగా మలచి అక్షరీకరించడం సజీవ దృశ్యచిత్రణకి పరాకాష్ఠగా భావించవచ్చు.

తుషారమాలిక
(1300 త్రిపద కవితల
తొలి సంపుటి)
-సిరి వడ్డే
వెల: రూ.150
ప్రతులకు: జ్యోతి వలబోజు
80963 10140



'మనసుకెన్ని రాగాలో/ అల్లన మోవిని తాకగానే/ తనువంతా గాయాలను మోసే పిల్లంగ్రోవికి' అంటున్నపుడు 'సప్తపది' చిత్రంలోని గీతం గుర్తుకు రాక మానదు. అంశం ఒకటే అయినా, అభివ్యక్తిలో పోలికలు ఒకేలా కనపడినా, సందేశంలో మాత్రం సారూప్యత ధ్వనిస్తుంది. మనసులోని రాగాలను, దేహ గాయాలను పిల్లంగ్రోవితో ముడిపెట్టి చెప్పడంలో భరించరాని రంపపు కోతని అనుభవిస్తుంది వడ్డే సిరి. ఈ మానసిక సంక్లిష్టతను వేదనామయ సందర్భం లోంచి పలవరించడానికి త్రిపాద కవితను వాహికగా ఎంచుకున్నారు. సంఘర్షణ లేని జీవితం ఆటుపోటుల్లేని సముద్రాన్ని పోలి ఉంటుంది. ఈ ఒడుపును అందిపుచ్చుకున్నది కాబట్టే అనుభవైకవేద్యమైన ఆవేదనను ప్రాణ సంకటంగా మలచగలిగారు. కవిత్వానికి అంతిమ ప్రయోజనం ఈ లక్షణమే. దీనికి ప్రక్రియాపరమైన అంతరం ఎప్పటికీ వెంటాడదు.

'మౌనమూ పలుకులు నేర్చింది/ ఏకాంత వనంలో/ తనతో విహరిస్తుంటే...' అంటూ నొక్కి చెప్పడంలోని ఆంతర్యం అంతర్ముఖ సంభాషణలో జీవన పరివేదన తపనలోంచి నిట్టూర్చిన హృదయ పలుకులు ఏకాంత వనంలో పచార్లు చేయడం పరిపాటయ్యింది. బహుశా ఈ దోబూచులాటే పరిమళిస్తూ, ప్రవహిస్తూ మనసుకి సాంత్వన చేకూరుస్తుందేమో! కొన్ని సందర్భాలను వెలకట్టడానికి వీలుచిక్కదు. ఎన్నెన్నో కొత్త విషయాలను సంభాషణలో బహిర్గతం చేస్తుంటుంది. ఆ ఊపు ఇక్కడ కూడా కొనసాగుతోంది.

'జ్ఞాపకాలలో మాత్రం సజీవమే/ నా బాల్యాన్ని మోసిన ఊరు/ ఇప్పుడు శిథిల సాక్ష్యంగా మిగిలిపోయినా...' అంటారు ఓ చోట కవయిత్రి. ప్రపంచీకరణ వేగంలో కాలమంత వేగంగా పరిగెత్తుతున్న జీవితాలు అనేక పరిణామాలకు లోనవుతూ కొత్తపుంతలు తొక్కుతున్నాయి. సామాజిక పరిస్థితులను పలుమార్పులకు గురి చేస్తున్నాయి. పల్లెతనం జ్ఞాపకాలతో సహా విదేశాలకు వలసపోతూ పుట్టి పెరిగిన ఊళ్లను అనాథలను చేస్తున్నాయి. కులవృత్తులూ అంతరించిపోతున్నాయి. ప్రేమతో పెంచిన పరిసరాలనూ దూరం చేస్తున్నాయి. ఈ యాంత్రిక భౌతిక ప్రపంచంలో ఎవరికి వారే పరాయివాళ్లుగా రూపాంతరం చెందుతున్నారు. ఈ స్థితికి కారణం వర్తమాన సామాజిక వ్యవస్థలోని స్థితిగతులేనని చెప్పవచ్చు. పాశ్చాత్య దేశాల సంస్కృతుల ప్రభావ ఛాయలు పడి బతుకుతెరువు కోసం దూరపు తీరాలకు ఎగిరిపోతున్నారు. ఇక ఇక్కడ మిగిలిందల్లా, ఒక్క ఏకాకితనం మాత్రమే! శిథిల సాక్ష్యంగా కడసారి చూపు సమాధానంగా మిగిలిపోతోంది. ఇలా బహుముఖ కోణాలను ఎన్నింటినో ఈ త్రిపాద కవితల్లో పొందుపరిచారు సిరి వడ్డే. వీటిలో అక్కడక్కడా ధ్వనించే కవిత్వపు వాక్య పదాలు కూడా కొన్నిచోట్ల మనల్ని అలరిస్తాయి.

-మానాపురం రాజా చంద్రశేఖర్

19న పఠాభి శతజయంతి ఉత్సవం

భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యానాం, కవి సంధ్య సంయుక్త నిర్వహణలో ప్రముఖ అభ్యుదయ కవి పఠాభి శత జయంతి ఉత్సవం ఈ నెల 19న యానాంలో జరుగుతుంది. ఈ సందర్భంగా 'పఠాభి సాహిత్యం - ప్రాసంగికత' అనే అంశంపై ఒకరోజు జాతీయ సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నారు. డా.అత్తలూరి నరసింహారావు, డా.సీతారాం, అదృష్టదీపక్, వంశీకృష్ణ, డా.వాడ్రేవు వీరలక్ష్మీదేవి, డా.జోశ్యుల కృష్ణబాబు, దాట్ల దేవదానం రాజు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, డా.వరుగు భాస్కరరెడ్డి తదితరులు వివిధ అంశాలపై పత్రాలు సమర్పిస్తారు. పఠాభి పరిశోధకులు డా.శిఖామణి కీలక ప్రసంగం చేస్తారు.

కవిసంధ్య - పానుగంటి కవితల పోటీ

21 మార్చి 2018 అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిత్వ పత్రిక 'కవిసంధ్య పానుగంటి కవితల పోటీ'ని నిర్వహిస్తోంది. ఆధునికమైన భాష, అభివ్యక్తితోపాటు సామాజిక అంశాలపై రాసిన వచన కవితలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. మొదటి బహుమతి రూ.3,000, 2వ బహుమతి రూ.2,000, 3వ బహుమతి రూ.1000, అయిదు మంచి కవితలకు రూ.500 చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. ఒక ఎంట్రీకి ఒక కవిత మాత్రమే పంపాలి. కవి పేరు, చిరునామా హామీ పత్రం పైన మాత్రమే పేర్కొనాలి. కవితలను పోస్ట్/కొరియర్ ద్వారా పంపాలి. ఈ-మెయిల్, వాట్సప్ ద్వారా పంపిన కవితలు పరిశీలించబడవు. బహుమతి పొందని కవులకు కవిసంధ్య పత్రిక ఒక సం. (6 కాపీలు) పంపబడును. కవితలు పంపాల్సిన చివరి తేదీ: 20, ఫిబ్రవరి 2018. పంపాల్సిన చిరునామా: దాట్ల దేవదానం రాజు, జక్రియానగర్, యానాం -533 464, వివరాలకు: 9440105987.

'కలల దారుల్లో' ఆవిష్కరణ

15.2.2018 సాయంత్రం 6 గంటలకు తెలంగాణా సాహిత్య విభాగం ప్రచురించిన 'కలల దారుల్లో' కవితా సంకలనం ఆవిష్కరణ సభ రవీంద్రభారతిలో జరుగుతుంది. కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, నవ తెలంగాణ సంపాదకుడు గుడిపాటి, జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్ కాంచనపల్లి, సాహిత్య అకాడెమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి, సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ పాల్గొంటారు. జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి సమావేశకర్తగా వ్యవహరిస్తారు.

ఐదేళ్ల శిక్షపడితే అనర్హతే

ఎన్నికల్లో పోటీపై సుప్రీంకు ఈసీ అఫిడవిట్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: నేర రాజకీయాలను అరికట్టే దిశగా ఎన్నికల కమిషన్ కీలక ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఐదేళ్లపాటు శిక్షకు గురయ్యే నేరాలకు పాల్పడిన వారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించేలా కేంద్రానికి సిఫార్సు చేసినట్టు, అందుకు అనుగుణంగా చట్టాన్ని సవరించాలని కోరినట్టు సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈమేరకు సుప్రీం కోర్టులో ఎన్నికల కమిషన్ ఓ అఫిడవిట్ దాఖలు చేసింది. రాజకీయాల నుంచి నేరాలను పూర్తిస్థాయిలో తొలగించే దిశగా అనేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్న ఈసీ, ఇందులో భాగంగానే కీలక సిఫార్సులను సూచించినట్టు తెలిపింది. అయితే ఈ చర్యలన్నీ పూర్తిస్థాయిలో అమలై నేర రాజకీయాలకు కళ్లెం వేయాలంటే చట్టపరంగా సవరణలను తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉంటుందని అఫిడవిట్‌లో వెల్లడించింది. తాము కేవలం సిఫార్స్ చేయగలంగాని, చట్ట సవరణ అన్నది ప్రభుత్వాల బాధ్యత అని అందులో వెల్లడించింది. ఎన్నికలకు ఆరునెలల ముందు కేసులు దాఖలైన వ్యక్తులు ఐదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాల్సిన అవసరం ఉందని విస్పష్టంగా తెలిపింది. ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని సుప్రీం కోర్టు బెంచ్ విచారణ చేపట్టనుంది. 1998 నుంచీ కూడా నేర రాజకీయాల నిర్మూలన దిశగా ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూనే ఉందని, 1998 జూలై 15న ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని తెలిపింది. 2004, 2016లో కూడా ఎన్నికల సంస్కరణలకు సంబంధించిన చర్యలను మరింత స్పష్టంగా ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని తెలిపింది. అభియోగాలు దాఖలైన ఏ వ్యక్తీ కూడా ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదన్న అంశాన్ని గట్టిగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కేసు పెండింగ్‌తో ఈ చర్యకు సంబంధం లేదని తెలిపింది. దీనివల్ల చట్టసభల పవిత్రతను పరిరక్షించడమే కాకుండా, నేరస్తులెవరూ ఈ ప్రజాస్వామ్య సౌధాల్లోకి అడుగుపెట్టకుండా నిరోధించడమూ సాధ్యమవుతుందని తెలిపింది. నేరస్తులు చట్టసభల్లోకి ప్రవేశించడం వల్ల ప్రజాస్వామ్య ప్రక్రియకే కాకుండా ఎన్నికల ప్రక్రియపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని ఈ అఫిడవిట్‌లో ఈసీ వెల్లడించింది. దోషులుగా రుజువైన వ్యక్తులు రాజకీయ పార్టీలు స్థాపించకుండా, వాటి నిర్వాహకులు కాకుండా నిషేధించాలంటూ అశ్వినీకుమార్ ఉపాధ్యాయ అనే లాయర్ దాఖలు చేసిన పిటీషన్‌పై ఎన్నికల కమిషన్ ఈ అఫిడవిట్‌ను సుప్రీంకు నివేదించింది.

టెక్నాలజీ అభివృద్ధికి సోపానం

- విధ్వంసానికి ఆయుధం కాకూడదు
- పేదరికం, నిరక్షరాస్యత ప్రధాన సవాళ్లు
- మనకు కావాల్సింది బాంబులు, క్షిపణులు కాదు
- దుబాయ్ శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని మోదీ



దుబాయ్‌లో ఆదివారం ప్రపంచ శిఖరాగ్ర సదస్సు ప్లీనరీలో పాల్గొన్న ప్రధాని మోదీ

దుబాయ్, ఫిబ్రవరి 11: సాంకేతిక విజ్ఞానాన్ని సమగ్రాభివృద్ధి సాధనంగా ఉపయోగించాలే తప్ప విధ్వంసం కోసం కాదని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాడిక్కడ పిలుపునిచ్చారు. సైబర్ స్పేస్ దుర్వినియోగాన్ని అన్ని కోణాల్లోనూ పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సైబర్ స్పేస్‌ను ఇటు ఉగ్రవాదులు, అటు హ్యాకర్లు తమ సంకుచిత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న నేపథ్యంలో ప్రపంచ శిఖరాగ్ర సదస్సు ప్లీనరీలో మోదీ చేసిన వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యత చేకూరింది. పాలనా విధానాల్లో టెక్నాలజీని అనుసంధానం చేయడం వల్ల అభివృద్ధిలో సమతుల్యత సాధ్యమవుతుందని, సంపద పరివ్యాప్తికి ఇది దోహదం చేస్తుందని మోదీ పేర్కొన్నారు. భారత దేశ అభివృద్ధిలో టెక్నాలజీ అన్ని కోణాల్లోనూ ఉపయోగపడుతోందని పేర్కొన్న మోదీ, కృత్రిమ మేధో సంపత్తి (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) విషయంలోనూ నాయకత్వ స్థాయిని సంతరించుకునేందుకు భారత్ నిర్విరామ కృషి చేస్తోందని ఈ ప్లీనరీలో మోదీ స్పష్టం చేశారు. దీంతోపాటు నానో టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ విషయంలోనూ భారత దేశం నిరుపమానమైన ప్రగతి సాధిస్తోందని తెలిపారు. అన్ని రంగాల్లోనూ సాంకేతికంగా ఎంతగానో అభివృద్ధి సాధించినా పేదరికం, పౌష్టికాహార రాహిత్యాల నిర్మూలన పూర్తిస్థాయిలో సాధ్యం కాలేదన్నారు. ఈ రెండు మౌలిక సమస్యలపై దృష్టి పెట్టకుండా క్షిపణులు, బాంబుల తయారీకే విలువైన వనరుల్లో ప్రధాన భాగాన్ని ప్రపంచ ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయని మోదీ అన్నారు. టెక్నాలజీని అభివృద్ధి కోసం ఉపయోగిస్తేనే దాని వల్ల ప్రపంచ దేశాలన్నీ పురోభివృద్ధి సాధిస్తాయని, పేదరికం, పౌష్టికాహార లోపం వ్యాధుల వంటి సమస్యల నుంచి బయటపడి ఆరోగ్యకర అవని ఆవిర్భావం సాధ్యమవుతుందన్నారు. ఈ ప్లీనరీలో యూఏఈ ఉపాధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ రషీద్ సహా అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. సైబర్ ప్రపంచాన్ని జిహాదీలు తమ సంకుచిత లక్ష్యాల సాధనకు వినియోగించుకుంటున్నారని, దీన్ని పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా టెక్నాలజీతో దుబాయ్ ప్రభుత్వం సాధించిన విజయాన్ని ప్రశంసించిన మోదీ ‘ఓ ఎడారినే మార్చేశారు. ఇదో అద్భుతం’ అని పేర్కొన్నారు. ఈ విషయంలో గల్ఫ్ ఎమిరేట్ మొత్తం ప్రపంచానికి ఆదర్శనీయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరిగిపోతోందని పేర్కొన్న ఆయన, 9.5శాతం మంది ప్రజలు పేదరిక రేఖ దిగువనే మనుగడ సాగిస్తున్నారని తెలిపారు. దీన్ని నిర్మూలించాలంటే పేదరికం, నిరుద్యోగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, విద్యా వ్యాప్తకి పెద్దపీట వేయాలని, అందరికీ ఆవాస కల్పనే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఇవన్నీ కూడా పూర్తిస్థాయి అభివృద్ధి లక్ష్య నిర్దేశనంతోనే సాధ్యమవుతాయన్నారు.

భారత్‌లో తమ ప్రభుత్వం ఈ లక్ష్య సాధన కోసం టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటోందని, అభివృద్ధి సంపద అందరికీ అన్న ధ్యేయంతో పని చేస్తోందని తెలిపారు. మొత్తం 125 కోట్లమంది భారతీయుల సాధికారతే ధ్యేయంగా అన్ని కీలక రంగాలపైనా తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు.

భారత దేశ జనాభా మొత్తం ప్రపంచ జనాభాలో ఆరోవంతు అన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత పాతికేళ్లుగా మాతృత్వ మరణాలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్న మోదీ, భారత దేశం ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లోనూ సాధించిన విజయాలను వివరించారు. కేవలం ఒక కిలోమీటర్‌కు ఏడు రూపాయల ఖర్చుతోనే అంగారక గ్రహం పైకి వ్యోమనౌకను పంపగలిగామని, అలాగే భారత్‌లో రవాణా ఖర్చుకూడా గణనీయంగా తగ్గిందని మోదీ గుర్తు చేశారు. కనిష్ట స్థాయి ప్రభుత్వం, గరిష్టస్థాయి పాలన అన్న లక్ష్యంద్వారా సంక్షేమ పథకాల ప్రయోజనాలను దేశ ప్రజలు అందరి ముంగిళ్లకు చేరుస్తున్నామన్నారు.



కాషాయం జోలికెళ్తే కటీఫ్




రజనీతో పొత్తుపై కమల్ మెలిక

కేంబ్రిడ్జ్ (మసాచ్యూసెట్స్), ఫిబ్రవరి 11: త్వరలోనే తమిళనాడు రాజకీయ పార్టీ పెడతానని సంకేతాలు అందించిన ప్రముఖ నటుడు కమల్ హాసన్, మరో సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో పొత్తు విషయంలో తాజా మెలిక పెట్టారు. రజనీకాంత్ రంగు ‘కాషాయం’ అయితే, ఆయనతో పొత్తుకు తాను ఎంతమాత్రం సిద్ధంగా లేనని కమల్ స్పష్టం చేశారు. పరోక్షంగా బీజేపీతో రజనీకాంత్ సన్నిహితం అవుతున్నారన్న సంకేతాలను తన మాటల్లో ఆయన ధ్వనించారు. రాజకీయాల్లో ఉన్నత ప్రమాణాలను పాదుగొల్పటంతోపాటు, వాటిని సమూలంగా ప్రక్షాళన చేయాలన్న లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి ప్రవేశించనున్నట్టు కమల్ వెల్లడించారు. రజనీకాంత్‌తో ఇటు మ్యానిఫెస్టోలు, అటు ఆలోచనల్లో సారూప్యత వుంటే ఆయనతో కలిసి పని చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్న కమల్ ‘రజనీకాంత్ కాషాయ దిశగా అడుగులు వేయకుండా ఉంటేనే ఇది సాధ్యం’ అని తెలిపారు. ఇక్కడి హార్వార్డ్ యూనివర్శిటీలో జరిగిన వార్షిక భారతీయ సదస్సులో కమల్ మాట్లాడారు. రజనీకాంత్‌తో పొత్తు విషయంలో ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టతా లేదని, అయితే ఇందుకు సంబంధించి తన ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. అవసరమైతే రజనీతోనే కాకుండా ఇతర పార్టీలతోనూ చేతులు కలిపేందుకు సిద్ధమని పేర్కొన్న ఆయన, ఎన్నికల అనంతర పొత్తులకు తాను వ్యతిరేకమన్నారు. ఏ పార్టీకీ మెజారిటీ రాకపోతే దాన్నే ప్రజాతీర్పుగా భావించాలని పేర్కొన్న ఆయన ‘అదే పరిస్థితి నకు ఎదురైతే ప్రతిపక్షంలోనే కూర్చుని తదుపరి ఎన్నికల వరకూ ఎదురుచూస్తా’ అని తెలిపారు. అంటే తన పార్టీకి మెజారిటీ రాకపోతే ప్రజాతీర్పునే శిరసావహిస్తాను తప్ప అధికారం కోసం ఎలాంటి పొత్తులకు ఒడిగట్టే ప్రసక్తి లేదని వెల్లడించారు. తాను రాజకీయ పార్టీని పెట్టాలనుకోవడంలో ప్రధాన ఉద్దేశం ప్రజలతో నేరుగా మాట్లాడాలన్నదేనని చెప్పిన ఆయన, ప్రస్తుతం తమిళనాడులో రాజకీయ వాతావరణం ఏమాత్రం బాగోలేదన్నారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ నాయకులపై విరుచుకుపడ్డారు. రాజకీయ అనుభవం కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, అలాగే ఇతర నేతల నుంచి కూడా పాఠాలు నేర్చుకోడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఎన్నికల్లో పోటీకి అవసరమైన నిధులను సమీకరించుకోగలనన్న ధీమాను వ్యక్తం చేసిన ఆయన, ప్రపంచవ్యాప్తంగా వున్న తమిళ ప్రజలు కొత్త ఆలోచనలతో ముందుకొచ్చి తనకు సహకరించాలన్నారు.

ఐదుకు పెరిగిన మృతులు

- మరిన్ని మృతదేహాలు లభ్యం
- ముగ్గురు మిలిటెంట్లు హతం
- గాయపడ్డ గర్భిణి..ఆసుపత్రిలో ప్రసవం
- జమ్ము ఎన్‌కౌంటర్ స్థలానికి ఎన్ఐఎ

సుంజువాన్ (జమ్ము), ఫిబ్రవరి 11: జమ్ములో జరిగిన మిలిటెంట్ దాడిలో మరణించిన వారి సంఖ్య ఆరుకు పెరిగింది. ముగ్గురు జవాన్లు, ఓ పౌరుడి మృత దేహం లభించిందని ఆర్మీ ఆదివారం తెలిపింది. ముగ్గురు జైషే మిలిటెంట్లను మట్టుబెట్టామని, ఇద్దరు జూనియర్ అధికారులు సహా ఐదుగురు జవాన్లు ఈ దాడిలో మరణించారని ఆర్మీ ప్రతినిధి వెల్లడించారు.కాశ్మీర్ ఇన్‌ఫ్రాంట్రీ 36వ బ్రిగేడ్ స్థావరంపై దాడి చేసిన మిలిటెంట్లను మట్టుబెట్టామని ఓ ప్రకటనలో తెలిపారు. వీరిలో ఇద్దరిని శనివారంనాడే కాల్చిచంపామని, మూడో మిలిటెంట్ మృత దేహం నేడు లభించిందన్నారు. ఈ ముగ్గురూ కూడా సైనిక దుస్తుల్లోనే ఉన్నారని, సంఘటన స్థలంలో ఎకె 56రైఫిళ్లు, పేలుడు పదార్థాలు, గ్రెనేడ్ లాంచర్, గ్రెనేడ్‌లను స్వాధీనం చేసుకున్నామని లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ తెలిపారు. ఇప్పటి వరకూ ఆరుగురు మరణించారని, ఆరుగురు మహిళలు, పిల్లలు సహా పది మంది గాయపడ్డారని తెలిపారు. గాయపడ్డ వారిలో ఓ గర్భిణి కూడా ఉందని, ఆసుపత్రికి తరలించిన తర్వాత ఆమె ఓ ఆడ శిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. కాల్పుల్లో గాయపడ్డ 14 ఏళ్ల ఓ బాలుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సైనిక ప్రతినిధి వెల్లడించారు. కాగా, సంఘటన స్థలాన్ని జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ బృందం ఆదివారం సందర్శించి, మిలిటెంట్ దాడికి సంబంధించిన కీలక ఆధారాలను సేకరించింది. మిలిటెంట్లు ఈ క్యాంప్‌లోకి ఎలా ప్రవేశించగలిగారు? పాకిస్తాన్ నుంచే వీరు వచ్చారా లేక స్థానిక మిలిటెంట్లేనా అన్న అంశంపై ఎన్ఐఎ దృష్టి పెట్టిందని అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. పదిహేను నెలల క్రితం ఇదే తరహాలో జమ్ము ప్రాంతంలో మిలిటెంట్లు దాడి జరిపిన విషయం తెలిసిందే. ఆ దాడిలో ఏడుగురు జవాన్లు మరణించారు.



సంజువాన్ సైనిక శిబిరంలోని ఆర్మీ కుటుంబాల క్వాటర్స్‌లో గస్తీ నిర్వహిస్తున్న జవానులు

ఆయేషా మీరా హత్య కేసుపై
‘సిట్’ విచారణ

తెనాలి, ఫిబ్రవరి 11: గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన బి - ఫార్మశీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసు పునర్విచారణలో భాగంగా హైకోర్టు నియమించిన సిట్ బృందం ఆదివారం తెనాలిలోని ఆయేషా మీరా తల్లిదండ్రులను దాదాపు 5 గంటలపాటు విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైకోర్టు నియమించిన సిట్ బృంద నాయకుడు, డిఐజి సిహెచ్ శ్రీకాంత్ నేతృత్వంలో సభ్యులు డిఎస్పీలు శ్రీలక్ష్మి, హైమావతి తెనాలిలోని పాండురంగపేటలో నివాసముంటున్న ఆయేషామీరా తల్లిదండ్రులు శంషాద్‌బేగం, ఇక్బాల్ భాషాలను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విచారించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని సిట్ అధికారుల ఎదుట ఆయేషా తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సమయంలో మీడియాను అనుమతించలేదు. పూర్తి వివరాలు హైకోర్టులో సమర్పించనున్నట్లు సిట్ అధికారులు చెప్పారు. అనంతరం ఆయేషామీరా తల్లిదండ్రులు విలేఖరులతో మాట్లాడుతూ సిట్ అధికారి శ్రీకాంత్‌పై తమకు విశ్వాసం ఉందన్నారు. కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని కోరామన్నారు. అసలు దోషులను పట్టుకోకపోయినా ఫర్వాలేదు గాని గతంలో ఈ కేసులో సత్యంబాబు మాదిరిగా మరో అమయకుడ్ని బలి చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. అసలైన నిందితులు ఎవరో అందరికీ తెలుసని తాము చెబుతున్నా పట్టించుకోవటం లేదని, వారిని విచారిస్తే నిందితులు బయటకు వస్తారని తెలిపారు. తమ కుమార్తె హత్య కేసులో హాస్టల్ వార్డెన్ పద్మతోపాటు ఆమె భర్త, మరో ముగ్గురు విద్యార్థినుల ప్రమేయం ఉన్నట్లు వారు ఆరోపించారు. 11 సంవత్సరాలుగా విచారణ కొనసాగుతున్న ఆయేషా మీరా కేసులో ఇప్పటికీ అసలు నిందితులను పట్టుకోలేకపోవటం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు.

అవినీతిలో కొత్త రికార్డు

- బీజేపీని తూర్పారబట్టిన రాహుల్
- మళ్లీ మాకే పట్టంకట్టండి
- కర్నాటక ర్యాలీలో పిలుపు



కొప్పళ్ (కర్నాటక), ఫిబ్రవరి 11: కర్నాటకలోని అధికార కాంగ్రెస్ పార్టీ నిష్కళంకమని పార్టీ అధినేత రాహుల్‌గాంధీ స్పష్టం చేవారు. అవినీతి రహితమైన పరిపాలననే సిద్ధరామయ్య ప్రభుత్వం అందిస్తోందని చెప్పిన ఆయన, బీజేపీ మాత్రం అవినీతిలో కొత్త రికార్డు సృష్టించిందని ఆరోపించారు. ఉత్తర కర్నాటకలో ఆదివారం జరిగిన ప్రచారంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ, గతంలో బీజేపీ అధికారంలో ఉన్నపుడు జరిగిన అవినీతి గురించి ప్రస్తావించారు. అప్పట్లో ఒకదాని తరువాత ఒకటిగా కుంభకోణాల పరంపరే కొనసాగిందని గుర్తు చేసిన రాహుల్, ఈ ఐదేళ్ల సిద్ధరామయ్య పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని తెలిపారు. జనాశీర్వాద్ యాత్ర పేరుతో జరిగిన ఈ ర్యాలీలో పాల్గొన్న రాహుల్, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పర్టీని బలపర్చాలని, అలాగే సిద్ధరామయ్య నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని మరింతగా ప్రగతి పథంలో నడిపించడం సాధ్యమవుతుందని అన్నారు. పార్టీ నేతలతో కలిసి రాహుల్ ప్రత్యేక బస్సులోనే ప్రయాణించారు. దారి పొడవునా ఆయనకు ప్రజలు హర్షధ్వానాలు పలికారు. కొద్దిదూరం బస్సులో వెళ్లిన తరువాత సీఎం సిద్ధరామయ్యతో కలిసి కాలినడకనే రాహుల్ ముందుకు సాగారు. చాలా సందర్భాల్లో ప్రజలకు సన్నిహితం కావడానికి, వారితో మమేకం కావడానికి ప్రయత్నించారు. పలు సభల్లో మాట్లాడిన ఆయన ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని బీజేపీని తూర్పారబట్టారు. గతంలో కర్నాటకలో బీజేపీ అధికారంలో ఉన్నపుడు ఏ తరహా కుంభకోణాలు జరిగాయో ప్రధాని మోదీ పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ హయాంలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారని, నలుగురు సీఎంలు జైలుకు కూడా వెళ్లారని, రాజీనామా కూడా చేయాల్సి వచ్చిందని రాహుల్ తెలిపారు. ఇంత జరిగినా నరేంద్ర మోదీకి తన పార్టీ పాలనలో అవినీతి కనిపించలేదని, కాంగ్రెస్‌నే లక్ష్యంగా చేసుకుని గురివింద చందంగా వ్యవహరిస్తున్నారని రాహుల్ అన్నారు. 2008 నుంచీ సాగిన ఐదేళ్ల బీజేపీ పాలనలో ఎడ్యూరప్ప, సదానంద గౌడ, జగదీష్ సెట్టార్లుఅ అవినీతి ఆరోపణల కారణంగా ఒకరి తరువాత ఒకరు పదవుల్లోకి వచ్చారని, అప్పట్లో రాష్ట్రంలో అవినీతి పరాకాష్టకు చేరుకుందన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆషిష్ చౌహాన్

పరిశోధనలకు ప్రాధాన్యం పెరగాలి

- ★ ఆచార్యుల నియామకాల్లో రాజకీయ జోక్యం వద్దు
- ★ ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆషిష్ చౌహాన్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, ఫిబ్రవరి 11: జాతీయ విశ్వవిద్యాలయాల్లో అభివృద్ధి పరిశోధనలకు ప్రాధాన్యం పెరగాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆష్ష్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. ఏబీవీపీ జాతీయ కార్యసమితిలో భాగంగా విశాఖలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ విశ్వవిద్యాలయాలతో సమానంగా రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన మెరుగుపడాలని సూచించారు. విశ్వవిద్యాలయాల ఆచార్యుల నియామకాల్లో రాజకీయ జోక్యం సహేతుకం కాదని అభిప్రాయపడ్డారు. రాజకీయ జోక్యం లేకుండా అర్హత, నైపుణ్యత ప్రాతిపదికన నియామకాలు చేపడితే పరిశోధనల్లో నాణ్యత ఉంటుందని, విశ్వవిద్యాలయాలు దేశ భవిష్యత్ పాలకులను అందించేలా ఉండాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం ద్వారా సమాజానికి నాయకత్వ లక్షణాలు కలిగిన రాజకీయ నాయకులను అందించేందుకు పునాదివేయాలన్నారు. దీనిలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ‘హాస్టల్ అభియాన్’ పేరిట దేశ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సుబ్బయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యా విధానంలో సమూల మార్పులు రావాలన్నారు. భారతీయ విద్యదీకరణ జరగాలని, వృత్తి విద్యాకోర్సులతో పాటు నైపుణ్య ఆధారిత కోర్సులను విశ్వవిద్యాలయాలు అందించాలన్నారు. మహిళా సాధికారిత సాధించడంతో పాటు మహిళల రక్షణకు ప్రత్యేక రక్షణ విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్కాలర్‌షిప్ పథకాన్ని స్వాగతిస్తున్నట్టు వెల్లడించారు.

ఈ పథకాన్ని అన్ని విద్యాలయాలకు వర్తింప చేయాలన్నారు. సమావేశంలో జాతీయ కార్యదర్శి నిధి త్రిపాఠి, జాతీయ కన్వీనర్ సాకేత్ భగవాన్, రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, జిల్లా సంఘటన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనే ధ్యేయం కావాలి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: విద్య, సాహిత్య అధ్యయనాన్ని కేవలం ఉపాధి, వ్యాపారానికే పరిమితం చేయకుండా జ్ఞాన సముపార్జనకు సాధనంగా ఉపయోగించుకోవాలని హార్వర్డ్ విద్యార్థులకు కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ హితవు పలికారు. అమెరికాలోని బోస్టన్‌లో ప్రతి ఏడాది జరిగే భారతీయ ఉత్సవం-2018 సమ్మేళనంలో భారతీయ సాహిత్యంపై జరిగిన చర్చా గోష్టిలో ప్రధానకర్తగా యార్లగడ్డ పాల్గొన్నారు.

వాణిజ్యభూమి

స్థూల ఆర్థిక గణాంకాలు కీలకం

- ప్రభావితం చేయనున్న ప్రపంచ మార్కెట్లు
- ఈ వారం స్టాక్ మార్కెట్ సరళిపై అంచనా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారత స్టాక్ మార్కెట్లను సోమవారం నుంచి మొదలయ్యే ఈ వారంలో ప్రపంచ మార్కెట్లలో నెలకొనే ధోరణితో పాటు దేశీయంగా పారిశ్రామిక ఉత్పత్తి, ద్రవ్యోల్బణం గణాంకాలు ప్రభావితం చేయనున్నాయని నిపుణులు పేర్కొన్నారు. మహాశివ రాత్రి పండుగను పురస్కరించుకొని దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం పనిచేయవు. అందువల్ల ఈ వారంలో నాలుగు రోజులే మార్కెట్లు పనిచేస్తాయి. ఈక్విటీలపై ఆర్జించే లాభాలపై పది శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను విధిస్తూ బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదన స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపడంతో శుక్రవారంతో ముగిసిన గత వారంలో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ భారీగా 1,060.99 పాయింట్లు (3.02 శాతం) పడిపోయింది. 'ప్రస్తుతం వెలువడుతున్న మూడో త్రైమాసిక ఫలితాలు పెరుగుతున్న కార్పొరేట్ కంపెనీల లాభాలను, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను ప్రతిబింబిస్తున్నాయి. ఇది మదుపరులకు ఉపశమనం కలిగించే అంశం. అయితే, ద్రవ్యోల్బణం ఒత్తిడి, ద్రవ్యలోటు పెరిగే అవకాశాలు ఉండటంతో ఆర్‌బీఐ తన ద్రవ్య విధాన సమీక్షలో కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ విభాగం అధిపతి వినోద్ నాయర్ పేర్కొన్నారు. అయితే, డిసెంబర్ నెల ఐఐపీ, జనవరి నెల సీపీఐ, డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం గణాంకాలు ఈ వారం స్టాక్ మార్కెట్‌ను నిర్దేశించనున్నాయని ఆయన విశ్లేషించారు. గెయిల్, ఎన్‌హెచ్‌పీసీ వంటి పెద్ద కంపెనీలు తమ మూడో త్రైమాసిక ఫలితాలను ఈ వారం వెల్లడించనున్నాయి. శుక్రవారం, శనివారం వెలువడిన ఎస్‌బీఐ, కోల్ ఇండియా మూడో త్రైమాసిక ఫలితాలు కూడా ఈ వారం మార్కెట్‌ను ప్రభావితం చేయనున్నాయని పేర్కొన్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న ధోరణిని బట్టి స్పందిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇది కొనసాగవచ్చని నిపుణులు పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లు ఎలా పుంజుకుంటాయి లేదా పడిపోతాయనే అంశాన్ని దేశీయ మార్కెట్లలో మదుపరులు పరిశీలిస్తుంటారని సామ్‌కో సెక్యూరిటీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ జమీత్ మోడీ పేర్కొన్నారు.

కృష్ణపట్నం కేంద్రంగా సముద్ర ఉత్పత్తుల ఎగుమతి

స్నోమాన్ లాజిస్టిక్ చైర్మన్ కిషన్ గుప్తా వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 11: భారతదేశంలో మరో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 900 కిమీ నిడివి గల సముద్రతీరం ఉన్నందునే దేశ విదేశాలకు సముద్ర ఉత్పత్తుల రవాణా కోసం కృష్ణపట్నంలో స్నోమాన్ లాజిస్టిక్స్ వేర్ హౌస్‌ను 3600 పాలెట్స్ సామర్థ్యంతో ఏర్పాటు చేశామని ఆ సంస్థ చైర్మన్ ప్రేమ్‌కిషన్ గుప్తా ఆదివారం నాడిక్కడ వెల్లడించారు. రానున్న రెండేళ్లలో దశలవారీగా దీన్ని 10వేల పాలెట్స్‌కు విస్తరించనున్నామని ఆ సంస్థ సీఈవో సునీల్ నాయర్ తెలిపారు. తమ కార్యకలాపాల విస్తరణలో భాగంగానే కృష్ణపట్నం వద్ద టంపర్‌బార్ కంట్రోల్ వేర్ హౌసింగ్ కేంద్రాన్ని ఇటీవలే ప్రారంభించామన్నారు. అక్కడి గేట్‌వే డిస్ట్రిపార్క్స్, లాజిస్టిక్స్ పార్క్స్‌లో 3600 పాలెట్స్ సామర్థ్యం గల టెంపర్ బార్ కేంద్రాలతో పాటు అదనంగా 10వేల చదరపు అడుగుల్లో డ్రై వేర్ హౌజింగ్‌ను ఏర్పాటుచేశారు.

ఇందులో అన్ని రకాల సదుపాయాలతో పాటు ఏడు హ్యాండ్లింగ్, లోడింగ్ బేస్, జి ప్లస్ కాల్‌లేకింగ్ సిస్టమ్స్, బ్లాస్ట్ ఫ్రీజింగ్, భిన్న రకాల టెంపర్‌బార్ చాంబర్లు అత్యంత ఆధునిక హ్యాండ్లింగ్ ఏర్పాటు, ఇతర సదుపాయాలు కల్పించామన్నారు. ప్రత్యేకంగా సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల కోసం ఒక డెడికేటెడ్ యాప్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇలాంటి కేంద్రాలను కోల్‌కత్తా, విశాఖ, భువనేశ్వర్, కొచ్చిన్, ముంబయి, చెన్నైలో నిర్వహిస్తున్నామన్నారు.

ఈ ఏడు.. ఉపాధి మెండు

పది నుంచి 15శాతం వృద్ధి ◆ కార్పొరేట్ రంగంలో ఉద్యోగాల కల్పనపై తాజా సర్వే అంచనా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారత కార్పొరేట్ రంగంలో ఈ సంవత్సరం ఉద్యోగాల కల్పన పుంజుకుంటుందని ఒక నివేదిక అంచనా వేసింది. 2017లో తగ్గిపోయిన ఉద్యోగాల కల్పన 2018లో 10 నుంచి 15 శాతం మేరకు పుంజుకుంటుందని పేర్కొంది. ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2018 ప్రకారం, ఈ సంవత్సరం కార్పొరేట్ రంగంలో ఉద్యోగాల కల్పన సానుకూలంగా ఉంటుంది. 10 నుంచి 15 శాతం వరకు పుంజుకుంటుంది. 120 మందికి పైగా యాజమాన్యాల నుంచి ఉద్యోగాలకు సంబంధించిన ఉద్దేశాలు, దేశవ్యాప్తంగా గల 5,10,000 మంది విద్యార్థుల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. హెచ్‌ఆర్ టెక్నాలజి సొల్యూషన్స్ కంపనీ పీపుల్‌స్ట్రాంగ్, స్కిల్ అసెస్‌మెంట్ సంస్థ వీబాక్స్‌లు పీర్సన్, సీఐఐ, ఏఐసీటీఈ, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ఏఐయూలతో కలిసి సంయుక్తంగా ఈ సర్వే నిర్వహించాయి. మునుపెన్నడూ లేనంతగా గత అయిదేళ్లలో అత్యధికంగా 45.6 శాతం ఉపాధి అవకాశాలు పెరిగాయని నివేదిక వెల్లడించింది. 'దేశం పరివర్తన దశలో ఉంది. మన జీవితాలపై డిజిటల్ ప్రభావం ఉంది. ఈ దశను విజయవంతంగా పూర్తి చేయడానికి సప్లై వైపు, డిమాండ్ వైపు ఎంతో కృషి చేయవలసిన అవసరం ఉంది. మనం సరయిన మార్గంలోనే ఉన్నామని గణాంకాలు వెల్లడిస్తున్నాయి' అని పీపుల్‌స్ట్రాంగ్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పంకజ్ బన్సల్ అన్నారు. ఢిల్లీ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లు అత్యధిక ఉపాధి అవకాశాలు గల తొలి పది రాష్ట్రాలలో ఉన్నాయని కూడా ఆ నివేదిక వెల్లడించింది. భారత ఐటీ హబ్ బెంగళూరు ఉద్యోగాల కల్పన విషయంలో తన కీలక స్థానాన్ని నిలబెట్టుకున్నది. బెంగళూరు ఉపాధి కల్పనలో అగ్ర స్థానంలో ఉందని సర్వే తేల్చింది. చెన్నై, ఇండోర్, లక్నో, ముంబయి, నాగ్‌పూర్‌లు వరుసగా తరువాత స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ ఏడో స్థానంలో నిలిచింది. దాని తరువాత స్థానాల్లో పుణే, తిరుచిరాపల్లి ఉన్నాయి.

దేశ రాజధాని ఢిల్లీ అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న నగరంగా నిలిచింది. ఇక్కడ మూడింట రెండు వంతుల మంది ఉపాధి పొందుతున్నారు. 18-25 సంవత్సరాల మధ్య వయసు గల వారిలో 46 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. 26-29 సంవత్సరాల మధ్య వయసు గల వారిలో 26 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. మొత్తం మీద 40.44 శాతం ఉన్న ఉపాధి అవకాశాలు గత సంవత్సరం 45.60 శాతానికి పెరిగాయి.

అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో నాలుగు వేల కోట్లు కేటాయించాలి

ఏపీ ప్రభుత్వానికి బాధితుల సంఘం విజ్ఞప్తి

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడానికి రూ.4000 కోట్లు కేటాయించాలని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం డిమాండ్‌చేసింది. గత మూడు సంవత్సరాలుగా చేపట్టిన అనేక ఆందోళన కార్యక్రమాల ఫలితంగా మృతిచెందిన 96 కుటుంబాలకు రూ.5 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని బాధితుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నగరంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులకు డిపాజిట్ సొమ్ము చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇంతవరకు 180 మంది బాధితులు మనోవ్యథతో మృతిచెందారన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం చేస్తామని ప్రకటించినా నేటికీ పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తున్నట్టు చెప్పారు. 'అగ్రిగోల్డ్ బాధితుల గడప గడపకు' పేరుతో ఈ నెల 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, బాధితులకు ధైర్యం చెబుతున్నామన్నారు. ఫిబ్రవరి 15,16 తేదీల్లో మండల స్థాయిలో జీపు యాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 19 నుంచి 21వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో బాధిత కుటుంబాలతో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి, ఏప్రిల్‌లో బాధితులకు చెల్లింపులు చేయని పక్షంలో చలో విజయవాడ పిలుపునిచ్చి, చావోరేవో తేల్చుకుంటామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 19.52 లక్షల మంది అగ్రిగోల్డ్ మోసానికి బలయ్యారన్నారు. ఎనిమిది రాష్ట్రాల్లో సుమారు 32 లక్షల మంది బాధితులు రోడ్డున పడగా సుమారు 8వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉందన్నారు. న్యాయం కోసం జరిగే పోరాటానికి బాధితులందరూ సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 11: పదవ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్‌ను ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంతోపాటు కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులకు షాద్‌నగర్ పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో, కొందుర్గు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మోడల్ టెస్ట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించిందని ఎస్ఎఫ్ఐ నాయకుడు ప్రశాంత్ వివరించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ విద్యాసంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి టెస్ట్‌ల వల్లే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.

త్వరలో గుంటూరు-గుంతకల్లు మధ్య విద్యుత్ రైళ్ల పరుగులు

నంద్యాల, ఫిబ్రవరి 11 : గుంటూరు-గుంతకల్లు మార్గంలో అతి త్వరలోనే విద్యుత్ రైళ్లు పరుగులు పెట్టే అవకాశాలు ఉన్నాయని సీనియర్ డీఈ శ్రీనివాస్ తెలిపారు. అందుకనుగుణంగా గుంటూరు-గుంతకల్లు మధ్య 429 కి.మీ దూరం ఉన్న రైలు మార్గంలో విద్యుదీకరణ పనులను పూర్తి చేశారు. అలాగే పాణ్యం-దిగువమెట్ట మధ్య 60 కి.మీ మేర విద్యుదీకరణ పనులను పూర్తి చేసి ఆదివారం విద్యుత్ రైలింజన్‌తో ట్రయల్ రన్ నిర్వహించగా విజయవంతమైంది. పాణ్యం-దిగువమెట్ట మధ్య నల్లమల అడవుల్లో రెండు టన్నెల్స్ ఉన్నాయి. ఆయా టన్నెల్స్‌లో విద్యుదీకరణ పనులు చేపట్టడంలో ఇబ్బందులు ఎదురైనప్పటికీ విజయవంతంగా పూర్తిచేయడం వల్ల విద్యుత్ రైలింజన్ ఇబ్బంది లేకుండా పరుగులు పెట్టింది. ట్రయల్ రన్ నిర్వహించిన రైలింజన్ దిగువమెట్ట రైల్వేస్టేషన్ చేరుకున్న విద్యుత్ రైలింజన్ నడిపిన అధికారులు, సిబ్బంది, సంబరాలు చేసుకున్నారు.



నంద్యాల రైల్వే స్టేషన్‌లో విద్యుత్ రైలింజన్

1వ పేజీ తరువాయి

నద్వీపై బోర్డు బహిష్కరణ వేటు

సున్నీ వక్ఫ్ బోర్డు, అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యులతో పాటు పలు ముస్లిం మత పెద్దలతో సమావేశమై అయోధ్యలో రామాలయం నిర్మాణానికి సహకరించాల్సిందిగా కోరిన సంగతి తెలిసిందే. అయితే ఆ తర్వాత నద్వీ మీడియాతో మాట్లాడుతూ మసీదు నిర్మాణానికి స్థలం కేటాయిస్తే తమకు అభ్యంతరం లేదని చెప్పారు. ఇలాఉండగా ఈ విషయాన్ని ముస్లిం పర్సనల్ లా బోర్డు తీవ్రంగా పరిగణించింది. ఆదివారం సంతోష్‌నగర్‌లోని ఒవైసీ ఆసుపత్రి ఆవరణలోని ఆడిటోరియంలో బోర్డు సభ్యులు సమావేశమై నద్వీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. వెంటనే సదరు సభ్యున్ని బోర్డు నుంచి బహిష్కరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశానంతరం హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ మీడియాతో మాట్లాడుతూ బాబ్రీ మసీదు విషయంలో తమ వైఖరి మారదన్నారు. ప్రత్యామ్నాయ స్థలంలోకి మారే ఆలోచన ఏదీ లేదని, రాజీపడేది లేదని ఖండితంగా చెప్పారు. బాబ్రీ మసీదు స్థలాన్ని సాధించే వరకూ పోరాటం చేయాలని 1993 సంవత్సరంలో అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు చేసిన తీర్మానానికే కట్టుబడి ఉన్నామని, ఉంటామనీ, ఈ సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు.

బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మతోన్మాదం పెరిగిందని అసద్ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాఖ్ విషయంలో కేంద్రం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు.

తమ హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని ఆయన చెప్పారు. ట్రిపుల్ తలాఖ్ విషయంలో సహకరించిన ప్రతిపక్షాల సభ్యులకు అసద్ కృతజ్ఞతలు తెలిపారు. ట్రిపుల్ తలాఖ్ బిల్లు రాజ్యసభలో పెండింగ్‌లో ఉందని ఆయన చెప్పారు. బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఆయన విమర్శించారు. బోర్డు 26వ ప్లీనరీ శుక్రవారం నుంచి జరుగుతున్నట్లు ఆయన చెప్పారు.

వచ్చినదెంత? వెచ్చించినదెంత!?


నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇది కేవలం నిజనిర్ధారణ కమిటీ తప్ప రాజకీయ కమిటీ ఎంతమాత్రం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

విభజన హామీలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధుల విడుదల, రెవెన్యూ లోటు, పలు అంశాల్లో కేంద్రం సహాయంలాంటి అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. పరిణామాలను చూసి ఏపీ ప్రజలతోపాటు తానూ బాధపడ్డానని, ఇలాంటి పరిస్థితిలో ప్రశ్నించడం తప్ప వేరొక మార్గం లేదన్నారు.

2014 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం, బీజేపీలకు మద్దతిచ్చానని, అందుచేత తనకు ప్రశ్నించాల్సిన బాధ్యత కూడా ఉందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం కావాలని తెలంగాణ నేతలు కోరుకున్నారు, వాళ్లకు రాష్ట్రం వచ్చింది, న్యాయం జరిగింది. మరి ఏపీకి ఇచ్చిన హామీల సంగతేమిటి..?. ఇప్పటి వరకు నోరు మెదపకుండా, ఒత్తిడి చేయకుండా తెదేపా ఎందుకు ప్రజల్లో నిరాశను కలిగించిందని పవన్ ప్రశ్నించారు. తెదేపా ప్రజలకు న్యాయం చేయకపోతే ఖచ్చితంగా ప్రశ్నిస్తానన్నారు. తనతో కలిసి వచ్చే వారి జాబితాను త్వరలో విడుదల చేస్తానని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ తీసుకున్న టాస్క్ బాగుందని ప్రశంసించారు. నిజమైన రాజకీయాలను పవన్ ప్రారంభించారని కొనియాడారు. కేంద్రం ఇస్తున్న నిధుల వివరాలకు, రాష్ట్రం చెబుతున్న అంకెలకు పొంతన లేదన్నారు. ఏపీలో తెదేపా ప్రభుత్వం ఆడరాని అబద్ధాలు ఆడుతోందని విమర్శించారు. 2014 ఎన్నికల్లో పవన్ వల్లే తెదేపా అధికారంలోకి వచ్చిందన్నారు. ఏపీ గడ్డు పరిస్థితుల్లో ఉందనే నిజం ప్రజలకు తెలియాలన్నారు. పవన్‌తో భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, కేవలం కొన్ని అంశాలపై చర్చించేందుకు మాత్రమే సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాను రాష్ట్ర ప్రయోజనాల విషయంలో పవన్‌తో కలిసి పని చేస్తానని, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారికంగా నిర్వహించాలి

- తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ చూపాలి
- చెంచుల పండుగకు ఇరు రాష్ట్రాలలోని చెంచులోకం తరలిరావలి
- సంస్కృతి, సాంప్రదాయాలపై దాడిని సహించం
- చెంచులోకం ఉమ్మడి రాష్ట్రాల గౌరవ అధ్యక్షుడు ధర్మకారి రాంకిషన్



నల్లమల అటవీ ప్రాంతంలో జరిగే చెంచుపండుగ కరపత్రాలను విడుదల చేస్తున్న చెంచులోకం ఉమ్మడి రాష్ట్రాల గౌరవ అధ్యక్షుడు రాంకిషన్, అధ్యక్షుడు శ్రీనివాసులు

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11: చెంచు జాతి అభివృద్ధి కోసం మహాశివ రాత్రి పర్వదినం రోజు గతంలో నిర్వహించిన మాదిరిగానే ప్రస్తుతం చెంచు మహాసభలను అధికారికంగా నిర్వహించాలని చెంచులోకం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షుడు ధర్మకారి రాంకిషన్ డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాంకిషన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు చెంచుల అభివృద్ధిని విస్మరిస్తున్నాయని ముఖ్యంగా కనీస సౌకర్యాలు కల్పించడంలో వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. రోజురోజుకు చెంచుల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని చెంచుజాతిని మనుగడ కోసం చెంచులోకం అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నట్టు ఆయన వెల్లడించారు. చెంచుల అభివృద్ధికి 1935లోనే అప్పటి అమ్రాబాద్ తహశీల్దార్ సయ్యద్ గౌస్ మొదటి సారిగా చెంచులోకం అనే సంస్థను ఏర్పాటు చేసి అప్పట్లోనే చెంచు జాతిని ఒకతాటిపైకి తెచ్చి వారి అభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపారు. 1991లో కూడా ప్రిన్సిపల్ సెక్రటరీ చటర్జీ సైతం చెంచుల మహాసభలు నిర్వహించారని ఈ సంప్రదాయం కొన్నేళ్ల పాటుసాగిందని అన్నారు. చెంచులకు అతి ఇష్టమైన పండుగ, జరుపుకునే అతిపెద్ద పండుగ మహాశివరాత్రి అని తెలిపారు. మహాశివ రాత్రి పర్వదినం రోజే శ్రీశైలంకు చెంచులు వచ్చి తమ బాగోగులు గురించి చర్చించుకునేవారని అన్నారు. ఇక్కడే అధికారికంగా గతంలో మహాసభలు నిర్వహించేవారని తెలిపారు. గత 20ఏళ్లుగా మహాసభలను ప్రభుత్వం నిర్వహించడంలేదని ఆరోపించారు. కానీ రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాక ఇంకా చెంచులపై వివక్షత కొనసాగుతుందని అన్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్‌లు చొరవ చూపి ఇరు రాష్ట్రాల్లో చెంచు మహాసభలు నిర్వహించి చెంచుల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించాలని చెంచులు కోరే విధంగా వారికి అభివృద్ధి ఫలాలను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 13వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అప్పాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల భౌరాపురం దగ్గర జరిగే చెంచుల పండుగకు ఇరు రాష్ట్రాల చెంచులోకం తరలిరావాలని ఆయన కోరారు. చెంచు ల పండుగకు నల్లమల అటవీ ప్రాంతంలోని వివిధ జిల్లాల నుండి చెంచులు తరలిరానున్నారని ఆయన తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలోని ఆరు జిల్లాలో అధికారికంగా చెప్పిన లెక్కల ప్రకారం 50 వేల జనాభా ఉం దని చెబుతున్నారని ఇది సంఖ్య తప్పు అన్నారు.

అటవీ ప్రాంతంలో ఎక్కడెక్కడో ఉన్నవారిని ఇంకా గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. విలేఖరుల సమావేశంలో చెంచులోకం రాష్ట్ర అధ్యక్షుడు కాట్రాజు శ్రీనివాసులు, లింగాల మిత్రమండలి బాలాజీ, మహబూబ్‌నగర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, టీఆర్ఎస్ మాజీ జిల్లా కన్వీనర్ బెక్కం జనార్ధన్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ తులసీరామ్‌కు సతీవియోగం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వీ.తులసీరామ్ సతీమణి భారతి (80) ఆదివారం కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గగన్‌పహడ్‌లోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. తులసీరామ్ గతంలో తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. పార్టీ ఉపాధ్యక్షునిగా కూడా పనిచేశారు. తులసీరామ్ భార్య మృతిచెందిన వార్త తెలుసుకున్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

సోమవారం ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అడవుల్లో నీటి నిల్వలకు కందకాలు!

రూ.10 కోట్ల బడ్జెట్

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 11: అడవుల్లో కార్చిచ్చు నివారణకు, భూసారం కొట్టుకుపోకుండా కోత నివారణ, భూగర్భ జలాల పెంపు తదితరాలకు ప్రభుత్వం సంరక్షణా చర్యలు చేపట్టింది. ఇందుకుగాను అటవీ శాఖ ఆధ్వర్యంలో తూర్పు కనుమల్లో 'వాట్' (వాటర్ అబ్జార్బ్ ట్రెంచెస్) పేరుతో కందకాలు తవ్వుతోంది. నల్లమల అడవుల్లో ఇప్పటికే కందకాలు తవ్వకం పూర్తికాగా, ఇపుడు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో తవ్వుతున్నారు. అటవీ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంపొందించడానికి, జంతు సంరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడానికి ఉద్దేశించి వినూత్న తరహాలో కందకాలు తవ్వుతున్నారు. ప్రధానంగా కొండ వాలు ప్రాంతాల్లో కందకాల తవ్వకం చేపట్టారు. స్థానిక గిరిజనులకు ఈ కందకాల తవ్వకం పనుల్లో ఉపాధి కల్పిస్తున్నారు.

రాజమహేంద్రవరం అటవీ సర్కిల్ పరిధిలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాల్లో మొత్తం 340 కిలోమీటర్ల మేర కందకాలు తవ్వడానికి చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు 142.06 కిలోమీటర్ల తవ్వకం పూర్తయింది. కాకినాడ డివిజన్‌లో 100 కిలోమీటర్లు, చింతూరు డివిజన్‌లో 40 కిలోమీటర్లు, ఏలూరు డివిజన్‌లో 100 కిలోమీటర్లు, కృష్ణా జిల్లాలో 100 కిలోమీటర్లు కందకాలు తవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. కాకినాడ డివిజన్‌లో 37 కిలోమీటర్లు, ఏలూరు డివిజన్‌లో 59 కిలోమీటర్లు, కృష్ణా జిల్లాలో 44 కిలోమీటర్లు వరకు కందకాల తవ్వకం పూర్తయింది. చింతూరు ప్రాంతంలో కందకాలు తవ్వకాన్ని స్థానిక ఆదివాసీలు నిరోధించారు. దీంతో ఈ ప్రాంతంలో తవ్వకం నిలిచిపోయింది. స్థానిక గిరిజనులకు కందకాల ప్రయోజనంపై అవగాహన కల్పించడానికి అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. మార్చి నెలాఖరుకల్లా కందకాల నిర్మాణం పూర్తికి చర్యలు చేపట్టారు.

ఒక్కో కందకాన్ని మూడు మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతు, 20 మీటర్ల పొడవున తవ్వుతున్నారు. ఒక కందకానికి, మరో కందకానికి మధ్య కాస్తంత ఖాళీ ఇచ్చి అక్కడ నుంచి మళ్ళీ తవ్వకాలు సాగిస్తున్నారు. మిషనరీని ఉపయోగించి కందకాల పనులను టెండర్ల విధానంలో నిర్వహిస్తున్నారు. అడవుల్లో కురిసే వర్షాల వల్ల ఈ కందకాల్లో నిత్యం నీరు ఉండటంతోపాటు, చెట్లూ, చేమలతో పచ్చగా ఉంటాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని అటవీ అధికారులు చెబుతున్నారు.



రాజమహేంద్రవరం అటవీ సర్కిల్‌లో తవ్వుతున్న కందకాలు

క్రీడాభూమి



నిరాశ చెందడం లేదు..
సిరీస్ తప్పక గెలుస్తాం
● భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ధీమా

జోహాన్సెస్‌బర్గ్, ఫిబ్రవరి 11: దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన నాలుగో వనే్డ కోల్పోయినంత మాత్రాన నిరాశ పడడం లేదని, సిరీస్‌ను గెలుస్తామన్న నమ్మకం ఉందని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఆరు వనే్డలలో ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచ్‌లలో వరుసగా మూడింటిని గెలుచుకున్న భారత్ నాలుగో మ్యాచ్‌లో గెలుపు ద్వారా ప్రపంచ ర్యాంకింగ్‌లో తొలి స్థానాన్ని ఆక్రమించుకోవాలని తహతహలాడింది. అయితే, నాలుగో వనే్డలో భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 289 పరుగులు చేసినప్పటికీ రెండుసార్లు వరుణుడు ఆటం కపర్చడంతో మ్యాచ్‌ను 28 ఓవర్లకు కుదించడంతో డక్ అండ్ లూయిస్ పద్ధతిలో ప్రత్యర్థి జట్టునే విజయం వరించింది. దీంతో చరిత్ర సృష్టించాలనుకున్న భారత్ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. అయితే, నాలుగో వనే్డలో ఓడిపోయినంత మాత్రాన సిరీస్ కోల్పోయినట్టు కాదని, ప్రత్యర్థికి ఒక అవకాశం వచ్చిందని, మిగిలిన మ్యాచ్‌లలో విజయం సాధిస్తామని కోహ్లీ ధీమాను వ్యక్తం చేశాడు. నాలుగో వనే్డలో జరిగిన పొరపాట్లు మళ్లీ దొర్లకుండా మిగిలిన మ్యాచ్‌లలో సత్తా చూపుతామని ఆయన అన్నాడు. 'ఇది ఒక విధంగా టీ-20 గేమ్‌లాంటిది. వచ్చిన సదవకాశాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోం..సిరీస్ చేజిక్కించుకుంటాం' అని కోహ్లీ పేర్కొన్నాడు.

అన్నీ కలిసొచ్చాయ్..అందుకే గెలిచారు

దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో వనే్డలో తమ జట్టు ఆటతీరుపరంగా జరిగిన పొరపాట్లను ఒప్పుకుంటూనే ప్రత్యర్థికి అన్ని అంశాలు కలిసొచ్చాయని, అందుకే వారు గెలిచారని కోహ్లీ పేర్కొన్నాడు. మూడు వనే్డలలో వరుసగా విజయకేతనం ఎగురవేసిన భారత్ 3-0 తేడాతో దక్షిణాఫ్రికాపై పైచేయి సాధించి నాలుగో మ్యాచ్‌పై దృష్టి సారించడం ద్వారా ప్రపంచ నెంబర్ వన్ ర్యాంక్‌ను సాధించాలని ఆరాటపడింది. అయితే, భారత్ ఆశలపై వరుణుడు నీళ్లు జల్లి ప్రత్యర్థి జట్టు విజయాన్ని నమోదు చేసుకుంది. దీంతో సిరీస్‌పై ఇరు జట్లు ఒక కన్నేశాయి. నాలుగో వనే్డలో తమ జట్టుపరంగా జరిగిన కొన్ని పొరపాట్ల వల్ల దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఆఖరి క్షణంలో బాగా మెరిశారని, తద్వారా మ్యాచ్‌లో గెలుపొందారన్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన తాము మంచి స్కోరు చేసినా, ప్రత్యర్థి అంతకుమించిన ఆటతీరును కనబరచడంతో విజయం వారినే వరించిందన్నాడు. దక్షిణాఫ్రికా జట్టులోని వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ డేవిడ్ మిల్లర్ అద్భుతంగా ఆడాడని కోహ్లీ అన్నాడు. ఆ జట్టు తీరు ఎంతో మెరుగుపడిందని చెప్పాడు.

వనే్డ ఇంటర్నేషనల్స్ (50 ఓవర్ల ఫార్మాట్)లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మెన్ టాప్-5 జాబితాలో విరాట్ కోహ్లీ చేరాడు. దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన వనే్డ అతనికి కెరీర్‌లో 206వ మ్యాచ్. ఆ మ్యాచ్‌లో 83 బంతులు ఎదుర్కొని 75 పరుగులు చేసిన కోహ్లీ వనే్డల ఖాతాలో ఇప్పుడు మొత్తం పరుగులు 9,423. ఇందులో 34 శతకాలు, 46 అర్ధ శతకాలు ఉన్నాయి. కాగా, సచిన్ తెండూల్కర్ (463 మ్యాచ్‌ల్లో 18,426 పరుగులు), సౌరవ్ గంగూలీ (11,221 పరుగులు), రాహుల్ ద్రవిడ్ (10,768 పరుగులు), మహేంద్ర సింగ్ ధోనీ (9,780 పరుగులు) వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నారు. కాగా, 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఎక్కువ పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో కోహ్లీకి 16వ స్థానం దక్కింది.

వర్షం వల్లే వారికి చాన్స్



భారత ఓపెనర్ శిఖర్ ధావన్

జోహాన్సెస్‌బర్గ్, ఫిబ్రవరి 11: దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన నాలుగో వనే్డలో వర్షం ఆటంకం కారణంగానే ప్రత్యర్థి జట్టుకు గెలిచే చాన్స్ దక్కిందని భారత ఓపెనర్ శిఖర్ ధావన్ అన్నాడు. ఆరు వనే్డల సిరీస్‌లో ఇప్పటివరకు జరిగిన నాలుగు మ్యాచ్‌లలో భారత్ వరుసగా మూడింటిలో ఘన విజయాన్ని నమోదు చేయగా, నాలుగో వనే్డలో వర్షం కారణంగా ఓవర్లు కుదించడంతో ప్రత్యర్థికి అవకాశం కలిసి వచ్చిందని వ్యాఖ్యానించాడు. నాలుగో వనే్డలో ధావన్ 107 పరుగులు చేశాడు. మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ డేవిడ్ మిల్లర్ రెండుసార్లు ఔటయ్యే ప్రమాదం నుండి బయటపడడంతో, అదే ఆ జట్టు గెలుపునకు దోహదపడిందని, లేకుంటే తమనే విజయం వరించేదని ఆయన వ్యాఖ్యానించాడు. ఇదొక్కటే కారణం కాకుండా వర్షం ప్రభావం కూడా ప్రత్యర్థికి కలసివచ్చే అంశమని అన్నాడు. తమ జట్టులోని స్పిన్నర్లు గత మూడు మ్యాచ్‌లలో ఆడినవిధంగా నాలుగో మ్యాచ్‌లో ప్రతిభను ప్రదర్శించలేకపోయారని అన్నాడు. తమ జట్టులోని స్పిన్నర్ల ద్వయం యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ ఆటతీరు అద్భుతమని, తమకంటే బాగా రాణిస్తున్నారని, ఇందుకు ఉదాహరణంగా గత మూడు వనే్డలలో వారు చూపిన ప్రతిభేనని అన్నాడు. వారిద్దరికీ తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, ప్రతిఒక్కరికీ అన్ని రోజులూ కలసివచ్చే అవకాశం లేదని, అప్పుడప్పుడూ ప్రతిబంధకాలు కూడా ఉంటాయని, అన్నింటినీ తట్టుకుని నిలబడగలిగినపుడే విజయావకాశాలు వరిస్తాయని పేర్కొన్నాడు. కాగా, శనివారం జరిగిన మ్యాచ్‌లో గెలుపు ద్వారా దక్షిణాఫ్రికా 3-1 తేడాతో ఉండగా, మిగిలిన రెండు మ్యాచ్‌లపై ఇరు జట్లు దృష్టి సారించాయి.

కెరీర్‌లో 100వ వనే్డ ఇంటర్నేషనల్ ఆడుతూ సెంచరీ సాధించిన తొలి భారతీయుడిగా శిఖర్ ధావన్ రికార్డు సృష్టించాడు. జొహాన్నెస్‌బర్గ్‌లో శనివారం జరిగిన నాలుగో వనే్డలో 105 బంతులు ఎదుర్కొన్న ధావన్ 109 పరుగులు చేసిన విషయం తెలిసిందే. కెరీర్‌లో అతనికి ఇది 13వ వనే్డ సెంచరీ. ఇన్నింగ్స్‌లో 34వ ఓవర్‌ను క్రిస్ మోరస్ వేసినప్పుడు ధావన్ ఈ అరుదైన రికార్డు నెలకొల్పాడు. కాగా, ప్రపంచ వనే్డ క్రికెట్‌లో గార్డెన్ గ్రీనిడ్జ్ (వెస్టిండీస్), క్రిస్ కెయిన్స్ (న్యూజిలాండ్), మహమ్మద్ యూసుఫ్ (పాకిస్తాన్), క్రిస్ గేల్ (వెస్టిండీస్), కుమార సంగక్కర (శ్రీలంక), మార్కస్ ట్రెస్కోథిక్ (ఇంగ్లాండ్), రాంనరేష్ శర్వాణ్ (వెస్టిండీస్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా) తమ తమ వందో వనే్డలో సెంచరీలు చేశారు. వారి సరసన ధావన్‌కు చోటు దక్కింది.

ఆటాడుకున్న వర్షం

జొహాన్నెస్‌బర్గ్: క్రికెట్ మ్యాచ్‌లకు వర్షం వల్ల ఆటంకం ఏర్పడడం కొత్తకాకపోయినా, భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య శనివారం జరిగిన నాలుగో వనే్డకు ఈ సమస్య ఎదురుకావడం అభిమానులను తీవ్ర ఒత్తిడికి గురి చేసింది. అసలు మ్యాచ్ పూర్తవుతుందా? లేదా? అన్న ప్రశ్న వారిని వెంటాడింది. చివరికి డక్‌వర్త్ లూయిస్ విధానాన్ని అనుసరించి, ఓవర్లను కుదించి, మ్యాచ్‌ని ముగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్లకు 289 పరుగులు సాధించింది. శిఖర్ ధావన్ (109) సెంచరీ చేయగా, కెప్టెన్ విరాట్ కోహ్లీ (75) అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 42 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కాగిసో రబదా, లుంగీ ఎన్గిడి చెరి రెండు వికెట్లు కూల్చారు. మొదట వర్షం కారణంగా భారత్ బ్యాటింగ్ ఆలస్యంగా మొదలైతే, ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత మరోసారి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీనితో మరోసారి ఆటకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితులు అనుకూలించిన తర్వాత, డక్‌వర్త్ లూయిస్ విధానంలో దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 28 ఓవర్లలో 202 పరుగులుగా నిర్ణయించారు.

ఓపెనర్లు అయిడెన్ మర్క్రామ్ (22), హషీం ఆమ్లా (33) మిడిల్ ఆర్డర్‌లో ఏబీ డివిలియర్స్ (28), డేవిడ్ మిల్లర్ (39) పరుగుల వేటను కొనసాగించారు. చివరిలో హెన్రిచ్ క్లాసెన్ (43 నాటౌట్), అండెల్ ఫెహ్లూక్వాయో (23 నాటౌట్) మరో వికెట్ కూలకుండా జట్టును గెలిపించారు. దక్షిణాఫ్రికా 25.3 ఓవర్లలోనే, ఐదు వికెట్లకు 207 పరుగులు సాధించి, ఐదు వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 51 పరుగులకు రెండు వికెట్లు పడగొట్టాడు. జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్య, యుజువేంద్ర చాహల్ తలా ఒక్కో వికెట్ కూల్చారు. కాగా, దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభానికి ముందు వాతావరణ పరిస్థితి ఆట కొనసాగడంపై అనుమానాలను రేపింది. ఎట్టకేలకు మ్యాచ్ పూర్తికాగా, ఎవరూ ఊహించని విధంగా దక్షిణాఫ్రికా గెలవడం భారత్ అభిమానులను నిరాశ పరచింది.

విరాట్ తీరుతో ఆశ్చర్యపోయాం
● దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్



హెన్రిచ్ క్లాసెన్

జోహాన్సెస్‌బర్గ్, ఫిబ్రవరి 11: భారత్‌తో శనివారం జరిగిన నాలుగో వనే్డ చివరిలో ఫాస్ట్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాతో బౌలింగ్ చేయించకుండా స్పిన్నర్లపైనే టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆధారపడిన తీరు తమను ఆశ్చర్యానికి గురిచేసిందని దక్షిణాఫ్రికా వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్ హెన్రిచ్ క్లాసెన్ వ్యాఖ్యానించాడు. చివరిలో 27 బంతుల్లోనే 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 43 పరుగులు చేసిన నాటౌట్‌గా నిలిచి, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్న క్లాసెన్ విలేఖరులతో మాట్లాడుతూ డెత్ ఓవర్లను ఫాస్ట్ బౌలర్లతో వేయించే సంప్రదాయాన్ని కోహ్లీ పాటించకపోవడం విచిత్రంగా ఉందని అన్నాడు. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ 4 ఓవర్లలో 27 పరుగులిచ్చి ఒక్క వికెట్ కూడా సాధించలేదు. బుమ్రా 5 ఓవర్లు బౌల్ చేసి 21 పరుగులకు ఒక వికెట్ పడగొట్టాడు. వీరికంటే ఎక్కువ ఓవర్లను కోహ్లీ స్పిన్నర్లతో వేయించాడు. ఆరు ఓవర్లు బౌల్ చేసిన కుల్దీప్ యాదవ్ 51 పరుగులకు రెండు వికెట్లు పడగొడితే, యుజువేంద్ర చాహల్ 5.3 ఓవర్లు బౌల్ చేసి ఒక వికెట్ కోసం ఏకంగా 68 పరుగులు సమర్పించుకున్నాడు. చివరి దశలో పేసర్లను కాదన్నందుకు కోహ్లీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. కాగా, కోహ్లీ బౌలర్లను వినియోగించిన తీరుపై తమ జట్టు మరో బ్యాట్స్‌మన్ డేవిడ్ మిల్లర్ కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశాడన్నాడు. గత మూడు వనే్డలలో ప్రత్యర్థి స్పిన్నర్లను నమ్ముకున్న భారత్ నాలుగో వనే్డ మాత్రం నిరాశే మిగిలిందని వ్యాఖ్యానించాడు. మూడు మ్యాచ్‌లు కోల్పోయిన తమకు మిగిలిన వాటిలో ప్రత్యర్థికి ధీటుగా సమాధానం చెప్పేందుకు గతంలో జరిగిన పొరపాట్లను నెమరువేసుకుని, పక్కా ప్రణాళికతో దూసుకుపోవడంతో నాలుగో వనే్డ తమను వరించిందని ఆయన అన్నాడు. అయితే, భారత స్పిన్నర్ల ద్వయాన్ని ఎదుర్కొనేందుకు తొలి మూడు మ్యాచ్‌లలో తాము ఇబ్బందులు ఎదుర్కొన్నా, వారి ఆటతీరును తెలుసుకున్న తాము మిగిలిన మ్యాచ్‌లలో విజయం సాధించేందుకు పెద్దగా హోంవర్క్ చేయలేదని అన్నాడు. నాలుగో మ్యాచ్ సందర్భంగా తమ జట్టు సభ్యులంతా గులాబీ రంగు దుస్తులు ధరించి బరిలోకి దిగడంతో గెలుపుపై మరింత నమ్మకం కుదిరిందని అన్నాడు. పింక్ డ్రెస్ వేసుకునే విషయమై డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చించుకున్న తర్వాతే ఒక నిర్ణయానికి వచ్చిన తమకు అదే కలసి వచ్చిందని ఆయన వ్యాఖ్యానించాడు. గాయాలబారిన పడి గత మూడు వనే్డలకు దూరంగా ఉన్న ఏబీ డివిలియర్స్ మళ్లీ జట్టులోకి రావడం కూడా తమకు కలిసివచ్చిన అంశమని అన్నాడు.




కెరీర్‌కు గుడ్‌బై

భారత ల్యూగర్ శివ కేశవన్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. సుమారు 12 సంవత్సరాలు వివిధ వింటర్ గేమ్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన కేశవన్ పయాంగ్‌చాంగ్‌లో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్ ల్యూగ్ ట్రయల్స్‌లో 34వ స్థానంలో నిలిచాడు. దీనితో పోటీల నుంచి నిష్క్రమించిన అతను, ఇంతకు ముందు ప్రకటించిన విధంగానే కెరీర్‌ను ముగించాడు.

వింటర్ ఒలింపిక్స్

డౌన్ హిల్ రేస్
వాయిదా

పయాంగ్‌చాంగ్, ఫిబ్రవరి 11: వింటర్ ఒలింపిక్స్‌కు వాతావరణ సమస్యలు తలెత్తుతాయన్న భయాందోళనలు నిజమయ్యాయి. దట్టమైన మంచు కురుస్తూ, మైనస్‌లో కొనసాగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా తట్టుకోలేనంత చల్లగాలులు వీస్తున్న నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన పురుషుల అల్పైన్ స్కీయింగ్ పోటీలను వాయిదా వేయాల్సి వచ్చింది. పురుషుల డౌన్ హిల్ రేసు ఈనెల 15వ తేదీకి, సూపర్-జీ పోటీ 16వ తేదీకి వాయిదా పడినట్టు అంతర్జాతీయ స్కీ సమాఖ్య (ఎఫ్ఐఎస్) ఒక ప్రకటనలో తెలిపింది. వింటర్ ఒలింపిక్స్‌లో ఈ విధంగా వాతావరణం అనుకూలించకపోవడంతో పోటీలు వాయిదా పడిన సంఘటనలు గతంలోనూ చోటు చేసుకున్నాయి. 1998 నగానో గేమ్స్ షెడ్యూల్‌ను మూడు సార్లు సవరించాల్సి వచ్చింది. 2010 వాంకోవర్ వింటర్ ఒలింపక్స్‌లో డౌన్‌హిల్ రేసులు వాయిదా పడ్డాయి. 2016లో జరిగిన సోచీ వింటర్ ఒలింపిక్స్‌లోనూ అల్పైన్ స్కీయింగ్ షెడ్యూల్‌ను మార్చారు. పయాంగ్‌చాంగ్‌లో పోటీల వాయిదా మొదలైంది. ఇది కొనసాగుతుందా? లేక వాతావరణం మెరుగుపడి, ఎలాంటి అంతరాయం లేకుండా పోటీలు ముగుస్తాయా అన్నది చూడాలి.



పురుషుల స్నోబోర్డింగ్ స్లోప్ స్టయిల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన టీనేజర్ రెడ్ గెరార్డ్

స్నోబోర్డింగ్‌లో గెరార్డ్‌కు స్వర్ణం

పయాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా), ఫిబ్రవరి 11: ఈసారి వింటర్ ఒలింపిక్స్‌లో టీనేజర్ రెడ్ గెరార్డ్ అమెరికాకు తొలి స్వర్ణ పతకాన్ని అందించాడు. 17 ఏళ్ల ఈ యువకుడు పురుషుల స్నోబోర్డింగ్ స్లోప్ స్టయిల్ విభాగంలో తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించి 87.16 పాయింట్లు సంపాదించి, టైటిల్ సాధించాడు. కెనడాకు చెందిన మాక్స్ పారట్ 80.10 పాయింట్లతో రజత పతకాన్ని అందుకోగా, అతని సహచరుడు మార్క్ మెక్‌మోరిస్ 78.01 పాయింట్లు సంపాదించి కాంస్య పతకాన్ని స్వీకరించాడు.

క్రాస్ కంట్రీ స్కీయింగ్ పురుషుల 30 కిలోమీటర్ల స్కీయథ్లాన్‌లో నార్వే క్లీన్ స్వీప్ చేసింది. సీమెన్ హెగ్‌స్టాడ్ క్రూగెర్ (ఒక గంట, 16.20.0 నిమిషాలు), మార్టిన్ జాన్‌స్రుడ్ సాండ్‌బై (ఒక గంట, 6.28.0 నిమిషాలు), హాన్స్ క్రిస్టర్ హొలాండ్ (ఒక గంట, 16.29.9 నిమిషాలు) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. నార్వే స్కీయర్లకు ఇతర దేశాల నుంచి గట్టిపోటీ ఎదురుకాలేదు.

పురుషుల స్పీడ్ స్కేటింగ్ 5,000 మీటర్ల ఈవెంట్‌లో స్వెన్ క్రెమర్ (నెదర్లాండ్స్) స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అతను 6 నిమిషాల, 09.760 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. కెనడా స్కేటర్ టెడ్ జాన్ బ్లూమెన్ 6 నిమిషాల, 11.160 సెకన్లతో రజత పతకాన్ని సాధించగా, 6 నిమిషాల, 11.618 సెకన్లతో నార్వేకు చెందిన స్వెర్ లూన్డే పెడెర్సెన్ కాంస్య పతకాన్ని అందుకున్నాడు.



యూఎస్‌విల్లే (అమెరికా)లో జరుగుతున్న ఫెడ్ కప్ టెన్నిస్ మొదటి రౌండ్‌లో నెదర్లాండ్స్‌ను ఢీకొంటున్న అమెరికా జట్టుకు శుభారంభాన్నిచ్చిన వీనస్ విలియమ్స్. ఆమె తన ప్రత్యర్థి అరంటా రస్‌ను 6-1, 6-4 తేడాతో ఓడించింది. కాగా, మరో మ్యాచ్‌లో కొకో వాండెవాగ్ 4-6, 7-6, 6-3 తేడాతో రిచెల్ హొగెన్‌కాంప్‌ను ఓడించి, అమెరికాకు 2-0 ఆధిక్యాన్ని అందించింది.

ఇండోనేషియా, జపాన్‌కు బాడ్మింటన్ టైటిళ్లు

అలోర్ సెటార్ (ఇండోనేషియా), ఫిబ్రవరి 11: ఆసియా బాడ్మింటన్ టీం చాంపియన్‌షిప్స్ పురుషుల విభాగంలో ఇండోనేషియా, మహిళల విభాగంలో జపాన్ టైటిళ్లను దక్కించుకున్నాయి. ఈ రెండు విభాగాల్లోనూ చైనానే రన్నరప్‌గా నిలిచింది. పురుషుల ఫైనల్‌లో ఇండోనేషియా 3-1 తేడాతో చైనాపై విజయం సాధించింది. మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో జొనథాన్ క్రిస్టీ 16-21, 21-17, 21-18 తేడాతో షి యుకీని ఓడించి, ఇండోనేషియాకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. డబుల్స్ విభాగంలో మహమ్మద్ అసన్, అన్గో ప్రతమా జోడీ 21-19, 21-18 స్కోరుతో హి జిన్‌ఫింగ్, తాన్ క్వియాంగ్ జోడీపై గెలిచి, ఈ ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. అయితే, చైనా ఆటగాడు క్వియావో బిన్ ఎదురుదాడికి దిగి, రెండో సింగిల్స్‌ను ఆంథోనీ సినిసుకా ఫిన్నింగ్‌పై 21-12, 11-21, 21-14 తేడాతో విజయంతో తన ఖాతాలో వేసుకున్నాడు. కాగా, రెండో డబుల్స్ మ్యాచ్‌లో రియాన్ అరెంగ్ సపుత్రో, హంద్రా సెతివాన్ జోడీ 21-14, 21-19 స్కోరుతో హాన్ చెంగ్ కాయ్, జవో హవోడాంగ్ జోడీని ఓడించి, ఇండోనేషియాకు తిరుగులేని రీతిలో 3-1 ఆధికాన్ని అందించారు. దీనితో జావో జన్‌పెంగ్, ఫిర్మాన్ అబ్దుల్ ఖొలిక్ మధ్య జరగాల్సిన సింగిల్స్ మ్యాచ్ రద్దయింది. కాగా, మహిళల ఫైనల్‌లో జపాన్ 3-0 తేడాతో చైనాను చిత్తుచేసింది. మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో చెన్ యూఫెయ్‌పై అకానే యమాగూచీ 21-16, 12-21, 21-14 తేడాతో విజయం సాధించి జపాన్ ఖాతాను తెరిచింది. ఆతర్వాత మొదటి డబుల్స్ మ్యాచ్‌లో మిసాకీ మత్సుతొమో, అయాకా తకహషి జోడీ 21-13, 21-16 తేడాతో డూ యూ, లి ఇన్ హుయ్ జోడీపై గెలిచి, జపాన్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించింది. రెండో సింగిల్స్ మ్యాచ్‌లో నజోమీ ఒకుహరా 19-21, 21-16, 21-10 స్కోరుతో హి బింగియావోపై విజయం సాధించింది. దీనితో 3-0 తేడాతో జపాన్ తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించింది. ఫలితంగా చివరి రెండు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

ఐజల్ క్లబ్‌కు జరిమానా

కోల్‌కతా, ఫిబ్రవరి 11: క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐ-లీగ్ చాంపియన్ ఐజల్ క్లబ్‌పై అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య మూడు లక్షల జరిమానా విధించింది. మోహన్ బగాన్‌తో గత నెల 25న జరిగిన మ్యాచ్‌లో ఐజల్ ఆటగాళ్లు నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలు రావడంతో, ఐదుగురు సభ్యులతో కూడిన క్రమశిక్షణా కమిటీ కేసును విచారించింది. ఐజల్ పొరపాటు చేసిందని స్పష్టం చేస్తూ, జరిమానా విధించింది.

జాతీయ మహిళల హాకీ ఛాంప్ ఆర్ఎస్‌పీబీ

రాంచీ, ఫిబ్రవరి 11: జాతీయ మహిళల హాకీం చాంపియన్‌షిప్ టైటిల్‌ను రైల్వే స్పోర్ట్స్ ప్రొమోషన్ బోర్డు (ఆర్ఎస్‌పీబీ) కైవసం చేసుకుంది. ఆదివారం ఇక్కడ జరగిన ఫైనల్‌లో ఆ జట్టు 4-0 తేడాతో మధ్య ప్రదేశ్‌ను సులభంగా నెగ్గింది. మ్యాచ్ ఆరంభం నుంచి చివరి వరకూ ప్రత్యర్థిని పూర్తి ఆత్మరక్షణలోకి నెట్టేసిన ఆర్ఎస్‌పీబీ ఎలాంటి సమస్య లేకుండా విజయం సాధించింది.

న్యూజిలాండ్‌లో భారత స్విమ్మర్ రికార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: పుణేకు చెందిన లాంగ్ డిస్టెన్స్ స్విమ్మర్ రోహన్ మోరే న్యూజిలాండ్‌లో కొత్త రికార్డు సృష్టించాడు. కుక్ జలసంధిని అతను ఎనిమిది గంటల, 37 నిమిషాల్లో ఈది, ఈ ఘనత సాధించిన తొలి ఆసియా స్విమ్మర్‌గా, అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు.

కృష్ణా, గోదావరి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాల్సిందే

కేంద్రాన్ని కోరిన రెండు బోర్డుల అధికారులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 11: ఈ నెల 15వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులతో నదీ జలాల పంపకాలపై కేంద్రాన్ని సమావేశాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో కృష్ణా, గోదావరి బోర్డులు ప్రాజెక్టులను తమ ఆధీనంలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరాయి. ఈ మేరకు రెండు బోర్డుల అధికారులు కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు పంపాయి. మరో వైపు ఈ నెల 15వ తేదీన జరిగే సమావేశంలో కృష్ణా జలాల కేటాయింపులో అన్యాయం జరిగినందున తమకు 500కుపైగా టిఎంసి నీటిని కేటాయించాలనే వాదనలకు తెలంగాణ పదును పెట్టింది. ఈమేరకు సమగ్రమైన నివేదికను ప్రభుత్వం సిద్ధం చేసింది. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ కృష్ణా, గోదావరి బోర్డులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాల మధ్య తగాదాలు తగ్గాలన్నా, ఉద్రిక్తతలను నివారించాలన్నా, జల విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులను తమ నియంత్రణలోకి తీసుకురావాలని బోర్డుల అధికారులు కోరారు. కాని ఈ ప్రతిపాదనను మొదటి నుంచి తెలంగాణ వ్యతిరేకిస్తున్న విషయం విదితమే. 2016లో రెండు రాష్ట్రాల మధ్య నాగార్జున సాగర్ డ్యాంపై నీటి కేటాయింపులు, విడుదల కోసం పోలీసుల మధ్య ఘర్షణ ఉదంతాన్ని బోర్డు అధికారులు ప్రస్తావించించినట్లు సమాచారం. తాము ఇచ్చిన అదేశాలు అమలు కావాలంటే బోర్డుకు అధికారాలు ఉండాలని వారు కేంద్రానికి నివేదించారు. త్వరలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ విషయమై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని జలవనరుల మంత్రిత్వ శాఖ బోర్డు అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ నెల 15వ తేదీన జరిగే సమావేశంలో తమ వాదనలను గట్టిగా వినిపించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు పూర్తి గణాంక వివరాలతో నివేదికను తయారు చేశారు. రెండు రాష్ట్రాల్లో కృష్ణా పరివాహక ప్రాంతం లెక్కలు తీశారు. తెలంగాణలో కృష్ణా పరివాహక ప్రాంతం 68.5 శాతం, ఆయకట్టు 62.5 శాతం ఉంటే, 35శాతం జలాలను కేటాయించారు. ఆంధ్రాలో 31.5 శాతం పరివాహక ప్రాంతం, 37.5 శాతం ఆయకట్టు ఉంటే, 60 శాతం జలాలను కేటాయించారు. బచావత్ ప్రకారం 811 టిఎంసిలో 512 టిఎంసి ఆంధ్రాకు, తెలంగాణకు 299 కేటాయించారు. ఇప్పటికే ఈఫార్ములాను తెలంగాణ ప్రభుత్వం ట్రిబ్యునల్ వద్ద సవాలు చేసింది. త్వరలో ట్రిబ్యునల్ ఈ విషయమై తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. పోలవరం ప్రాజెక్టుకు అనుమతులు లభించిన మరుక్షణం నాగార్జునసాగర్‌కు ఎగువున ఉన్న తమకు 45 టిఎంసి, పట్టిసీమను మరో ప్రాజెక్టుగా పరిగణించి అదనంగా 45 టిఎంసిని కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పలు సార్లు సూచించింది. ఈ విషయాన్ని కరాఖండిగా స్పష్టం చేయాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది.

మరో ఏడాదిలో దేశమంతా నిరంతర విద్యుత్

★ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కే సింగ్

ఆంధ్రభూమి బ్యూరో

మచిలీపట్నం, ఫిబ్రవరి 11: మరో ఏడాదిలో దేశంలోని ప్రతి ఇంటికీ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్ కుమార్ సింగ్ స్పష్టం చేశారు. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణ తయారు చేసినట్లు తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం పర్యటనకు ఆదివారం వచ్చిన ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ 2019 మార్చి నాటికి ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. 2019 ఏప్రిల్ నాటికి 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు దేశంలో 18వేల 450 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదన్నారు. గడిచిన మూడున్నర యేళ్లల్లో ఎన్డీఏ ప్రభుత్వం 16వేల 800 గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించినట్లు వివరించారు. రానున్న రోజుల్లో మిగిలిన గ్రామాలకు కూడా విద్యుత్ సౌకర్యం కల్పించి నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీన దయాళ్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి వరకు విద్యుత్ ప్రాజెక్టులకు గాను రూ.900కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. విజయవాడ కేంద్రంగా 765కెవి ట్రాన్స్‌మిషన్ లైన్ సౌకర్యాన్ని అతి త్వరలోనే కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల స్థానంలో ప్రీపెయిడ్ బిల్లులను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని అమలు చేస్తే నెల వారీగా వినియోగదారుడు నెల వారీ బిల్లులు చెల్లించనవసరం లేదన్నారు. సెల్‌ఫోన్ రీఛార్జ్ కార్డుల మాదిరి ప్రీపెయిడ్ ఎమౌంట్‌కు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని లడక్ పట్టణంలో 10వేల మెగా వాట్ల సోలార్ పార్కు ఏర్పాటుకు అంతర్జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. దేశంలోనే ఈ ప్రాజెక్టు అత్యంత సామర్థ్యం కలిగినదన్నారు. పవన విద్యుత్ పథకం కింద తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు 2వేల మెగా వాట్ల విద్యుత్ ప్రాజెక్టును మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో 20వేల మెగా వాట్ల సోలార్ పవన విద్యుత్ అవసరం ఉందని, ప్రస్తుతం 13వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుల పనులు త్వరితగతిన జరుగుతున్నట్లు మంత్రి రాజ్ కుమార్ సింగ్ వెల్లడించారు. ఈ సమావేశంలో లోక్‌సభ సభ్యుడు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ సభ్యురాలు రేణుకాచౌదరిని రామాయణం సీరియల్‌లోని శూర్పణఖ పాత్రతో పోలుస్తూ రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఆయుధంగా మలచుకుంది. మహాభారత యుద్ధంలో కౌరవుల నాశనానికి హేతువుగా నిలిచిన నిండుసభలో ద్రౌపదీ వస్త్రాపహరణంలో దుర్యోధనుడు, దుశ్శాసనుడి దురాగతాన్ని ప్రతిబింబించే వాల్‌పోస్టర్‌ను రూపొందించి విడుదల చేయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించడానికి సమాయత్తమయింది. మయసభలో దుర్యోధనుని అవస్థలు చూసి పక్కున నవ్విన ద్రౌపది నవ్వు చివరకు కౌరవుల నాశనానికి నాంది పలికినట్టుగా రేణుకాచౌదరి నవ్వు, తదనంతర పరిణామాలను మహాభారతంలోని దృశ్యాలతో పోలుస్తూ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన వాల్ పోస్టర్ ఇది.

అభివృద్ధి, ఆరోగ్యం ప్రధాన లక్ష్యం

5కె రన్‌లో మంత్రి తుమ్మల

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, ఫిబ్రవరి 11: అభివృద్ధి, ఆరోగ్యం ప్రధాన లక్ష్యాలుగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో అనేక చోట్ల ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పర్యాటక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో మొదటి సారిగా నిర్వహించిన 5కె రన్‌ను ఆయన ఆదివారం ఉదయం స్థానిక సర్దర్ పటేల్ స్టేడియంలో ప్రారంభించారు. అనంతరం లకారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన సభలో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, వీటన్నింటికి ఖమ్మం మార్గదర్శకంగా మారుతుందన్నారు. హైదరాబాద్ తరువాత ఖమ్మం నగరంలోనే అధిక శాతం అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. రాష్ట్రంలోని అన్ని చెరువులను మిషన్‌కాకతీయ ద్వారా అభివృద్ధి చేస్తున్నామని, అక్కడే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసేందుకు ఖమ్మం తరహాలో ట్యాంక్‌బండ్లు నిర్మిస్తామన్నారు. కొద్ది కాలంలోనే నిర్మించిన ఈ లకారం ట్యాంక్ బండ్ రాష్ట్రంలోనే పర్యాటక కేంద్రంగా మారనున్నదన్నారు. 5కె రన్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించటంలో కీలక పాత్రధారి అయిన ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ దాదాపు 15వేల మంది రన్నర్లతో కలసి 5కె రన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలిసారి ఖమ్మంలో దీనిని నిర్వహించినప్పటికి ప్రజలు సహకరించారన్నారు.

వారి సహకారంతోనే ఖమ్మం నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మా అసోసియేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, శివాజిరాజా, శ్రీనివాసరెడ్డి, హేమ, తారక్, సురేష్, అనితాచౌదరి, ఉత్తేజ్, రవిబాబు, గౌతమ్‌రాజు, సింహ, శివ, తానా ప్రతినిధులు జయశేఖర్, రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



5కె రన్‌లో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

నవ్వుపై జీఎస్‌టీ లేదు

★ నవ్వడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు
★ మోదీ వ్యాఖ్యలు మహిళల పట్ల ఆయన ఆలోచనా విధానానికి నిదర్శనం
★ ప్రధానిపై రేణుకా చౌదరి ఎదురుదాడి

పనాజి, ఫిబ్రవరి 11: రాజ్యసభలో నవ్విన తనను రామాయణం సీరియల్‌లో శూర్పణఖతో పోల్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకురాలు రేణుకాచౌదరి ఎదురుదాడికి దిగారు. నవ్వుపై ఎలాంటి వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) లేదని, తాను నవ్వడానికి ఎవరి నుంచి అనుమతి తీసుకోవలసిన అవసరం అంతకన్నా లేదని ఆమె అన్నారు. తనకు వ్యతిరేకంగా మోదీ చేసిన వ్యాఖ్యలు మహిళల పట్ల ఆయన ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యురాలు, మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి ఆదివారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ తన నవ్వుపై మోదీ వ్యాఖ్యలు చేసిన తరువాత దేశవ్యాప్తంగా గల మహిళల నుంచి తనకు పెద్ద ఎత్తున మద్దతు లభించిందని తెలిపారు. 'నేను అయిదుసార్లు ఎంపీగా గెలిచాను. ప్రధాన మంత్రి నన్ను ఒక ప్రతికూల పాత్రతో పోల్చారు. అయితే, ఈ రోజు మహిళలు మారిపోయారనే విషయాన్ని ఆయన మరచిపోయారు. తమ కోసం తాము ఎలా మాట్లాడాలో ఈ రోజు మహిళలకు తెలుసు. మహిళల పట్ల మోదీ ఆలోచనావిధానాన్ని ఆయన వ్యాఖ్యలు ప్రతిబింబించాయి' అని రేణుకాచౌదరి అన్నారు. 'నేను నా నవ్వుతో అధికారాన్ని సవాలు చేశాను. పార్లమెంటు చట్టాలు చేస్తుంది. అయితే, తమకు సమానులయిన మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలి, మహిళలు తమ స్వంత హక్కులతో ఇక్కడ ఉన్నారనే విషయాన్ని చట్టసభల సభ్యులకు బోధించవలసిన అవసరం మనకు ఏర్పడింది. పార్లమెంటు మన సమాజానికి ప్రతిరూపం' అని రేణుకాచౌదరి పేర్కొన్నారు. పనాజిలో లింగ వివక్షపై జరిగిన ఒక సదస్సులో పాల్గొన్న ఆమె విడిగా విలేఖరులతో మాట్లాడుతూ తన ప్రజాజీవితం అంతా ప్రజల మద్దతుతోనే సాగుతూ వచ్చిందని తెలిపారు. 'నీవు సరిగా ఉంటే, అంతటా అది ప్రతిధ్వనిస్తుంది. ఇప్పుడు జరుగుతున్నదదే. ఎప్పుడు, ఎలా ఉండాలనేదానికి నియమాలు ఏమీ లేవు. నీవు నవ్వు. నవ్వుపై జీఎస్‌టీ లేదు. అయిదుసార్లు ఎంపీగా గెలిచిన నాకు నవ్వడానికి ఎవరి అనుమతి అవసరం లేదు.

శ్రీకాళహస్తీశ్వరుడికి బంగారు వాహనాల విరాళం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: సుమారు రూ.2 కోట్లతో నూతనంగా తయారుచేయించిన బంగారు వాహనాలను, ఆభరణాలను నెల్లూరుకు చెందిన ఒక దాత ఆదివారం చిత్తూరు జిల్లా శ్రీకాహహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అప్పగించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆలయంలోని పురాతన కాలంనాటి వెండి వాహనాల స్థానంలో బంగారు రేకులతో తాపడం చేసిన వాహనాలను తమిళనాడులోని కుంభకోణంలో తయారుచేయించారు. 10 వాహనాలను నూతనంగా తయారుచేయించి శ్రీకాళహస్తికి తీసుకొచ్చారు. వాహనాలకు శాస్త్రోక్తంగా పూజలు చేయించి ఆలయానికి అప్పగించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు విలువైన ఆభరణాలను కూడా అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు, సిబ్బంది దాత కుటుంబానికి ఘనంగా స్వాగతం పలికి వారి నుండి ఆభరణాలను అందుకున్నారు. మొదటగా ఆదివారం ఉదయం హంస-యాళి వాహనాలను ఊరేగింపు కోసం వినియోగించారు. ఈసందర్భంగా ఈఓ భ్రమరాంబ దాత కుటుంబాన్ని సన్మానించారు.



బంగారు ఆభరణాలతో దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

శ్రీశైలంలో వైభవంగా పుష్పపల్లకీ సేవ



శ్రీశైలం, ఫిబ్రవరి 11 : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజైన ఆదివారం శ్రీశైలంలో శ్రీభ్రమరాంబిక, మల్లికార్జున స్వామివార్లకు మహా పుష్పపల్లకీ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చనలు, హారతి పూజలు జరిపారు. అనంతరం క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మల్లన్నకు గజవాహన సేవ నిర్వహించనున్నారు. ఇక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వేర్వేరుగా శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



బార్ అసోసియేషన్ ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎన్వీ రమణ

విభజన తరువాత ఇబ్బందుల్లో ఏపీ

జస్టిస్ ఎన్వీ రమణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, ఫిబ్రవరి 11: రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్ అనేక ఇబ్బందులు పడుతోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. రాష్ట్రానికి అండగా నిలబడాల్సిన బాధ్యత సంబంధిత వ్యక్తులు, సంస్థలపై ఉందని వ్యాఖ్యానించారు. బెజవాడ బార్ అసోసియేషన్ 111 ఏళ్ల ఉత్సవాల్లో ఆదివారం పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో హైకోర్టు త్వరగా ఏర్పాటైతే ఇక్కడి న్యాయవాదులకు ఉపయోగకరంగా ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. మాతృభాషలో న్యాయపాలన జరగాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే కక్షిదారులకు కోర్టులో జరిగే వాదప్రతివాదాలు అర్థమవుతాయని అభిప్రాయపడ్డారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఒకప్పుడు సభ్యునిగా ఉన్నందుకు గర్విస్తున్నానన్నారు. డబ్బు లేని కారణంగా ఎవరికీ అన్యాయం జరగరాదని, ఆ దిశగా బార్ అసోసియేషన్లు కీలకపాత్ర పోషించాలని సూచించారు. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కోర్టు బెంచిని విజయవాడలో ఏర్పాటు చేయాలని సూచించినట్లు రమణ తెలిపారు. కోర్టుల్లో న్యాయం ఆలస్యమైతే అది వ్యవస్థలోని లోపంగా గుర్తించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి రంజన్ గొగోయ్ అభిప్రాయపడ్డారు. తన సహచర న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణతో కలిసి బెజవాడ బార్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో రంజన్ గొగోయ్, న్యాయవాదుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు.

మర్యాదల గురించి మీరా మాట్లాడేది?

★ రాష్ట్ర విభజనలో మీ పాత్ర లేదా..
★ ప్రధాని నరేంద్ర మోదీని నిలదీసిన కేవీపీ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: పార్లమెంట్ సాక్షిగా ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రను వక్రీకరించారని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు ఆరోపించారు. ఆదివారం కేవీపీ విలేఖరులతో మాట్లాడుతూ లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ గాంధీ కుటుంబం ఏపీ కాంగ్రెస్ నాయకులను అవమానాలకు గురిచేశారని చేసిన విమర్శలన్నీ బూటకమని పేర్కొన్నారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి టీ.అంజయ్య దళిత వర్గానికి చెందినవారని ప్రధాని పేర్కొన్నారని, కానీ అది నిజం కాదని చెప్పారు. టీ.అంజయ్య అనే అతి సామాన్యుడ్ని ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా నీలం సంజీవరెడ్డిని కాదని మరో ఆంధ్రుడైన వీవీ గిరిని రాష్ట్రపతిగా ఇందిరాగాంధీ చేశారని ఆయన తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి అన్యాయం చేశారంటూ ప్రధాని గద్గదస్వరంతో బాధపడ్డారని.. అయితే పీవీకి కుల బలం ఉందా? ధన బలం ఉందా? పీవీకి రాష్ట్రంలో, కేంద్రంలో అనేక ఉన్నత పదవులు లభించింది కాంగ్రెస్ పార్టీ ఆదరణవల్ల కాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఆంధ్రప్రదేశ్‌కి నరసింహారావు ఎంతోమేలు చేశారని చెప్పారు. సొంత పార్టీ నాయకులను అవమానించిన చరిత్ర నరేంద్ర మోదీదేనని ఆయన ఆరోపించారు. బీజేపీ సీనియర్ నాయకులు అద్వానీ, మురళీ మనోహర్ జోషిలను మోదీ బొటనవేలితో తొక్కిపెటారని అన్నారు. అద్వానీ మీద సీబీఐ కేసు పెట్టి ఈ వయసులో కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. పార్టీ బ్యానర్లలో, హోర్డింగులలో ఉన్న వాజపేయి, అద్వానీల ఫోటోలను తొలగించిన మీరు గౌరవ మర్యాదల గురించి మాట్లాడతారా ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రాన్ని విడగొట్టేటప్పుడు బీజేపీ పనికిరాని డాక్యుమెంట్లు ఇచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీకి అప్పుడు 202 సీట్లు మాత్రమే ఉన్నాయని, బీజేపీ అప్పుడు అడ్డుపడి ఉంటే విభజన బిల్లు పాసయ్యేది కాదని చెప్పారు. లోక్‌సభ, రాజ్యసభలో తన మిత్రపక్షాలతో కలిసి బిల్లును అడ్డుకోమని వేడుకున్నా పట్టించుకోలేదని, ఆ రోజు కాంగ్రెస్ పాత్ర చాలా చిన్నదని, బీజేపీ పాత్ర చాలా పెద్దదని వ్యాఖ్యానించారు. విభజన సమయంలో వారు సవరణలన్నీ ఉపసంహరించుకుని బిల్లుకు మద్దతు పలికారని చెప్పారు. అలాగే పార్లమెంట్ సాక్షిగా, కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను తుంగలో తొక్కే అధికారం నీతి ఆయోగ్‌కు ఉందా? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేశామంటూ బీజేపీ నాయకులు 27 పేజీల వివరణ ఎందుకిచ్చారో వారికే తెలియదని అన్నారు. ఈ వివరణలన్నీ పేజీలు నింపటానికే ఇచ్చినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. బీజేపీ అసత్యాలు చెప్తోందని టీడీపీ పుస్తకం కూడా విడుదల చేసి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని ఆరోపించారు. మూడున్నరేళ్లలో 85 శాతం విభజన హామీలను పూర్తి చేశామంటూ ప్రసంగాలు ఇస్తుంటే ఏపీ ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. రాష్ట్ర విభజన అన్యాయంగా చేశారంటూ కాంగ్రెస్‌ను విమర్శించే బీజేపీ, టీడీపీ నాయకులు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దకుండా నాలుగేళ్లు ఏం చేశారని నిలదీశారు. రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ పార్టీ కారణమని బీజేపీ వారు చెబుతున్నారని, విభజనకు బీజేపీ కారణం కాదా? అని కేవీపీ ప్రశ్నించారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy,** Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90



కా దేది కవితకు అనర్హమన్నట్లు ఈ రోజుల్లో ప్రతి వస్తువు గృహ అలంకరణకు ఏదో ఒక విధంగా ఉపయోగపడుతోంది. ఒకప్పుడు ఆఫీసుల్లోనూ, ఇళ్ళల్లోనూ అందంగా పరదాలు కనిపించేవి. ఇపుడు వాటి స్థానంలో ఈ వెనీషియన్ బ్లైండ్స్ వస్తున్నాయి. పరదాలు కూడా వాడుతున్నప్పటికీ వెలుతురు కూడా కొంచెం వస్తుండాలి అనే ఉద్దేశ్యంతో ఈ వెనీషియన్ బ్లైండ్స్‌ని వాడుతున్నారు. వీటిలో కూడా అనేక రకాలున్నాయి. వివిధ రంగులలో కూడా ఉన్నాయి. ఇవి ఎక్కువగా కార్యాలయాలలోనూ, ఆసుపత్రులలోనూ, రెస్టారెంట్లలోనూ ఉపయోగిస్తున్నారు. ఇవి హారిజాంటల్‌గా ఉంటున్నందున గోడ రంగులకు మ్యాచ్ అయ్యేట్లుగా తీసుకుంటే ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అల్యూమినియంతో తయారుచేస్తారు. చక్కగా ఉతుక్కోవచ్చు. అలాగే మరొక రకం ఉన్నాయి. అవి వర్టికల్ బ్లైండ్స్. వీటిని పూర్తిగా ఫ్యాబ్రిక్‌తో తయారుచేస్తారు. అనేక డిజైన్లు, అనేక రంగులలో లభిస్తున్నాయి.

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టితోటి భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

సోమవారం 12, ఫిబ్రవరి 2018

అవనికి వెలుగు అతివ



ఈడొచ్చిన ఆడపిల్లను ఓ అయ్య చేతిలో పెట్టి నాన్నలు పసిపిల్లల్లా ఏడుస్తారు! మగవాని బతుకులో సగపాలు తనదిగా.. జీవితం.. అంకితం చేసినా కూడా ఆమె త్యాగాన్ని ఎవరు గుర్తించడంలేదు. కొడుకు పుడితే కోలాహలం చేసి, కూతురు పుడితే కుంగుబాటుకు లోనయ్యే సంస్కృతి ఇప్పటికీ ఉండటం బాధాకరం. ప్రపంచ వ్యాప్తంగా సుమారు కోటి 20 లక్షలమందిలో పది లక్షల మంది తొలి పుట్టిన రోజు వరకు కూడా బతకడం లేదనేది ఓ సర్వే చెప్తున్నది. పుట్టబోయే బిడ్డ ఆడబిడ్డే అని తెలుసుకుని కడుపులోనే చంపేసేవాళ్ళు అనేకమంది కన్పిస్తుంటారు. సాంకేతిక విజ్ఞానం ఎంత అభివృద్ధి సాధించినా ఆడపిల్లల్ని బతికించడంలో మానవ ప్రయత్నం నానాటికీ ఎందుకు తగ్గుతున్నదీ ఆలోచించాల్సిన అవసరం ఉంది.

అమ్మ స్వరూపం అయిన స్త్రీమూర్తికి ఈ అవనిపై పుట్టినప్పటినుండి ఎన్నో కష్టాలు.. తానూ ఓ స్త్రీయే అని ఆలోచించక తమ పిల్లలను ఎన్నో కష్టాల పాలు చేస్తున్నారు. కొందరు పుట్టిన శిశువు ఆడపిల్ల అని తెలిసాక ఎక్కడో వదిలి వేస్తున్నారు. చదువు విషయంలో కొడుకుకు ఇస్తున్న ప్రాధాన్యత కూతుళ్ళకు ఇవ్వడంలేదు. కొడుకులే వారసులు అనే సంప్రదాయం ఉన్న మన దేశంలో కూడా తల్లిదండ్రులను పోషిస్తున్న కూతుళ్ళ సంఖ్య ఈమధ్య కాలంలో బాగా పెరుగుతోంది.

ఆడపిల్ల పుట్టిందా? సమాజంలో అవమానంగా భావించే ఈ రోజుల్లో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఆడపిల్ల పుట్టిందని తెలియడంతో బాలికోత్సవం జరుపుకునే ప్రాంతాలు కొన్ని ఉన్నాయి. రాజస్థాన్‌లోని రాజ్యమండ్ జిల్లాలో పిప్లాంత్రి అనే గ్రామంలో ఆడపిల్ల పుట్టిందంటే గ్రామంలో ప్రజలంతా సంతోషంగా అడవికి వెళ్లి అమ్మాయి పేరుమీద 111మొక్కలు నాటుతారట.

కేవలం నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకుంటారు. అంతేకాదు, పుట్టిన ప్రతి అమ్మాయికీ ఆర్థిక భద్రతను కలిగించేందుకు తమ వాటాకా రూ.21000 ఇస్తారు. అమ్మాయి తండ్రి వాటాగా 10వేలు మొత్తం ఇస్తారు. ఈ నగదునంతా కలిపి అమ్మాయి పేరుమీద 20 సంవత్సరాలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు. ఆ అమ్మాయికి యుక్త వయస్సు వచ్చేవరకు పెండ్లిచేయమనీ, ఎంతవరకు చదువితే అంతవరకు చదివిస్తామని తల్లిదండ్రులతో ప్రమాణం చేయిస్తారు. ఇలా ఇంతవరకు దాదాపు గ్రామస్థులు 2 లక్షల 50 వేల మొక్కలు నాటారట. అదేవిధంగా మహారాష్ట్రలోని ఒక వ్యక్తి ఎవరికైనా ఆడపిల్ల పుడితే ఆ ఇంట్లో ఉండే మగవారికి ఆరునెలలపాటు ఉచితంగా కటింగ్- షేవింగ్ చేస్తానని ప్రకటించాడట. లింగవివక్షను అరికట్టేందుకు ఈ చర్యలు హర్షణీయమే. ఒక కుమార్తె పది కుమారులతో సమానమని ఉద్బోధించారు మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఒక కార్యక్రమంలో.

కంటే కూతుర్నే కనాలి

జాతీయ కుటుంబ సర్వే ప్రకారం దేశంలోని 79 శాతం మహిళలు (15-49 ఏళ్లవారు) 78 శాతం పురుషులు (15-54వయసువారు) కనీసం ఒక్క ఆడపిల్ల అయినా కావాలని అనుకుంటున్నారు. ఇది విద్యావంతుల్లో వచ్చినమార్పు కాదు. ఎస్సీ, ఎస్టీలు, ముస్లింలు, గ్రామీణులు ఇలా అనేక వర్గాలకు చెందినవారిలో కన్పించిన మార్పు అని సర్వే వెల్లడించింది. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ 2005-06లో నిర్వహించిన సర్వేలో 74 శాతం మహిళలు 65 శాతం పురుషులు తమకు ఆడపిల్ల కావాలని కోరగా, తాజాగా వారి సంఖ్య పెరగడం విశేషం.

> ఆడపిల్ల అంటే ఆనందవార్థి. ఆడపిల్లలున్న అభ్యుదయం అని పొంగిపోయాడు ఆచార్య కసిరెడ్డి. ఆడపిల్ల లేని ఇంటికి కళే ఉండదంటారు పెద్దలు. నిజమే! స్త్రీ లేకుంటే ఈ సృష్టికి సొగసే లేదు. అందుకే 'మగువేగా మగవాడికి మధుర భావన' అన్నారు దాశరథి!

నగరంలోని 75 శాతం మహిళలు ఆడపిల్ల కావాలని కోరుకుంటుంటే, గ్రామాల్లో 81 శాతం మహిళలు తమ ఇంట్లో ఒక మహిళ ఉంటే బాగుంటుందని ఆశిస్తున్నారు. కనీసం ఇంటర్‌వరకూ చదువుకున్న మహిళల్లో 72 శాతంమంది ఆడపిల్ల కావాలని కోరుకుంటే, నిరక్షరాస్యుల్లో 85 శాతంమంది ఆడశిశువుకోసం పరిపిస్తుండటం విశేషం. అలాగే పదేళ్ళ నాటి సర్వేతో పోల్చితే బాలికల్లో చదువుకుంటున్న వారి శాతం 55.1 శాతం నుంచి 68.4 శాతానికి పెరిగింది. సర్వేలో సుమారు 5,68,200 కుటుంబాలను సర్వేచేశారు. 8 లక్షల మంది మహిళలతో మాట్లాడారు. అందుకే ఆడపిల్లలున్న ప్రతి కుటుంబానికి ప్రోత్సాహకరం ఇవ్వడం ద్వారా పరిస్థితులలో మార్పులు సాధించవచ్చు. విద్యారంగంలో బాలికలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం వుంది. ఓ అధ్యయనం ప్రకారం ఎనిమిదవ తరగతి బాలికల డ్రాపౌట్స్ శాతం ఏపిలో 3.78 శాతం, తెలంగాణలో 5.31 శాతం ఉంది. 9వ తరగతి బాలికలు ఏపిలో 2.89 శాతం, తెలంగాణలో 4.70 శాతం చదువులు ఆపేస్తున్నారు. ఇంటర్‌లో బాలికలు ఏపిలో 11.79 శాం, తెలంగాణాలో 13.22 శాతం మధ్యలోనే చదువు మానేస్తున్నారు. ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల దేశ ప్రజలకు పిలుపునివ్వడం హర్షించదగిన విషయం. బాలికల సంరక్షణ, సమాన అవకాశాల కల్పన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అంటూ ఢిల్లీలో ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించారు. 2008 నుంచి ఏటా జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని దేశంలో నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఏటా కోటికిపైగా ఆడశిశువుల భ్రూణహత్యలు జరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మోది హయంలో 'భేటీ బచావ్, బేటి పడావ్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. బాలికల చదువుల కోసం కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ప్రత్యేక పాఠశాలలు, ఆవాస పాఠశాలలు తమ వంతు ప్రయత్నాలతో ప్రత్యేక ముద్రను చాటుకున్నాయి. అయినా కొన్నిచోట్ల ఆడపిల్లల్ని చదివించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. కుటుంబ ఆర్థిక అవసరాల కోసమో, ఇతర బాధ్యతలు నెరవేర్చడం కోసమో ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తున్నారు. ఒక వేళ బడికి పంపించినా మధ్యలోనే మాన్పించేస్తున్నారు.

ఈరోజుకీ అమ్మాయి పుట్టగానే ఆమెకి ఎలా పెళ్లిచేయాలి అని దిగులు పడే తల్లిదండ్రులు మన దేశంలో ఉన్నారు. ప్రపంచంలోనే బాల్య వివాహాలు జరుగుతున్న దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. ముఖ్యంగా 15-18 సంవత్సరాలమధ్య వయస్సులో ఎక్కువమంది బాలికలకు వివాహాలు జరుగుతున్నాయి. అమ్మాయిల విషయంలో తల్లిదండ్రుల దృక్పథంలో మార్పువస్తే తప్ప బాల్యవివాహాలు ఆగవు.

ముందుకు సాగాలి

సంప్రదాయల పేరిట ఆంక్షలు భారతీయ మహిళల వికాసాన్ని నిరోధిస్తున్నాయని తాజా అంతర్జాతీయ సర్వేలో తేలింది. పేదరికం, విద్య, ఆరోగ్యం, భద్రత అంశాల్లో బాలికలు, మహిళలు విచక్షణను ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 'ప్లాన్ ఇండియా' నిర్వహించిన విస్తృత అధ్యయనంలో తేటతెల్లమైంది. శాస్త్ర, సాంకేతిక విద్యా సంస్థల్లో నేటికీ యువతుల సంఖ్య తక్కువగా ఉండడంపై ఇటీవల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆందోళన వ్యక్తపరిచారు. తల్లిస్వరూపమైన బాలికలను కాపాడుకోవడం సమాజంలోని అందరి బాధ్యత. వారిపై వివక్షను విడనాడాలి. అన్ని రంగాల్లోనూ ముందడుగు వేసేలా ప్రోత్సాహం ఇవ్వాలి. మన దేశంలో ఆడపిల్లలు పుట్టిన వెంటనే ప్రోత్సాహమందించే గ్రామీణ ప్రాంతాలను ఆదర్శంగా తీసుకోవాలి. అందులో 'ఆడపిల్లను రక్షించుకుందాం' అనే పేరుతో రాజస్థాన్‌లోని సికార్ జిల్లా మెట్లపాస్‌లో పురుడుపోసుకున్నది. అక్కడ ఆడపిల్ల పుడితే ఏకంగా పండగ చేసుకునేంత పరిణతి పొంది ఉన్నారు. వాళ్ళు అబ్బాయిలతో సమానంగా ఆడపిల్లను చదివిస్తారు. ఆడపిల్లల ఆవశ్యత గురించి అవగాహన కల్పించి ఆడపిల్లల్ని కన్నవారికి అభినందనలు తెలియచేయడం ఈ ఉద్యమ ముఖ్య ఉద్దేశ్యం. ఈ ఉద్యమకర్త మంజుదేవి. ఆడపిల్లలను 'ఆడ పిల్ల' అనే చులకనభావనతో చూడటం వల్ల తను, అమ్మాయినీ ఏమీ చేయలేననే భావన వారిలో ఏర్పడుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో తేలింది. అందుకే మార్పు అనేది ఇంటినుండే రావాలి. అందుకే ఆడపిల్ల చదువు- అవనికి వెలుగు అని చాటుదాం.

-కె.రామ్మోహన్‌రావు

బడినుంచే ప్రక్షాళన



మనిషి కావల్సింది కేవలం ఆనందం ఒక్కటే. పూరిగుడిసెలో ఉన్నా, ఏడంస్తుల మేడలో ఉన్నా ఆనందం లేకపోతే మనిషి మనిషిగా ఉండలేడు. ఆనందానికి ఆడమగ తేడాలేదు. ఆనందాన్ని మించిది ఏదీలేదు. ఆనందం లేకపోతే ఆ మనిషికి విశ్వామిత్రుడు కోరినట్లు ఏనుగుఅంబారిపై నిలబడి రూకను పైకి విసిరితే ఎంత ఎత్తు కుపోతుందో అంత డబ్బును ఇచ్చినా వారికి లేశమాత్రం ఆనందం పొందడు. రహదారి పక్కన ఉన్నా వారికి తినడానికి లేకపోయినా వారి మనసు ఆనందంగా ఉంటే చాలు వారి ముఖం చూడబుద్దేస్తుంది. ఈ ఆనందం రావాలంటే అది ఎక్కడో లేదు. అందరి మనస్సులో అట్టడుగు పొరలో కూర్చుని ఉంటుంది. దాన్ని పైకి తీసుకొని రావాలి. దీనికి సాధనం ఎవరి దగ్గర ఉందో తెలుసా మీకు ఆడవారిదగ్గరే నండీ బాబూ!

అవును నిజమే చెబుతున్నాం. ఇంతకుముందుకాలంలో అయితే ఇంటిలో ఉండి అందరి అవసరాలుతీర్చి వారికి ఆనందాన్నిఇచ్చేవారిమి కదా.

ఇపుడు లోకం పోకడ కనిపెట్టేశాం. ఆఫీసులో బాసు కోరినట్టు పని చేస్తాం. ఇటు ఇంటాయన కోరినట్టు చేసేస్తాం. మరోవైపు పిల్లల కోరికలు క్షణాల్లో తీర్చేస్తాం. కదూ మరి మనం దగ్గర ఆనందం కోకొల్లలుగా ఉంది. అందుకే దాన్ని లాక్కోవడానికి మనమీద దాడులు చేస్తున్నారు.

వారికి ఏం చేస్తే ఆనందం వస్తుందో తెలియజెప్పాల్సిన బాధ్యత మనదే అనుకొనేసి ఇక ముందుకు ఆలోచించి ఆ వెధవాయిలకు ఇలా అన్నానని చిన్నబుచ్చుకోకండి ఎందుకంటే మనలను ఏడిపించుదాం అని యాసిడ్ దాడులు అఘాయిత్యాలు, అమానుష చర్యలు చేసేవారు వెధవాయిలు కాక మరేమవుతారు చెప్పండి. వారికి బుద్ధిరావాలంటే మనమే పూనుకోవాలి. బడులు, కళాశాలల్లో మార్కులను ఉత్పత్తి చేసే వస్తువులను తయారు చేస్తున్నట్టు ఉంది. ముందుగా వాటిని ప్రక్షాళన చేయాలి. అక్కడ నుంచి మొదలు పెట్టాలి. జీజియాబాయి తనకుమారుడిని ప్రపంచ విజేత గా చేయడానికి పురాణాలను ఆసరా తీసుకొందట. మనమూ ఈ కాలానికి తగ్గ వనరులను ఆలోచించి వారిలో బుద్ధి వికసించేట్టు చేయండి. దీనికి కాస్త ఉపాధ్యాయులు ఆసరా గా నిలవాలి. కళాశాలల యాజమాన్యం చేయూత నివ్వాలి. వారిలో నీతి నిజాయితీలు పెంచేవిధమైన చర్యలు తీసుకోవాలి. ఆ మనస్సానందానికి డబ్బు అవసరం లేదు. మన చుట్టూ ఉండే మనుషుల మధ్య ఉండే ప్రేమానురాగాలు, మమతానుబంధాలు హేతువులు. ఇవి కావాలంటే కొనుక్కోవడానికి దొరకవు. కానీ మన చేతుల్లోనే చేతల్లోనే పుష్కలంగా లభ్యం అవుతాయి. పిల్లలు పసి మొగ్గలు. వాటిని వికసించే ముందే మంచి మందులు వేసి వాటిల్లో ఏవైనా దుర్గణాలైతే వాటిని ప్రేమతో వారి నుంచి దూరంచేస్తే మంచి పువ్వులు వికసించినట్టే పిల్లలూ మంచి పౌరులుగా ఎదుగుతారు. భారత దేశ ఔన్నత్యాన్ని పెంచుతారు.

మనసుంటే మార్గం



సృష్టిలో ఏది వ్యర్థ కాదు. ఆయుర్వేదం ప్రతి మొక్కా ఔషధమే నంటుంది. అందులో పెరటి తోట పెరిగే కరివేపాకు, పుదీనా, కొత్తిమీర ఇలాంటివేవైనా సరే అటు ఆరోగ్యాన్నిస్తాయి. ఇటు వంటను రుచులతో నింపేస్తాయి. కనుక ఇంతులంతా పెరటి తోటకు ప్రీతిని చూపిస్తారు.

ఇపుడు అన్నీ అపార్ట్‌మెంటులు కదా అనుకోకండి. చిన్న చిన్నకుండీల్లో ఇలాంటివి పెంచుకోవచ్చు. విరిగిన ఫ్లాస్టిక్ బుట్టలు, బక్కెట్లు, ట్రేలు ఇలాంటివి కూడా కుండీల్లుగా ఉపయోగపడుతాయి. మనుసుంటే మార్గం ఉంటుంది కదా. అందుకే

అలా పెంచుకున్న కుండిల్లోని కరివేపాకులను పుదీనా అప్పటికప్పుడు రోటి పచ్చళ్లు కాని పొడి చేసుకోవచ్చు. సలాడ్ చేసినప్పుడు అందంగా అలంకరించడానికి ఈ మొక్కలు ఉపయోగపడుతాయి.

మనం మార్కెటు నుంచి తెచ్చుకున్న కూరగాయలతో కూరలు చేస్తాం సరేసరికాని కొన్ని కొన్ని కూరగాయల తొక్కతో ఆరోగ్యాన్ని అందాన్ని పెంచుకోవచ్చు. అంటే బీరకాయ పొట్టు, నిమ్మ తొక్కల్లాంటివి కడిగి శుభ్రంగా ఎండబెట్టి పొడి చేసుకుని వాటిని ముఖానికి మాస్క్‌గా ఉపయోగిస్తే మొటిమలు రావు. స్నానానికి సబ్బుకు బదులు ఈ పొడిని ఉపయోగిస్తే దురదల్లాంటి రావు. కొన్ని కూరగాయలు అంటే బీరకాయను మొత్తం ఎండబెట్టితే అది మంచి బ్రష్‌గా ఉపయోగపడుతుంది. బీరకాయ పైతొక్కతో పచ్చడి చేసుకోవచ్చు.


చక్కెరకు బదులుగా బెల్లం, ఖర్జూరం ఉపయోగిస్తే చక్కెర వ్యాధుల బారిన పడకుండా చూసుకోవచ్చు. బెల్లం వాడకం వల్ల నడుము, తొడల్లో ఎక్సెస్ కొవ్వు పేరుకోదు. దోస, చపాతీలు నాన్‌స్టిక్‌లో కాకుండా ఐరన్ తవాల్లో చేసుకుంటే క్యాన్సర్లురావు సరికదా ఐరన్ లోపం రాదు.

వంటకు స్టీలు, ఇనుప పాత్రలకన్నా మట్టి పాత్రలే మెరుగైనవి అంటున్నారు. ఇపుడు అడుగున మట్టితో తయారు చేసినవి వస్తున్నాయి. వాటిని ఉపయోగించుకోవచ్చు.

ముందురోజు దేవుని దగ్గర పెట్టిన పూలను తీసుకొని వాటిని చల్లనీటిలో వేసి గదిలో అక్కడక్కడా పెడితే గదికి అలంకారం చేసినట్టుగా ఉంటుంది.

★

కృతజ్ఞతలా? ఫిర్యాదులా?



స్కూల్ నుంచి తిరిగి వచ్చిన సూరజ్ చెప్పిన మాటలు విన్న తల్లి చెప్పింది.

"ఏమిటిది? వచ్చినప్పటినుంచి చూస్తున్నాను. అందరిమీదా ఫిర్యాదులు చేస్తున్నావు. ఇంగ్లీషు టీచర్ పాఠం అర్థం అయ్యేలా చెప్పలేదని, నీ పక్కన కూర్చున్నవాడి సాక్స్ కంపుకొట్టాయని, నీ పెన్ రీఫిల్ మధ్యలో రాయడం ఆగిపోయిందనీ.. ఇవాళ ఫిర్యాదుల దినంలా ఉంది".

సూరజ్ బదులుగా నవ్వాడు.

"ఈ రోజుని ఫిర్యాదుల దినం బదులు దేవుడికి కృతజ్ఞతలు చెప్పే దినంగా మార్చచ్చు కదా?" ఆమె ఆలోచనగా చెప్పింది.

"దేవుడికి కృతజ్ఞతలు చెప్పే దినమా? అంటే?" సూరజ్ అడిగాడు.

ఆమె చిన్నగా నవ్వి తన వంక ఆసక్తిగా చూసే కొడుకుతో చెప్పింది.

"నువ్వు అందరిమీదా గొంతు చించుకుని ఫిర్యాదులు చేసినట్లుగానే దేవుడ్ని గొంతుచించుకుని పొగడచ్చుగా? ఇవాళ వర్షం కురిపించిన దేవుడికి కృతజ్ఞతలు తెలియజేయాలి. వేడి బాగా తగ్గింది కదా?"

"అవును. కానీ నా బూట్లకి బురద అంటింది".

"అదిగో మళ్లీ.. ఇది ఫిర్యాదుల రోజు కాదు, కృతజ్ఞతల రోజు" ఆమె చిరుకోపంగా చెప్పింది.

తర్వాత ఆలోచించి ఓ కాగితం, పెన్సిల్‌ని కొడుక్కి ఇచ్చి చెప్పింది.

"దేవుడు నీకు ఆనందం కోసం ఏం విలువైనవి ఇచ్చాడో ఆలోచించి అందుకు ఆయన్ని పొగిడే జాబితాని తయారుచెయ్యి. నాకు వంట పనుంది. రాత్రి భోజనం అయ్యాక ఆ జాబితాని చూపించు".

ఆమె వంట గదిలోకి వెళ్ళాక సూరజ్ ఆలోచించి రాసాడు.

"దేవుడు నాకు రోజూ ఆహారం ఇస్తున్నందుకు కృతజ్ఞుడ్ని.."

అలా వాడు జాబితాని రాసాక గట్టిగా అరిచాడు.

"అమ్మా! ఇంకో కాగితం ఇవ్వు' చాలా పెద్ద జాబితానే రాసాడు.

ఆఫీస్ నుంచి ఇంటికివచ్చిన భర్తని ఆమె అడిగింది.

"ఆఫీస్‌లో ఎలా గడిచింది?"

"ఏం బాగాలేదు. ముందుగా వర్షానికి బట్టలు తడిసాయి. తర్వాత.."

"దేవుడ్ని కీర్తించు నాన్నా" సూరజ్ అరిచాడు.

తండ్రి ఆశ్చర్యంగా చూస్తే చెప్పేడు.

"ఇవాళ దేవుడికి కృతజ్ఞతలు చెప్పి, పొగిడే రోజు తప్ప ఫిర్యాదులు చేసే రోజు కాదని అమ్మ చెప్పింది".

"మీ అమ్మని పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు. ప్రతీ రోజు మనకి రుచికరంగా వంట చేసే నైపుణ్యాన్ని ఇచ్చినందుకు కూడా " అతను నవ్వుతూ చెప్పాడు.

తల్లి కూడా నవ్వి చెప్పింది.

"పిర్యాదులు చేసే కంటే, వారు చేసిన మంచిని గుర్తుతెచ్చుకుని పొగడటం మనకి, మనవాళ్ళకి కూడా మంచిది".

- మల్లాది వెంకట కృష్ణమూర్తి

మేలు చేసే తేనె

- మనం తీసుకునే ఆహారంలో హెచ్చుభాగం పండ్లు తీసుకోవాలి. కాయగూరలు కూడా అధికంగా తీసుకోవాలి. ఎందుకంటే వీటిల్లో ఎక్కువ విటమిన్స్, మినరల్స్ వుంటాయి.
- ఎక్కువగా రిఫైండ్ షుగర్స్‌ను వాడకూడదు. ఇది ఎక్కువగా చాక్‌లెట్స్‌లో, ఐస్‌క్రీములలో, కేకులలో, తీపి పదార్థాలలో ఇది వుంటుంది. ఇందు కోసం పంచదారకన్నా తేనెను తీపిదనం కోసం వాడవచ్చు.
- తాజా ఆకుకూరలు ఆరోగ్యానికెంతో మంచిది. టమోటాలు, దోసకాయ, పాలకూర మొదలైన వాటిలో హెచ్చు కాల్షియం వుంటుంది. ఐరన్, కెరోటిన్, రిబోఫ్లావిన్, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్‌లు వుంటాయి. కాబట్టి ఎక్కువగా ఆకు కూరలు తినడం ఆరోగ్యానికి మంచిది.
- ఇక తాజాపండ్లు ఆరంజి, యాపిల్, బొప్పాయి తింటే ఆరోగ్యకరమైన చర్మం ఏర్పడుతుంది. లెమన్ జ్యూస్ కూడా మంచిదే. అందులో విటమిన్ సి వుంటుంది. ఇది ఇన్‌ఫెక్షన్ రాకుండా కాపాడుతుంది. చర్మం బాగుండాలనుకుంటే నిమ్మరసం తీసుకోవాలి.
- అతిగా తినడం దుర్గుణం. చాలా తేలికైన ఆహారం స్లిమ్‌గా వుండేటట్టు చేస్తుంది.అతిశీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరం. స్వచ్ఛమైన నీరు ఎక్కువగా త్రాగాలి. బాగా చిలికిన మజ్జిగ చాలా మంచిది.
- ఇవి అందరికీను మనకే కాదు సుమా

★

మాతృభూమికి రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుబ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

సామాజిక బాధ్యత పెంచే నాణేల సేకరణ

సత్యబుద్ధ విశాఖపట్టణంలోని ఒక సాధారణ పౌరుడు. కాని అసాధారణమైన పని చేశారు. చిన్నప్పుడు ఆకతాయిగా తిరుగుతున్నాడని వాళ్ల నాన్నగారు నాణే ల సేకరణ గురించి చెప్పారు. అదిగో అప్పటినుంచి నాణేల సేకరణ ప్రారంభించారు. ఇపుడు భారతదేశంలో ఒకటో శతాబ్ద నుంచి ఇప్పటి వరకు ముద్రించిన నాణేలు, ఇక్ష్వాకుల కాలం నుంచి కనిష్క, కుమార గుప్తులు కాలం వరకు, ఛత్రపతి శివాజీ, టిప్పుసుల్తాన్, మొగల్ చక్రవర్తులైన అక్బర్, ఔరంగజేబు, షాజహాన్ కాలంలోనివి, 1858లో రష్యా ముద్రించిన అతిపురాతన కరెన్సీనోట్లు, ప్రపంచంలోని అతిచిన్నవైన హాంకాంగ్ సెంటునోటు, అతిపెద్దదైన రష్యా 100 రూబుల్స్ నోటూ దాచిపెట్టారు. ఇవేకాకుండా ఇంకా ఎన్నో పురాతనమైన, ప్రస్తుతం వినియోగంలో ఉన్న నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపులు సత్యబుద్ధ ఇంట్లో ఉన్నాయి.

2000 సంవత్సరంలో జంతువులు, పక్షులు, 2003లో ప్రముఖుల ముఖచిత్రాలు, 2004లో పువ్వులు, ఓడలు, సూర్యుడు, స్టార్ అండ్ మూన్, దేవాలయాల ముఖచిత్రాలుగా ఉన్న నాణేలు, స్టాంపులు సేకరణకు, 2005లో పైవన్నీ అధికంగా సేకరించినందుకు సత్యబుద్ధకు లిమ్కా బుక్‌లో చోటు లభించింది.

వీటి వల్ల పిల్లలకు సామాజిక స్పృహ కలిగి బాగా సామాజిక బాధ్యత చిన్నప్పటి నుంచి వారికి కలుగుతుంది.

- గున్న కృష్ణమూర్తి



వ్యూహం

41

అలపర్తి రామకృష్ణ

నిజంగా సముద్రంలో చిన్న పడవలో ప్రయాణం చేస్తున్నట్లు వుంది లోహితకు. చుట్టూ పెద్ద పెద్ద అలలు.. మింగెయ్యడానికి నోరు తెరచుకున్న తిమింగలాలు, షార్క్ చేపలు...

ఎలా బయటపడాలి?

"నేను రిజైన్ చేసి హైదరాబాద్ వెళ్లిపోతాను" అందామె.

"అది సాధ్యం కాని పని.. ఒక్కసారి మా గ్రూప్ ఆరిఫ్ హాస్పిటల్లో చేరేక మధ్యలో రిజైన్ చేసి వెళ్ళటం అంటూ కుదరదు. రిటైరయ్యాక బయటకు వెళ్లాలి లేది మాధ్యలోనే తనువు చాలించి నిష్క్రమించాలి!" అన్నాడు అరవింద్ కొంచెం కటువుగా.

వాళ్ళ మైండ్ సెట్ అర్థం అయ్యింది లోహితకు.

సముద్రంలో నౌకలో ప్రయాణం తప్పదు.. షార్క్స్, వేల్స్ సచేపలకు భయపడకుండా తీరాన్ని చేరుకోవాలి! ప్రాప్తమున్న తీరానికి చేరుకోవడం కాదు, తాను అనుకున్న తీరానికి చేరాలి! స్కంద సహకారం తనకు వుంది. భయపడకూడదు తను.

"మీరు చెప్పినట్లే చేస్తాను సార్" అంది లోహిత.

"దట్స్ గుడ్" అన్నాడతను.

అక్కడనుంచి బయటకు వచ్చిందామె.

:::::

రాజమండ్రికి దగ్గరలోనే వుంది కడియం.

ఆ ప్రాంతంలో ఎటువైపు వెళ్లినా నర్సరీలు వున్నాయి.

కొన్నివేల పూల మొక్కలు, డెకరేషన్ ప్లాంట్స్ భూమిమీద కొలువుతీరి ముచ్చట్లు చెప్పుకుంటున్నట్లు కన్పించేయి.

కారు నిశాంత్ ఇంటి దగ్గరకు రాగానే భయపడింది సావేరి.

పెళ్లి కాకముందే ఇంటికి తనను నిశాంత్ తీసుకువెళ్తున్నాడు. అతని తల్లిదండ్రులు ఏమనుకుంటారో! బరితెగించి వచ్చేసింది పిల్ల. అమెరికా అబ్బాయిని ఎగరేసుకుపోవాలని వెంటబడి వచ్చింది' అనుకోరూ!

"వెంటనే ఆ అమ్మాయిని వాళ్ళింటికి పంపించెయ్యి! పెళ్లికాకముందే నువ్వు అమ్మా



యిలను వెంటేసుకుని తిరుగుతుంటే నలుగురు నవ్వరూ!" అని నిశాంత్ తల్లి అంటుందేమో!

నిశాంత్ తండ్రి మందలిస్తాడేమో!

"మీ నాన్నగారికి చెప్పారా మనం వస్తున్నట్లు" అడిగింది సావేరి, కారు డ్రైవ్ చేస్తున్న నిశాంత్ వైపుచూస్తూ.

"మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోబోతున్నాం ముందే చెబితే థ్రిల్ ఏముంటుంది?" అన్నాడతను.

అతని మనసులో ఎటువంటి ఆందోళన లేదు. ప్రశాంతంగా డ్రైవ్ చేస్తున్నాడు. సావేరిని పక్కన కూర్చోబెట్టుకుని కారునడపడం అతనికి ఉత్తేజాన్ని కల్గిస్తూ వుంది.

"మీ నాన్నగారు మిమ్మల్ని కోప్పడితే?"

"తిరిగి హైద్రాబాద్ వెళ్ళిపోదాం! మళ్లీ నీతో కారులో లాంగ్ డ్రైవ్" సమాధానమిచ్చాడు, నవ్వుతూ.

నిశాంత్ ఇంటిముందు కారు ఆపాడు.

విశాలమైన ఆవరణలో పచ్చని చెట్లమధ్య ఉంది ఆకు పచ్చ రంగు పెయింట్ వేసిన మేడ. ఇంటిముందు రకరకాల పూల మొక్కలు. ఆ మొక్కల్ని చూస్తూ పులకించిపోయింది.

"ఈ రంగు రంగుల గులాబీలు, చేమంతులు ఎంత ముద్దొస్తున్నాయో!" అంది సావేరి పూలకుండీల దగ్గర కూర్చుని.

"పూల మొక్కల మధ్య ముద్దబంతిపూవులా ఒదిగిపోయి కూర్చుంది.. ఎవరా అమ్మాయి?" అంటూ పోర్టికో దగ్గరనుంచి వాళ్ళున్న చోటికి వచ్చింది నిశాంత్ తల్లి రాధమ్మ.

"నా ఫ్రెండ్ సావేరి అమ్మా! మన స్కందకి బాగా దగ్గరివాళ్ళు.. మన ఊరు చూస్తానంటే తీసుకువచ్చాను.. నెల రోజులు వుంటుంది మన ఇంట్లో గెస్ట్‌గా" అన్నాడతను.

"చుట్టుప్రక్కల ప్రాంతాలన్నీ చూడాలంటే నెల రోజులు ఏం సరిపోతుంది? మన ఊరి అందచందాలు చూడటానికే నెలరోజులకుపైగా పడుతుంది.. లోపలికిరా తల్లీ!" అంది రాధమ్మ సావేరి చెయ్యి పట్టుకుని.

"యాభైఏళ్ల వయసులో కూడా ఎంత అందంగా వుంది!" అనుకుంది సావేరి రాధమ్మను చూడగానే. ఆకుపచ్చ రంగు చేనేత చీర, పసుపు పచ్చ జాకెట్టులో వనదేవతలా కన్పించింది. ఆమె వెనుకే అడుగులు వేసింది.

"ప్రయాణం చేసి అలసిపోయినట్లున్నావ్.. స్నానం చెయ్యి ఫ్రెష్‌గా వుంటుంది! ఈలోపు నేను కాఫీ పట్టుకొస్తాను" అందామె.

లోపలికి వెళ్లబోయిన ఆమె ఆగి 'నీ బ్యాగ్ ఏది?' అని అడిగింది రాధమ్మ.

"కారు డిక్కీలో వుంది.. తెచ్చుకుంటాను" అంటూ వెనక్కి తిరిగింది సావేరి.

ఇంకాఉంది



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

- **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
 శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధన లాభంలో ఆనందంగా వుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు వినోదాల్లో పాల్గొంటారు.
- **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
 ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. పక్కదోవ పట్టించేవారి మాటలు వినరాదు. క్రీడాకారులకు, మానసికాందోళన తప్పదు. నూతన కార్యాలు వాయిదా వేసుకోడం మంచిది.
- **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
 వృత్తి, ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ, మర్యాదలు పెరుగుతాయి. పిల్లలకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి.
- **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
 అవసరమైన భయాందోళనలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితిలో మార్పులుంటాయి. ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.
- **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
 నూతన వస్తు, వస్త్ర, ఆభరణాలు పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వినోదాల్లో పాల్గొంటారు. చర్చలు సదస్సులు మిమ్మల్ని ఆకర్షిస్తాయి. మనోధైర్యాన్ని కలిగియుంటారు. శుభవార్తలు వింటారు.
- **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
 నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ, లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు నెరవేర్చుకుంటారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.
- **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
 వ్యవసాయ రంగంలోనివారికి లాభదాయకంగా వుంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి. శారీరకంగా బలహీనమేర్పడుతుంది.
- **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
 కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృధా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి.
- **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
 సంతోషంగా గాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుందురు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఆర్థికంగా బలపడతారు. స్త్రీలు మనోలాసాన్ని పొందెదరు.
- **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
 కళాకారులకు, మీడియా రంగాలవారికి మంచి అవకాశాలు లభిస్తాయి. దేహాలంకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుస్తారు. పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తారు. నూతన వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు.
- **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
 ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి వస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. అనసరంగా డబ్బు ఖర్చుగుటచే ఆందోళన చెందుదురు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించక తప్పదు.
- **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
 మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించుట అవసరం. నూతన కార్యాలకు ఆటంకాలేర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది. కఠిన సంభాషణవల్ల ఇబ్బందుల నెదుర్కొంటారు. ఇతరులకు హాని తలపెట్టు కార్యాలకు దూరంగా వుంటారు.

కాలం నిలపని వంశ ప్రతిష్ఠ-కల్లోల కుటుంబ వ్యవస్థ

శ్రీవిరించీయం

'పాతిక సంవత్సరాలు కాపురం చేసిన రామసుబ్బమ్మ భర్తకు తొలిసారిగా ఎదురుతిరిగింది. పతివ్రత, పరమసాధ్వి అయిన రామసుబ్బమ్మ భర్త గీచిన గీటును దాటి ఎరగని రామసుబ్బమ్మ, ఈ లోక దైవాన్నే ధిక్కరించింది. సత్యకాలం కాకపోబట్టి సరిపోయింది. లేకపోతే అటు సూర్యుడు యిటు పొడిచి, నక్షత్రాలు ఝుల్లున నేలరాలి, భర్త శాపాగ్నిలో రామసుబ్బమ్మ మల మల మాడి మసై వుండేది. లేకపోతే చిన్నసైజు నల్లరాతి బండైనా అయి వుండేది'- ఈ వాక్యాలు వాసిరెడ్డి సీతాదేవి కథానిక 'మారిపోయిన మనిషి'లో మొదట్లోనే అగుపిస్తాయి. ఎవరు ఈ రామసుబ్బమ్మ? భర్త మాటకు ఎందుకు తిరగబడింది? ఆమె అలా తిరగబడడం ధర్మమేనా? తిరుగుబాటువల్ల వచ్చిన ఫలితం ఏమిటి? కాలం మనుషుల్ని ఎట్లా కుదిపి కదలించివేస్తుంది, మనసులను ఎలా మార్చివేస్తుంది!.. ఈ వివరాలన్నీ కథలో క్రమంగా బయటపడతాయి.

రామసుబ్బమ్మ భర్త శేషయ్య. అతను పరువయిన ఐశ్వర్య కుటుంబంలో పుట్టిన వాడే. అతని తాతలు, ముత్తాతలు, తండ్రులు ఎన్నో దానధర్మాలు చేసి పుణ్యకార్యాలు ఆచరించి వంశానికి పరువు ప్రతిష్ఠలను ఇనుమడింపజేశారు. వాటిని నిలిపి వుంచటానికి, వాటికి మాలిన్యం అంటకుండా ఉండడానికి శేషయ్య కంకణం కట్టుకున్నాడు. కుటుంబం పస్తులు వుండే దిగజారుడు స్థితి వచ్చినా అతని వంశ ప్రతిష్ఠ అభిప్రాయాలు, అతిశయాలు ఇసుమంతయినా మారలేదు. భార్య ఇరుగుపొరుగువారి సహాయంతో 'ఇడ్లీల వ్యాపారం' చేయబూనుకుంటే అది తన ప్రతిష్ఠకు ప్రతిబంధకం అవుతుందనీ, యింక యీ వూళ్ళో తనకు తల పైకెత్తి తిరిగే అవకాశం లేదనీ నిర్ణయించుకుంటాడు. భార్య, కూతురు ఎంత సమాధానంగా చెప్పదలచుకున్నా అతని ధోరణి యేమాత్రం మారదు. ఆఖరుకు భార్య తన పుస్తెలు తాకట్టుపెట్టి వ్యాపారం కోసం పెట్టుబడిగా తెచ్చుకున్న ఆరు వందల రూపాయలు దొంగతనం చేసి ఊరునుంచి పరారైపోతాడు- తన బట్టలు చేతి కర్రతో సహా. రామసుబ్బమ్మ బాధలు మళ్లీ మొదటికే వస్తాయి. ఆమెకు ఇరుగు పొరుగువారే సహాయపడి నిలదొక్కుకునేట్లు చేస్తారు. అనుకున్న ప్రకారం ఆమె ఇడ్లీల వ్యాపారం చేసి దానిని క్రమంగా అభివృద్ధి చేసుకుని పల్లెటూరు విడిచి దగ్గరి రైలు స్టేషన్ వున్న ఊరులో చిన్న సైజు రెస్టరెంట్ ఏర్పాటు చేసుకోగలుగుతుందనీ, యిందుకు కూతురు- అల్లుడు సహాయంగా నిలిచి ఉన్నారని మనకు కథాంతంలోగాని ఊహకు అందదు.

తరువాతి కథనం అంతా శేషయ్య యాత్రతో నడుస్తుంది. చేతినిండా డబ్బు వున్నది గనుక అది దొంగతనంగా సంపాదించిందే అయితేనేం- అతను ఇబ్బందులకు లోనుకాకుండా కృష్ణ, గోదావరి నదులు దాటుకుపోయి కాశీపట్టణానికి చేరుకుంటాడు. కాశీలో అతను గంగానది స్నానం చేయబోతూ వుండగా-అతను బసచేసిన సత్రంలో యేదో చోరీ జరిగిందనీ, అందుకు శేషయ్యే బాధ్యుడనీ పోలీసులు అతన్ని అరెస్టు చేసి జైలుపాలు చేస్తారు. గంగానదిలో స్నానం చేసి - జీవితం అంతం చేసుకుందామనే అభిప్రాయంతో వున్న శేషయ్య తన కట్టుబట్టల సంచీ నదీ మధ్యానికి గిరవాటు వేయడం పోలీసులకు అదే నగల మూట అనుకునేందుకు ఆధారం అయింది. అతనికి మూడు సంవత్సరాల జైలుశిక్ష పడింది. ఈ మూడేళ్ళలో అతను హంతకులమధ్య, దొంగలమధ్య కాలక్షేపం చేస్తూ ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నాడు. తన భార్య నగలు అమ్మి చేర్చుకున్న డబ్బును అపహరించినందువల్లనే తనకు ప్రస్తుత చోరీ నేరం ఆపాదన అయిందనీ, తనకు తగిన శిక్షే పడిందనీ సమాధానపడతాడు. ఇకనుంచయినా చక్కగా బతుకు కొనసాగించాలనీ, వెనకటి భేషజాలకు మనసు లొంగపోకూడదనీ నిర్ధారణకు వస్తాడు.

శేషయ్య జైలు జీవితం గడిపి బయటకు వచ్చి తన స్వగ్రామానికి తిరిగి వెళ్లి భార్యాబిడ్డలను చూడాలని ఆరాటపడతాడు. ఆ ఊరుకు వెళ్ళే రైలు ఎక్కి దగ్గరి స్టేషన్‌లో దిగుతాడు. అక్కడినుంచి ఐదు మైళ్లు బస్సు ప్రయాణం చేస్తే తప్ప అతని గ్రామం రాదు. రైలు స్టేషన్ ఎదురుగా వున్న చిన్న రెస్టరెంట్ అతన్ని కాఫీ తాగమని ప్రేరేపిస్తుంది. చేతిలో మిగిలిన పైసలు కూడా ఇందుకు సహకరించేట్లే కనిపిస్తాయి. శేషయ్య కాఫీ హోటల్‌లో చేరి కడుపారా టిఫిన్ చేసి, కాఫీ పుచ్చుకుంటాడు. హోటల్ యజమానికి డబ్బు చెల్లించకుండానే ఎదురుగా కనిపించిన బస్ ఎక్కి ఊరికి వెళ్ళే ఊరటలో వుంటాడు. అయితే హోటలు యజమాని అతన్ని పట్టుకుని చొక్కా లాగి కిందకు గిరాటేస్తాడు బస్‌లోనుంచి. తీరా హోటల్‌కు తీసుకువచ్చి దండించే సమయంలో అతని కూతురు- తండ్రిని గుర్తుపట్టి, తల్లిని తీసుకువచ్చి ఎఱుక చేస్తుంది. శేషయ్య భార్యను రెండు చేతులా పట్టుకుని 'నేనే.. నేనే.. నన్ను క్షమించు..' అన్నమాటలు చెప్పలేక చెబుతాడు. అల్లుడు అతన్ని 'పారిపోయిన మనిషా?' అంటే- శేషయ్య భార్య 'కాదు- మారిపోయిన మనిషి' అంటుంది రామసుబ్బమ్మ ముసిముసి నవ్వులతో.

వంశ ప్రతిష్ఠ, మర్యాదలంటూ భేషజాలకు పోకుండా వర్తమాన స్థితిగతులను చక్కగా ఆకళింపు చేసుకుని జీవితం గడపటం అవసరం అనే 'న్యాయ సూత్రాన్ని' యీ కథానిక చెబుతుంది. కల్లోల కుటుంబాన్ని సరిచేయడంలో స్త్రీకి ఎటువంటి బాధ్యతాయుతమైన పాత్ర వున్నదో కూడా చెబుతుంది. ఓడలు బళ్ళు అవడం, మళ్లీ బళ్ళే ఓడలుగా తయారవడం కాలం తీసుకువచ్చే మార్పు అయినా, ఇందుకు దోహదం చేసేది జీవనయానం చేస్తున్న మనుషులే అని చదువరులు గమనించాలని సూచించే యీ చక్కని కథానిక స్త్రీవాద ధోరణి మటుకే సంబంధించినది కాదు. జీవనయాత్ర అంతటినీ పొదిలపరచేది.

నేర్చుకుందాం — నరసింహ శతకం

దేహమున్నవఱకు మోహసాగరమందు
మునుఁగు చుందురు శుద్ధ మూఢ జనులు
సలలితైశ్వములె-శాశ్వతంబనుకొని
షడ్భ్రమలను మానఁ జాలరెవరు
సర్వకాలము మాయ సంసార బద్ధులై
గురుని కారుణ్యంబు గోరుకొనరు
జ్ఞాన భక్తి విరక్తులైన పెద్దలఁ జూచి
నిందఁ జేయక తాము నిలువ లేరు
తే. మత్తులైన ట్టి దుర్జాతిమనుజులెల్ల
నిన్నుఁ గనలేరు మొదటికే నీరజాక్ష!
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార ! నరసింహ! దురిత దూర!

భావం: ఓ స్వామీ! బొందిలో ప్రాణమున్నంతకాలం వ్యామోహాలకు గురియై , సంపదలే శ్వాశతమనుకొని అరిషడ్వర్గాదులకు దాసులై జ్ఞానార్జనకై గురువుని ఆశ్రయించరు. భక్తి జ్ఞాన వైరాగ్యాలు గల సాధువుల్ని చూస్తే తిట్టకుండ ఉండలేరు. ఈ దుష్టులకు నీ సంగతి ఏ మాత్రం తెలీదు.

ఆశ ఖరీదు అణా

గోరాశాస్త్రి గారి రేడియో నాటిక

వినమరుపైన..

కృ: ఏడిశాడు, పద. అంతగా అయితే పీక పిసికేస్తాడు. ఆపైన ఏమీ చెయ్యలేడు గదా! అదే హాయి. ఈ క్షణాన నేను కోరుకుంటున్నదీ అదే.

ఇం: ఆ లెక్కని నేను ఏనాడూ రైలు కిందపడిపో ఉండవలసినది. ఇటువంటి వాటికి నేను విరుగుడు కనిపెట్టాను. నువ్వూ అది నేర్చుకో.

కృ: ఏవిటది?

ఇం: కష్టాలు మరీ ఎక్కువైపోయి, భరించలేనంత దుఃఖం వస్తే వెంటనే కళ్లు మూసుకొని నిద్రపో! మళ్లీ నువ్వు మేలుకొనేసరికి?

కృ: కష్టాలు కరిగిపోతాయా?

ఇం: అలా అనలేదు. కాని, మనస్సు కొంచెం తేరుకుంటుంది. కష్టాన్ని భరించే శక్తి కొంచెం కోలుకుంటుంది.

కృ: పద కాస్త బయటి ప్రపంచం యీరాత్రి లా ఉందో చూద్దాం.. మీ అన్నయ్య ఎక్కడ తిరుగుతున్నాడో సుమా.

:::::

యు: వీధి యించుమించు నిర్మానుష్యంగా ఉంది. అంతటా ఒంటరితనం, నిస్సహాయం. వీధి లాంతర్లు కూడా భయంగా, జాలిగా వెలుగుతన్నాయి. ఏమి రాత్రి ఇది! గాలిలో కనరాని గడసు దెయ్యాలు- భూ దివమ్ముల మధ్య యీదుతున్నయి' అన్నాడట ఎవరో; అలాగే ఉంది.. ఆఖరిసారి భోంచేసి ఎన్నాళ్లయింది చెప్మా! రెండు రోజులయుంటుంది. ఇలా ఎన్నాళ్ళు గడుస్తుంది? ఏమో ఎవరికి తెలుసు! ఎవరో నన్ను ఓడించేశారు. మరి నెగ్గడం అసంభవం. చేతులు జోడించి నమస్కరించి, చల్లగా ఒప్పోవడమే మంచిది.

తా: ఇంకా ఇక్కడ పచార్లు చేస్తున్నావా నాయనా?.. ఏం అలా ఉలిక్కిపడ్డావ్?

యు: మీరా? ఏవిటో పరాగ్గా ఉన్నారు. రండి తాతగారూ రండి! ఎలా ఉంది యింట్లో?

తా: బయట ఎలా ఉందో యింట్లోనూ అచ్చు అలానే వుంది నువ్వు వినలేదా?

యు: లేదే! ఏమిటీ?


తా: (వ్యంగ్యంగా) ఏవిటేవిటి వెర్రివాడా! కొత్త సృష్టి, నవజీవన చైతన్యం మా కోడలు ప్రసవించింది. ఆడపిల్ల. ఏడుపు వినలేదూ? మేడ పునాదులు కదలిపోయేటట్టు ఏడుస్తోంది నాయనా!

తా: ఏవిటాశ్చర్యం?

యు: మేడలో జనాభా ఉన్నట్టుండి హఠాత్తుగా పెరిగిందన్నమాట!

తా: మరే.. ఎవరా చీకట్లో?

ఇం: నేనండీ తాతగారూ! ఇందరని.. నేనూ, కృష్ణవేణిని..



కృ: జనానా అంటున్నారేవిటి?

యు: తాతగారికి మనవరాలు పుట్టిందట.. మీ పేరు నిజంగా కృష్ణవేణేనా?

కృ: నిజమే... అదే నా పేరు- ఏం?

ఇం: మా అన్నయ్యగాని కనబడ్డాడా తాతగారూ!

తా: లేదమ్మా! ఇంకా ఇంటికి రాలే?

ఇం: రాలేదండీ! పొద్దున్ననగా యిల్లు విడిచివెళ్ళాడు. ఏవిటో, కంగారుగా వుంది.

తా: నయపడకమ్మ! వస్తాడులే!

యు: ఏలాగుంటాడండీ మీ అన్నయ్య?

ఇం: సన్నగా పొడుగ్గా ఉంటాడు. కళ్ళల్లో ఎప్పుడూ భయం పెట్టుకుని. ఏం?

యు: ఆ.. ఏం లేదు, చూస్తే పోల్చుకుందికి అడిగాను.

ఇం: మీరేనాండి మేడ గది అద్దెకు తీసుకుంది?

యు: అవునండి.

ఇం: మీ గది గోడలనిండా బొమ్మలు వేలాడదీశారే? అవన్నీ మీరు రాసినవేనా?

యు: అవన్నీ నేన సృష్టించిన పాపాలేనండి. అందుకే యిప్పుడు విచారిస్తున్నాను.

కృ: విచారందేనికి?

యు: బొమ్మలు రాయడం బదులుగా పకోడీల దుకాణం పెట్టుకున్న బాగుండిపోవునని.ఇంతకన్నా హాయిగా బతికి ఉందును.

కృ: ఓహో! అయితేమీర మా ముఠాల్లోవాళ్లేనన్న మాట, కాదనుకున్నాను.

యు: ఎంచతే అనుకున్నారూ?

కృ: ఏమో కారణం చెప్పలేను. అన్నిటికీ కారణాలు చెప్పగలమా? మీరు బొమ్మలు ఎంకు వేస్తారో చెప్పగలరా?

యు: ఆ.. ఈ ప్రపంచంలో ఏది చూసినా నాకు బాధాకరంగా కనిపిస్తుంది.ఆ బాధ నలుగురూ పోల్చుకుంటే అందరం కలిసి ఏమైనా చెయ్యగలమేమోనని ఆశ.. అవన్నీ బొమ్మలలు వేసి చూపిస్తాను- అందుకే.

- సశేషం (ఆకాశవాణి సౌజన్యంతో...)

మాటాట

నిర్వహణ: సుధామ 1561

1	■	2	3			■
	■	■		■	■	
5	6	■		■	7	
■	8		■	9		
10		■	11	■		■
	■	■	12		■	13
	■	14		■	15	

ఆధారాలు

అడ్డం:
2. అమర గాయకుడు తెలుగువారికి
5. సూర్యుడు
7. భరణీనక్షత్రము , దక్షిణదిక్కు
8. కాంతి
9. చెదరిన మినుము
10. నాటిన గింజ
12. పత్ని
14. నెపము
15. ఉపాయము

నిలువు:
1. గిడుగు వారు వ్యాకరణం సంతరించిన భాష
3. చాటింపు
4. పోలిక
6. కరెంటు
7. రాత్రి
10. పాండిత్యము
11. పానుగంటి వారి సాక్షివ్యాసాలలో ప్రముఖమైనది , సొంతమాట
15. మోక్షము

మాటాట -1560 సమాధానం

గ	ట	2 క	■	3 యో	ష	■
■	■	4 లీ	5 వం	గం	■	6 ర
7 ఆ	■	■	ద	■	■	తీ
8 మ	రు	డు	■	9 డు	వు	దే
ల	■	■	10 బు	■	■	వి
క	■	11 వం	డ	12 నే	■	■
13 ము	ద్దు	■	14 గ	త్యం	త	రం

విఘ్నరాజు వినాయకుడు



గణపతి వేదాలకు, జ్ఞానములకు, కర్మిష్టులకు, సర్వ వ్యాపక శక్తులకు ప్రభువని సర్వగణాలకు అధిదేవతని, సర్వాహ్లాదకరుడని సర్వులకు జ్యేష్టుడని, అధినాయకుడని, ఉత్తమ కీర్తి సంపన్నుడని ఋగ్వేదం చెబుతుంది. గణపతి సర్వవ్యాప్తమైన పరబ్రహ్మ స్వరూమని సృష్టి, స్థితి లయములకు కారకుడని, సర్వ కార్యములకు సృష్టికి కర్త, హర్త అని ఆనందమయుడని, చిన్మయుడని, లంబోదరుడని, శూర్పకర్ణుడని, రక్తాంగుడని గణపత్యథర్వ శీర్షోపనిషత్తు చెబుతుంది. విఘ్ననాయకుడు, విఘ్నహారి అయిన స్వామి ఆదిదేవునిగా పూజిస్తే చాలు విఘ్నాలు లేకుండా పనులు సానుకూలం అవుతాయి.

లయ బ్రహ్మ.. సంగీత సామ్రాట్



భారతీయ సంగీత, ఆధ్యాత్మిక రంగాలకు మకుటంలేని మహారాజు శ్రీ త్యాగరాజు. సంగీత సాహిత్యాలకు ఒజ్జిబంతి శ్రీ త్యాగరాజు. సంగీత సాహిత్యాలతోపాటు భరతమునికి ధీటుగా భారతావనిలో వన్నెకెక్కినవారు 'సంగీత సాహిత్య సార్వభౌమ', 'లయబ్రహ్మ' పుంభావ సరస్వతికి ప్రతిరూపంగా అవతరించినవారు హరికథా పితామహులు శ్రీ ఆదిభట్ల నారాయణ దాసుగారు.

ఇద్దరూ సాహిత్య స్రష్టలే. వాగ్గేయకారులు కూడా. విశేషించి ఇద్దరూ శ్రీరామభక్తులు. మరొక విశేషం ఇరువురూ పుష్య బహుళ పంచమినాడు కైవల్యం పొందారు.

సన్యాసి పరమపదించిన తిథినాడు 'ఆరాధన' జరపడం శాస్త్ర సంప్రదాయం. శ్రీ త్యాగరాజు కైవల్యం పొందడానికి అయిదు రోజుల ముందు సన్యాసం స్వీకరించారు. అందువల్ల తిరువయ్యూరు ఆయన సమాధి వద్ద ఆరాధనోత్సవాలు నిర్వహిస్తారు.

దాసుగారు సన్యసించకపోయినా, తమ జీవితాన్ని హరికథాగానంతో, సరస్వతిని అర్చిస్తూ సన్యాసాశ్రమానికే అంకితం చేశారని చెప్పవచ్చు. పైగా భగవతిని జీవిత పర్యంతం వశం చేసుకుని, ఇచ్ఛామరణం పొందిన ఉపాసకులు. అందువల్ల శ్రీ దాసుగారికి ఆనాడు ఆరాధన ఉత్సవం నిర్వహిస్తారు. ఇద్దరూ కారణజన్ములే!

సంగీతాన్ని 'నాదోపాసన'గా సాగించిన త్యాగరాజు, ఆ నాదాన్ని శ్రీరామునిగా ఆరాధించారు. కర్ణాటక సంగీతం ఆవిర్భవించిన సంగీత మూర్తి త్రయంలోని ముగ్గురూ తిరువయ్యూరు క్షేత్రంలో సదాశివావతారమైన త్యాగరాజేశ్వర క్షేత్రంలో జన్మించారు. ఆ పేరే తల్లిదండ్రులు తమ కుమారునికి 'త్యాగరాజు'గా నామకరణం చేశారు. త్యాగరాజు తల్లిదండ్రులు సీతమ్మ (తొలి పేరు శాంతమ్మ), రామబ్రహ్మం.

త్యాగరాజు బాల్యంలోనే అష్టపదులు, పురందరదాసు రచనలు, రామదాస్తు కీర్తనలు, అన్నమయ్య పదాలను ఔపోశనం పట్టారు. 8వ ఏటనే ఉపవీతుడైన త్యాగరాజు వైణిక విద్వన్మణి కాళహస్తి అయ్యర్ వద్ద తారకమంత్రాన్ని, మరుదానల్లూరు మఠాధిపతి వద్ద శ్రీరామ షడాక్షరీ మంత్రాన్ని పొందేరు. త్యాగరాజు 95 కోట్ల తారకమంత్ర జపం చేసేరని అంటారు. అదే సమయంలో నారదుని ద్వారా స్వరార్ణవ గ్రంథం పొంది సంగీత శాస్త్రంలోని రహస్యాలను గ్రహించారు.

శ్రీ నారాయణదాసుగారు నరసమ్మా, వెంకటాచయనుల దంపతులకు సూర్యనారాయణ వరప్రసాదంగా జన్మించారు. ఆ కారణంగా సూర్యనారాయణ అని నామకరణం చేసేరు. కాలక్రమంలో నారాయణదాసుగా మార్పు చెందింది. త్యాగరాజు, నారాయణదాసులకు తొలి గురువులు జననీ జనకులే!

నారాయణదాసుగారు సంస్కృతాంధ్ర భాషలలోనేగాక ఆంగ్లం, పారశీకం, అరబ్బు భాషలలో నిష్ణాతులు. అచ్చతెనుగు అశ్వత్థవృక్షం.

త్యాగరాజు నాదయోగి. తాను అలవోకగా రచించిన కృతులను అద్భుతంగా, అపూర్వమైన రాగాలతో పాడడమేగాక వాటి ద్వారా ఎన్నో శాస్త్ర మర్మాలను చెప్పారు. ఉపనిషత్తులకు భాష్యంగా ఉంటాయంటారు విజ్ఞులు. నారాయణదాసుగారు గంధర్వ గాయకుడు. సకలకళా పారంగతుడు. తాత్వికుడు. వైయాకరుణుడు. ప్రధానంగా హరిభక్తుడు. దాసుగారి దీధితి చెప్పాలంటే ఒక గ్రంథమే రాయవచ్చు. పలు రంగాలలో మేటి అయిన దాసుగారి ప్రధాన కర్మక్షేత్రం 'హరికథాగానం'.



ఇద్దరికి ఇద్దరూ రాజస్థానాలో ప్రశంసలతోపాటు సన్మానాలు అందుకున్నవారే! ఇద్దరూ హరి ఉపాసనాపరులే. మహత్తులూ గొప్పవే! త్యాగరాజు వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం 'తెరతీయగరాదా' అనడంతో తెరతొలగడం, కాంచీపురం వద్ద బావిలోపడి మరణించిన ఒక్కగానొక్క బిడ్డను బ్రతికించమని ప్రార్థించిన తల్లిని ఊరడిస్తూ 'నా జీవనధార! నా నోము ఫలమా!' అను కీర్తనతో బ్రతికించిన కథ ప్రాచుర్యంలో వుంది.

-ఎ.సీతారామారావు

మూలం కుదురే

ఏ పని చేయాలన్నా ఏ పని సిద్ధించాలన్నా నెరవేరాలన్నా సాధన అవసరం. ఏ కళ రాణించాలన్నా కూడా సాధననే అవసరం. జ్ఞానం పొందాలన్నా, భగవంతుని సాక్షాత్కారం పొందాలన్నా సాధన మార్గం. ఎన్నో వేలయేండ్లు తపస్సు లు సాగిస్తే భగవంతుని వ్యక్తరూపాన్ని చూడగలిగేవారు. ఎంతో కృషి చేస్తే ఒక కళలో నేర్పరితనాన్ని అలవర్చుకొంటారు. ఈ సాధన సాగించడానికి మనిషికి కుదురు ఉండాలి. కుదురు అంటే ఏకాగ్రత. ఏకాగ్రత అనుకొన్నవెంటనే సాధ్యపడదు. మనస్సు అతి చంచలమైంది. ఎన్నో ఆలోచనలు,మరెన్నో సందేహాలతో మనసు నిలవదు.

కృషితో నాస్తి దుర్భిక్షం , సాధనమున పనులు సమకూరు ధరలోన అనేవి కృషి గురించి సాధన గురించి చెప్పే పెద్దల వాక్యాలు. ఏకాగ్రత కావాలంటే గురువు అవసరం. సందేహ నివృత్తి చేసుకొని అనుకొన్న పనిలో అవగాహనను తెచ్చుకుని కార్యాన్ని సాధించడానికి సులువైన మార్గం గురువుగారి బోధనే.

ఈ గురుఅనుగ్రహం పొందాలన్నా సాధన కావాలి. ధ్యానం ద్వారి జ్ఞానం లభిస్తుంది అనడంలోని ఆంతర్యం అదే. మనసు చంచలమైంది కనుక అనుకొన్న పనిని తప్ప మరో ఆలోచన చేయకపోవడం, ఉదాహరణకు భగవంతుని ధ్యానం చేయాలనుకొంటే కేవలం భగవంతుని గురించి ఆలోచనే చేయాలి. భగవంతుని రూపవిన్యాసాలను, ఆరూపంలోని దాగున్న అంతరార్థాలను తెలుసుకోవాలి. భగవంతుడు ఇంతకు ముందు భక్తులను ఎట్లా రక్షించాడో వారి జీవిత చరిత్రను అడిగో, చదివో తెలుసుకోవాలి. భగవంతుణ్ణి పూర్తి విశ్వాసంతో నమ్మాలి. ఒక గోపవనిత రోజు పక్క ఊరికి వెళ్లే ఒక శివభక్తుని ఇంట్లో పాలు పోసి వచ్చేది. ఆ శివభక్తుడు ప్రతిరోజు శివాజ్ఞ లేనిదే ఏది జరుగదు. ఏది తలుచుకుంటే దాన్ని శివుడు ఇచ్చేస్తాడు. శివుడు మనకు ఎల్లవేళలా తోడు ఉంటాడు అని చెప్పేవాడు. ఈ గోపవనిత అట్లాంటి శివభక్తుల కథలను వింటుండేది. ఒకసారి గ్రామంలోని చెరువు కట్ట తెగింది. పక్క ఊరికి వెళ్లడానికి లేకుండా నీరు అమిత వేగంతో ప్రవహిస్తూ ఉన్నాయి. ఆరోజు శివభక్తుడు రుద్రాభిషేకం చేయాలి త్వరగా ఆవుపాలు తెచ్చివ్వు అని ఈ గోపవనిత చెప్పివున్నాడు. ఈ వనిత పాలు పితికింది. వెళ్దామంటే నీరు ఉప్పెనగా ప్రవహిస్తోంది. ఎలాఅనుకొని 'ఆ నాకెందుకు నేను ఓం నమశ్శివాయ 'అనుకొంటూ వెళ్తాను. ఆ శివుడే ఈ పాలను ఆ భక్తునికి ఇస్తాడు. ఆయనకే కదా శివాభిషేకం చేసేది 'అనుకొంది వెంటనే ఓం నమశ్శివాయ అనుకొంటూ వెళ్లింది. అలా ఆ ఉప్పెనలోనే నడుచుకొంటూ వెళ్లి పాలు ఇచ్చింది. ఈ ఉప్పెన సంగతి శివభక్తునికి కూడా తెలసింది. అయ్యో ఎలా వచ్చావు అంతా నీళ్ల కదా అని ఆశ్చర్యంతో పాలు తెచ్చిన గోప వనిత ఆయన అడిగాడు.

'ఏముంది స్వామి శివయ్య ను తలుచుకుంటూ వచ్చాను. శివుడే నాకు దారి చూపాడు. మీరే కదా శివుడే అన్నీ చేస్తాడు, చేయిస్తాడు అని చెప్పారు. మరి మీ చేత శివాభిషేకం చేయించుకోవాలి అనుకొన్నాడు కదా. మరి నేను పాలు తీసుకుని రావాలంటే ఆయనే కదా దారి చూపాలి అందుకే చూపాడు. వచ్చాను మీకు పాలిచ్చాను. ఇక అభిషేకం చేయండి'అందట. ఆమె నమ్మకానికి ఆశ్చర్యపోయిన ఆ శివభక్తుడు ఆమెనే శివస్వరూపంగా భావించి పూజించాడు. అట్లా నమ్మకం అనేది ఉంటే సాధన కుదురుతుంది. ఆ కుదురు మనిషికి ఉండే మహనీయుడు అవుతాడు.

- కూకుట్ల యాదయ్య

అతిథి సేవే ఆదిత్యుని సేవ

అన్నం పరబ్రహ్మస్వరూపం. మానవులు జీవించాలంటే అత్యావసరమైనవి కూడు, గుడ్డ, గూడు ఈ మూడు ఉంటేనే జీవితం సజావుగా సాగుతుంది. పిపీలికాది బ్రహ్మపర్యంతమూ ఏదో ఒక ఆహారం తినందే బతుకు సాగదు. మనసుకు మంచి ఆలోచనలుంటే మానసికానందం కలుగుతుంది. మంచి ఆహారం తింటే ఆరోగ్యమూ కలుగుతుంది.

సస్యలక్ష్మిగా, ధాన్యలక్ష్మిగా, పౌష్యలక్ష్మిగా అన్నపూర్ణగా భావించి పూజించడంలోని అంతరార్థం మిదే.

త్యాగమయ జీవులుగా ఉండాలని భారతీయం చెబుతుంది. అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదంటారు. అన్నదానం తర్వాతే వస్త్ర వాహన, ధనకనక వస్తు దానాలు ఉంటాయి. ఆకలికొన్న వారికి అన్నం పెడితే వారి ఇషపరాల్లో సుఖాలు కోకొల్లలు. ఏదానం ఇచ్చినా పూర్తి సంతృప్తి భావన అంతత్వరగా పొందలేరు. కాని అన్నదానం చేసినప్పుడు అన్నం తిన్నవారూ పెట్టినవారూ ఇద్దరూ ఒకటేసారి సంతృప్తిభావనను పొందుతారు. అన్నం తిని కడుపు నిండి ఆకలిపోయినందుకు ఒకరు సంతోషాన్ని కనుల్లో చూపిస్తే మరొకరి వారికి ఆనందం కలగిందన్న ఆలోచనతో ఆనందాన్ని కనుల్లో భాసింపచేస్తారు. దానివల్లనే దాతగ్రహీతలకు ఆనందం ఒకటే సారి కలుగుతుంది.



పూర్వకాలంలో అతిథి పూజ చేయనిదే అతిథికి అన్నం పెట్టనిదే ఇంటి యజమాని అన్నం తినేవాడు కాదు. శిరిడీ సాయిబాబాగారు కూడా భిక్షాటన చేసి లభ్యమైన ఆహారాన్ని ముందు చీమలు, దోమలు, కుక్కలు, ఈగల్లాంటి వాటికి పెట్టి తర్వాత తన దగ్గర ఉంటున్న భక్తులకు పెట్టి తర్వాత ఆయన భుజించేవారు. సొంత లాభం కొంత మానుకు పొరుగువాడికి తోడుపడవోయ్ అన్నదే మన హైందవం చెబుతుంది. రంతిదేవుడు గొప్ప మహారాజు. దానశీలి. తన రాజ్యాన్ని సంపదను అంతా దానం చేయడంలో దూరం చేసుకొన్నాడు. కాని దానశీలత్వాన్ని మాత్రం పోగొట్టుకోలేకపోయాడు. తనకు దొరికిన దానితో తృప్తిపడుతూ ఉన్నంతలో ఎదుటివానికి కాస్త పెట్టివాని ఆకలి తీరిన తర్వాత తన భార్యాబిడ్డలకు పెట్టి ఆ తరువాత ఆయన భుజించడం అనేది దినచర్యగా పెట్టుకొన్నాడు. అట్లాంటి రంతిదేవుని పరీక్షించాలని మహావిష్ణువు అనుకొన్నాడు.

ఒకసారి చాలారోజుల పాటు రంతిదేవునికి ఆహారమేమీ దొరకలేదు. కటిక ఉపవాసం చేయసాగారు. ఒకరోజు అనుకోకుండా ఆహారం దొరికింది. అపుడు అతిథి సేవచేసి మనం భుజిద్దాం అనుకొన్నారు వారు. అతిథికోసం చూస్తున్నపుడు ఒక వృద్ధుడు ఆకలితో కనిపించాడు. ఆ వృద్ధుడి ఆకలి తీరడం కోసం రంతిదేవుడు తన దగ్గర ఉన్న ఆహారాన్నంతా పెట్టేశాడు. ఆతరువాత కేవలం వారికి మంచినీరు మిగిలింది. దాన్ని తాగు దామనుకొనేంతలో మరో అతిథి దాహార్తిగా వచ్చారు. ఆ నీటిని కూడా పూర్తిగా రంతిదేవుడు దానం చేశాడు. ఇలా అన్నింటి నీ దానం చేసినా కూడా సంతోషంగానే ఉన్న రంతిదేవుని దానశీలత్వాన్ని మెచ్చుకోకుండా భగవంతుడు ఉండలేక ప్రత్యక్ష్యం అయ్యాడు. కోరకుండానే రంతిదేవునికి స్వర్గలోకానికి తీసుకొని వెళ్లాడు. రంతిదేవునికి విష్ణుసాయుజ్యం లభించింది. ఇలా దానగుణాన్ని ప్రతివారు కలిగి ఉండాలని ప్రతి వస్తువు అవస్తువులోను పరమాత్మ ఉన్నాడని, పరులకు సేవ చేయడమే పరమాత్మకు సేవచేయడం అవుతుందని హైందవం చెబుతుంది.

- జి కల్యాణి

అమరత్వానికి సోపానం శివరాత్రి

ప్రసాదం - రమాప్రసాద్ ఆదిభట్ల 9348006669

"ఆదిభిక్షువువాణ్ణి ఏమి కోరేది? బూడిదిచ్చే వాణ్ణి ఏమి అడిగేది" అంటాడో సినీ కవి. నిందాపూర్వకగా శివతత్వాన్ని చెప్పే శివస్తుతి అది. జీవుడికి నిజంగా ఏది అవసరమైనదో ఆ స్థాయిని, స్థానాన్ని, ఆ విభూతిని, ఆ యోగాన్ని అందించే వాడు, అందివ్వగలిగినవాడు ఆ పరమశివుడు.

విభూతి తత్త్వమే ముఖ్యంగా సంక్షిప్తంగా శివతత్త్వం. ఇంకే రూపానికి మార్పులేని ఆఖరి అమరత్వ స్థితి విభూతి. అటువంటి స్థితికి జీవుణ్ణి చేరువ చేసేది శివతత్త్వం. "మహాశివుని తత్త్వం - జీవుల జీవితాలలో.. నడకలో, నడతలో అణువణునా, అడుగడుగునా తారాడే ప్రతిరోజు, ప్రతిక్షణం.. మనకి 'మహాశివరాత్రే' అంటాడో మహనీయుడు. మనస్సంకల్పతత్త్వమే అసలైన శివతత్త్వం. మనస్సుని మనం 'లయం' చేసుకోవాలి, చేసుకోగలగాలి. శివత్వానికి, శివుని తత్త్వానికి మనల్ని దగ్గర చేసే మహోత్కృష్టమైన హిందూ పర్వదినమే మహాశివరాత్రి. మహాశివరాత్రి చంద్రమానం ప్రకారం- మాఘమాసంలో బహుళ చతుర్దశి రోజవుతుంది. చంద్రుడు శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర యుక్తుడైనప్పుడు మహాశివరాత్రి. మనసుకి కూడా చద్రునికి ఉన్న 16 కళలు ఉంటాయి. మహాశివరాత్రి నాడు 15 కళలు లీనమై పోయి (చతుర్దశి కాబట్టి) ఒక్క కళ మాత్రమే మిగిలి ఉంటుంది. భగవచ్చింతన చేత మిగిలి ఉన్న ఆ ఒక్క కళని కూడా ఎక్కువగా సాధన చేసి మనోనిగ్రహం సాధించి ఫలితంగా దైవాన్ని మనం చేరుకోగలం. మనసులోని కల్మషం తొలగించుకోవటం ద్వారా 'శవాన్ని' 'శివం'గా మార్చుకోగలగటమే మహాశివరాత్రి సందేశం. మార్చుకోవటమే మహాశివరాత్రి మహత్వం. దైవత్వంలో లీనమవ్వటం కోసం దైవ చింతన చేయటమే మహాశివరాత్రి పర్వదినాన మన కర్తవ్యం. మహాశివరాత్రినాడు శివుడు లింగాకారంగా ఆవిర్భవించాడని శివపురాణం చెప్తోంది. లింగం సృష్టికి సంకేతం. బ్రహ్మము యొక్క చైతన్య ఫలిత సంకేత రూపమే లింగం. లింగం ఏదీ తనలో దాచుకోదు. ఏదీ తనతో ఉంచుకోదు. అన్నిటినీ వదిలించుకుంటుంది. అందుకే లింగం జీవిత లక్ష్యాన్ని సూచిస్తుంది. మహాశివరాత్రి మంగళకరమైన రాత్రి. చీకటిలో 'మంగళకరం' ఏమిటి? ఎలా ఉండగలుగుతుంది? గాఢమైన అజ్ఞానంలో జ్ఞానాన్ని మేల్కొలుపు చేసుకోవడమే మంగళకరం. మేల్కొపటమే ఆ మంగళకరం. త్రిమూర్తితత్వాన్ని ఏకత్వం కావించుకున్నపుడే, మానవత్వం మంగళత్వం అవుతుంది. మహాశివరాత్రి రోజున ప్రధానంగా మారేడు దళాల్ని శివుడికి సమర్పణ చేస్తాం. రోజంతా ఉపవాసం చేసి రాత్రంతా జాగరణ చేస్తాం. జాగరణం అంటే ఏదో రకంగా రాత్రంతా తెలిసి ఉండటం కాదు. ప్రకృతిలో నిద్రాణంగా వున్న శివశక్తిని శివపూజ అభిషేకాలు, అర్చనలు శివలీలా కథా పారాయణలతో, భజన లీలా శ్రవణాదులతో రాత్రంతా మేల్కొలిపి సర్వాన్ని శివస్వరూపంగా భావించి దర్శించుటయే నిజమైన జాగరణం. శివపూజలో సాయుజ్యం, శివభజనలో సామీప్యం, శివుని విషయాలు ప్రసంగించడంలో సాలోక్యాన్ని, శివధ్యానంలో సారూప్యం సిద్ధిస్తాయని ఆదిశంకరాచార్యులు చెబుతారు. ఈ నాలుగింటిని సాధించుకోవటానికి మనం చేసే ప్రత్యక్ష సాధనే శివరాత్రి జాగరణం. ఒక వేటగాడు జీవనోపాధికోసం వేటికి వెళ్లాడు. రోజంతా ఏ జంతువూ దొరకలేదు. రాత్రి కూడా మారేడు చెట్టుపైకి ఎక్కి కూచున్నాడు. జంతువుకోసం చూస్తున్నాడు. అతనికి తెలియకపోయినా, అతడు చెట్టుపైనుంచి రాల్చిన బిల్వపత్రాలన్నీ, కిందనున్న స్వయంభువుగా ఉన్న శివలింగంపై పడ్డాయి. ఆ కారణంగా ఆ వేటగాడు స్వర్గప్రాప్తిని ముక్తిని పొందుతాడు. ఇది మహాశివరాత్రి మహత్యాన్ని చెప్పే మహాశివరాత్రి వ్రతకథ.

'శివుడు'ని శంకరుడు అని కూడా అంటాం. 'శం' అనగా చిదానందం, ఆత్మానందం వగైరా. 'కర' అనగా అందించేవాడు అని అర్థం. ఆత్మానందాన్ని, చిదానందాన్ని, సచ్చిదానందాన్ని, బ్రహ్మానందాన్ని, అద్వైతానందాన్ని అందించేవాడు శంకరుడు. సకల ఐశ్వర్య స్వరూపుడు శివుడు. అందుకే 'శివుడ్ని' ఈశ్వరుడు అని కూడా అంటాం. క్షీరసాగర మథనం సమయంలో హలాహలం ఉద్భవించింది. ఆ హలాహలాన్ని తన యోగశక్తిచేత తన గొంతులో బందీ చేస్తాడు శివుడు. ఫలితంగా మచ్చ ఏర్పడింది. కంఠం నీలంగా మారిపోయింది. అందుకనే ఆయన్ని 'నీలకంఠుడు' అని కూడా పిలుస్తాం. హలాహలం మ్రింగిన ఆ వేడిని శివుడు తట్టుకోవడానికి శివునికి నిరంతరంగా అభిషేకం చేయాలి. ఇది మరో పురాణం ఆధారంగా మహాశివరాత్రి కథ. మొత్తంగా శివత్వాన్ని, శివతత్త్వాన్ని అందించే అతి విశిష్టమైన మహోత్కృష్టమైన పర్వదినం మహాశివరాత్రి. సకల ఐశ్వర్యాలను అందించే శివత్వాన్ని అర్థం చేసుకుందాం. అమరత్వాన్ని అందించే శివతత్వాన్ని అవగతం చేసుకుందాం. శివత్వాన్ని, శివతత్వాన్ని ఆరగిద్దాం. అనుభవిద్దాం. శివతత్త్వంలో మన జీవితాలను పండించుకుందాం. పండగ చేసుకుందాం.

యాజ్ఞసేని



34

త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

హే! కృష్ణా! వాసుదేవా! ధర్మమూర్తివి. నీదే భారము" అని వాపోయింది ద్రౌపది.

మరునాడు అనుకోకుండా కృష్ణద్వైపాయనుడు, సాత్యవతేయుడు అయిన వేదవ్యాస మహర్షి వారి వద్దకు వచ్చాడు.

ద్రుపదుడు, పాండవులు, కుంతీదేవి కలిసి ఎదురేగి వ్యాసభగవానునికి భక్తిపూర్వకంగా నమస్కరించారు. వ్యాసుడు వారందరినీ కుశల ప్రశ్నలడిగి ఉచితాసనాన్ని అలంకరించాడు.

అందరూ తమ తమ పీఠాలలో ఆసీనులయ్యారు. కొంత తడవుగా తరువాత ద్రుపదుడు "మహాత్మా! భగవస్వరూపా! సాంకర్య దోషం లేకుండా ఒక స్త్రీ ఒకనికంటె ఎక్కువమందికి భార్య ఎలా కాగలదు. దయచేసి నా సందేహాన్ని నివృత్తి చేయండి" అని చేతులు జోడించి ప్రార్థించాడు.


ఆ మాటలు విన్న మహర్షి 'లోకవిరుద్ధంగా కన్పట్టే ఈ విషయంలో మీమీ అభిప్రాయాలను వినాలనుకుంటున్నాను" అని అన్నాడు.

"విప్రోత్తమా! నాకిది అధర్మమని అనిపిస్తున్నది. అంతేగాక ఇది లోకవేదాలకు విరుద్ధమే. ఒకనికంటే ఎక్కువ మంది భర్తలను పొందటం లోకంలో వుండదు. పూర్వులైన మహాత్ములీ ధర్మాన్ని పాటించలేదు. ఇది నాకు లోక విరుద్ధమనిపిస్తున్నది" అని అన్నాడు ద్రుపదుడు.

"ఈ వివాహాన్ని నా మనసు అంగీకరిస్తున్నది. నా మాటలెన్నడూ అసత్యం గావు. అధర్మంపై నా బుద్ధి ప్రవర్తించదు. కాబట్టి ఇది ఎన్నడునూ అధర్మం గాదు.

పురాణాలలో 'కండు మహర్షి' పుత్రి కయ్యెన 'వార్షి' (దాక్షాయణి) తపస్సులచే పవిత్రులైన అంతఃకరణాలుగల 'ప్రచేత ప్రచేతసుని' ఒకే పేరుగల పదిమందిని వివాహమాడిందనీ, "నితంతుడు అనే రాజర్షి కుమారులు, అతి బలవంతులైన సాల్వేయుడు, శూరసేనుడు, శ్రుతసేనుడు, బిందుసారుడు, అతిసారుడు అనే వారు ఔశీనరపతి (ఉశీనరపతి) కుమార్తె అయిన 'అజిత' అనే ఆమెను స్వయంవరంలో పొంది అందరూ కలిసి వివాహమాడారు.

అంతేగాక పూర్వం గౌతమ వంశంలో పుట్టిన 'జటిల' అనే ఋషికూతురు తన తపః



ప్రభావము చేత ఏడుగురు ఋషులకు ఒక్కతే భార్య అయిందని కథలలో వినబడుచున్నది.

"మా తల్లి మీరందరూ భిక్షవలె అనుభవించండి అని పలికింది. అందువలన మా అయిదుగురితో ఈ ద్రౌపది వివాహం ధర్మయుక్తమే" అని పలికాడు ధర్మరాజు.

"ధర్మాచారపరుడైన ధర్మరాజు పలికినది సత్యమే. నేను అట్లే నిర్దేశించాను. నాకు అసత్యంవలన భయమేర్పడింది. ఈ అసత్యదోషం నుండి దూరం చేసే ఉపాయం చెప్పండి" అని పలికింది కుంతీదేవి.

"నీకు అసత్యం అంటదు. ఇది సనాతనమైన ధర్మమే. కానీ అందరికీ వర్తిస్తుందని చెప్పను" అని పాంచాలరాజా! నీవు ఏకాంతంగా వచ్చి తెలిసికో. ధర్మజుడు పలికినట్లే ఇది ధర్మబద్ధం" అని అన్నాడు వ్యాస మహర్షి.

తరువాత ఆసనం నుండి లేచి ద్రుపదుని చేయి పట్టుకొని రాజవనంలోనికి ప్రవేశించాడు మహర్షి. ఏకాంతంగా ద్రుపదునితో ఒక స్త్రీ ఒకనికంటే ఎక్కువమంది భర్తలను ఎలా పొందవచ్చునో, అది ఎలా ధర్మమవుతుందో వివరించాడు మహర్షి.

ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతం తెలిపి, కుంతీ పుత్రుల పూర్వపు దివ్య రూపాలను చూచే దివ్యదృష్టిని ప్రసాదించాడు ద్రుపదునికి. దివ్య చక్షువులనిచ్చాడు.

ద్రుపదుడు పూర్వపు ఇంద్రులు నలుగురిని చూస్తాడు. నలుగురు పాండవుల స్వరూపాలనూ చూస్తాడు. తదుపరి 'ఇంద్రుని' కుమారుడైన అర్జునుని రూపాన్నీ చూస్తాడు. ప్రసన్నుడౌతాడవు. ఆశ్చర్యపోతాడు. ద్రౌపది అన్ని విధాలా పాండవులకు తగినదానిగా భావిస్తాడు.

"మహర్షీ! మీలోని ఈ అద్భుత శక్తికి ఆశ్చర్యపడుతున్నాను" అని ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూచిన ద్రుపదుడు వ్యాస మహర్షి పాదాలపైబడి నమస్కరించాడు.

"మహారాజా! పూర్వం గొప్ప సౌందర్యరాశి అయిన ఒక ఋషి కుమార్తెకు వివాహం కుదరలేదు. ఆమె పరమశివుని గురించి ఘోర తపస్సు చేసింది. ఈశ్వరుడు ప్రత్యక్షమై ఆమెను వరం కోరుకొమ్మనగా ఆమె అయిదుసార్లు పతిభిక్ష పెట్టమని అడుగుతుంది. శంకరుడు నీవు మరుజన్మలో పొందుతావు అని వరమిచ్చాడు. ఆ ఋషికుమార్తెయే నీకు కూతురు అయింది. ఆ స్వర్గలక్ష్మి నీ యాజ్ఞశాలలో పాండవపత్నిగా జన్మించింది. ఇది గ్రహించి నీవు నీ యిచ్చవచ్చినట్లు చేయుము" అని అన్నాడు వ్యాసమహర్షి.

ద్రౌపది పూర్వ జన్మలో 'నాలాయని' అనే ఇంద్రసేన మౌద్గల్య మహర్షికి భార్యగా అయింది. మహాపతివ్రత. మౌద్గల్యుడు తపఃశక్తితో కోరిన రూపాన్ని పొంది ఐదు దేహాలు ధరించి మేరు కైలాస పర్వత ప్రాంతాలలో క్రీడిస్తూ అనేక సంవత్సరాలు నాలాయనిని అనుభవించి తృప్తి చెంది ఆమెను విడిచి తపస్సుకై బ్రహ్మలోకానికి వెళ్లిపోయాడు. కానీ నాలాయనికి కామభోగాల లోన తృప్తిపడక శరీరాన్ని విడిచి కాశీరాజు అనే రాజర్షికి కూతురుగా పుట్టింది.

- ఇంకావుంది



రకుల్ షాకిస్తోంది!

టాలీవుడ్ అందాల భామ రకుల్ ప్రీత్‌సింగ్ తాజాగా ఓ మ్యాగజిన్ కోసం ఇచ్చిన ఫొటో షూట్ చూసి జనాలు షాక్ అవుతున్నారు. బాబోయ్.. ఇన్నాళ్లు అచ్చ తెలుగు అమ్మాయిగా కనిపిచిన ఈ చిన్నదేనా ఇంత ఘాటు లేపింది అని! ఎందుకంటే ఈ అమ్మడు రేపిన ఘాటు ఆ రేంజ్‌లో ఉంది మరి. కేవలం టూ పీస్‌తో బికినీలా అన్పిస్తున్న ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సౌత్ హీరోయిన్‌గా చేస్తే ఓ లిమిట్ వరకు అందాలు ఆరబోసే హీరోయిన్స్ అదేమిటో బాలీవుడ్‌లోకి వెళితే మొత్తంగా ఆరబోయడానికి సిద్ధం అవుతారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలువురు భామలు నిరూపించారు. ఈమధ్యలో రకుల్ కూడా బాలీవుడ్‌పై ఆశలు పెట్టుకుంది. తాజాగా హిందీలో ఆయారి సినిమాలో నటించిన ఈ అమ్మడు అక్కడే సెటిల్ అవ్వాలని ప్లాన్ చేస్తున్నట్లుంది. అందుకేనేమో ఇలా రెచ్చిపోయి అందాలు ఆరబోసింది. కావాలంటే ఆ ఫొటోలపై మీరు ఓ లుక్ వేయండి.

బిగ్‌బాస్ రెండో సీజన్?



ఎన్టీఆర్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన బిగ్‌బాస్ మొదటి సీజన్ ఎంతగా పాపులర్ అయిందో అందరికీ తెలిసిందే. షో కొత్తగా అనిపించడంతో బుల్లితెర ప్రేక్షకులకు తెగ నచ్చేసింది. ఇక మొదటి సీజన్ 10 వారాల వరకు సక్సెస్‌గా కొనసాగిన సంగతి తెలిసిందే. అయితే సెకెండ్ సీజన్ అంతకంటే ఎక్కువ రోజులు కంటిన్యూ చేయాలనీ నిర్వాహకులు ఆలోచిస్తున్నారట. మొత్తంగా 14 వారాల వరకు బిగ్‌బాస్ 2 కొనసాగనుందని టాక్. ఇక ఎన్టీఆర్ కూడా అదే తరహాలో ఈసారి షోను నడిపించనున్నారట. గత ఏడాది జై లవకుశ సినిమాతో బిజీగా పాల్గొంటూనే బిగ్‌బాస్ షోను పూర్తిచేశాడు. ఇక ఇప్పుడు కూడా అదే తరహాలో త్రివిక్రమ్ ప్రాజెక్టును కంటిన్యూ చేస్తూ.. సీజన్ 2ను పూర్తిచేయనున్నాడట. ప్రస్తుతం సీజన్ 2 కోసం షో నిర్వాహకులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. అయితే సీజన్ 2లో పాల్గొనడానికి చాలామంది సెలబ్రెటీలు ఆశపడుతున్నారట. ఎలాగైనా ఈ షోలో పాల్గొనాలని రికమెండ్ చేయించుకుంటున్నట్లు ఊహాగానాలు వస్తున్నాయి. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియదు గాని ఈసారి మాత్రం కొంచెం స్టార్ హోదా ఉన్న నటీనటులనే సెలెక్ట్ చేయనున్నట్లు టాక్. ఇక హైదరాబాద్‌లోనే సెట్ వేయడానికి నిర్వాహకులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

మరోసారి..?



అర్జున్‌రెడ్డి.. టాలీవుడ్‌లో సంచలనం రేపిన సినిమా. ఈ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయిన షాలినీ పాండేకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ అయితే దక్కింది కానీ.. అవకాశాలు పెద్దగా రాలేదు. అయితే కోలీవులో 100 పర్సెంట్ రీమేక్ సినిమాలో నటిస్తోంది ఈ భామ. దాంతో పాటు మరో రెండు సినిమాలకు ఓకె చెప్పింది. తాజాగా మళ్లీ తెలుగులో విజయ్ దేవరకొండ సరసన నటిస్తుందట. ప్రస్తుతం దేవరకొండ పరశురామ్ దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ నిర్మిస్తున్న చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఛలో ఫేం రష్మిక మండన్నను ఎంపిక చేశారు. అయితే వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా కుదరకపోవడంతో నిర్మాత అల్లు అర్జున్.. మళ్లీ షాలినీ పాండేను తీసుకోవాలనుకున్నారట. ప్రస్తుతం ఆమెతో చర్చలు జరుపుతున్నారు.

పెళ్లికి గ్రీన్ సిగ్నల్?



మొత్తానికి తమిళ హీరో విశాల్ పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు? ఇన్నాళ్లు పెళ్లి విషయాన్ని దాటవేస్తూ వస్తున్న విశాల్.. ఫైనల్‌గా పెళ్లికి సిద్ధం అయినట్టు ఓ మీడియా సమావేశంలో చెప్పేశాడు. దాంతో విశాల్ పెళ్లిచేసుకునేది ఎవరిని అని గుసగుసలు ఎక్కువయ్యాయి. దానికి కారణం.. విశాల్ గత కొంత కాలంగా శరత్‌కుమార్ అమ్మాయి వరలక్ష్మితో ప్రేమాయణం సాగిస్తున్న విషయం తెలిసిందే. ఈమధ్య శరత్‌కుమార్‌తో విశాల్‌కు నడిగర్ సంఘం విషయంలో విభేదాలు తలెత్తిన నేపథ్యంలో వీరిద్దరూ దూరంగా వుంటున్నారని అంటున్నారు. ఇప్పటికే విశాల్ పలు కార్యక్రమాలతో బిజీగా వున్నాడు. నడిగర్ సంఘానికి సంబంధించిన భవన నిర్మాణాన్ని చేయిస్తున్నాడు. ఆర్థికంగా చితికిన నటీనటులను ఆదుకుంటామని తెలిపారు. ఈ భవన నిర్మాణం అయ్యేవరకు పెళ్లిచేసుకోను అని చెప్పిన విశాల్- మొత్తానికి అనుకున్నట్టే భవనాన్ని ఓపెన్ చేయించాడు. మరి విశాల్ పెళ్లాడే అమ్మాయి ఎవరా? అన్న ఆరాలు ఎక్కువవుతున్నాయి.



శర్వానంద్ సరసన..

అఖిల్ సరసన హలో చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన కళ్యాణి మొదటి సినిమాతో మంచి మార్కులు కొట్టేసింది. ప్రముఖ మలయాళ దర్శకుడు ప్రియదర్శన్ కూతురైన కళ్యాణి హీరోయిన్‌గా కెరీర్ జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటోంది. తాజాగా మరో క్రేజీ అవకాశాన్ని పట్టేసింది. స్వామి రారా డైరెక్టర్ సుధీర్ వర్మ దర్శకత్వంలో శర్వానంద్ నటించబోతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయింది. మొదట ఈ సినిమాలో కాజల్, నిత్యమీనన్ నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించిన మాట వాస్తవమే. కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల వారిద్దరూ ఈ సినిమాలో నటించడంలేదు. ఈ సినిమాలో శర్వానంద్ సరసన కళ్యాణి ప్రియదర్శిని నటించబోతోంది. మార్చి మూడో వారం నుండి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కబోయే ఈ సినిమాలో నటించే హీరోయిన్ వివరాలు తెలియనున్నాయి.

'చల్ మోహన్‌రంగ' ఫస్ట్‌లుక్





నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'చల్ మోహన్‌రంగ' మాటల మాంత్రికుడు, దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందిస్తుండగా, శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో ప్రముఖ నిర్మాత ఎన్.సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఇది నితిన్‌కు 25వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ 'చల్ మోహన్‌రంగ'ను పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ తన ట్విట్టర్‌లో విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నా అభిమాన కథానాయకుడు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ఈ చిత్రం ప్రచార చిత్రాలను ట్విట్టర్ ద్వారా విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉంది' అని హీరో నితిన్ ఈ విషయాన్ని తన ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ - 'తొలి ప్రచార చిత్రాలను పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉంది. ఆయనకు మా తరపున, చిత్రం యూనిట్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు' అన్నారు. చిత్రం టీజర్‌ను ప్రేమికులరోజు అయిన ఈ నెల 14న, చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన ఒక్క గీతాన్ని ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరించనున్నామని తెలిపారు. హైదరాబాద్, ఊటీ, అమెరికాలో ఇప్పటి వరకు షూటింగ్ జరుపుకుందీ చిత్రం. చిత్ర దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ - ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రం ఇది. చాలా సరదాగా సాగుతుంది అని తెలిపారు. నా ఈ చిత్రం తొలి ప్రచార చిత్రాలను పవర్ స్టార్ పవన్‌కళ్యాణ్ విడుదల చేయడం ఆనందంగా ఉందని, కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరపుకుంటోంది. డా.కె.వి. నరేష్, లిజీ, రోహిణి హట్టంగడి. రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్, ఆశు రెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబి హాసిని, బేబి కృత్తిక, మాస్టర్ జోయ్, మాస్టర్ లిఖిత్, మాస్టర్ స్నేహిత్, మాస్టర్ స్కందన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్ థమన్, కెమెరా: ఎం. నటరాజ సుబ్రమణియన్, నృత్యాలు: శేఖర్ వి.జె, కూర్పు: ఎస్.ఆర్. శేఖర్, ఫైట్స్: స్టంట్ సిల్వ, రవివర్మ, సమర్పణ: శ్రీమతి నిఖితరెడ్డి, నిర్మాత: ఎం. సుధాకర్‌రెడ్డి, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కృష్ణ చైతన్య.



నికిషాపటేల్

యాక్షన్ సినిమాలకు రెడీ

పవన్‌కళ్యాణ్ పులి సినిమాతో పరిచయమైన బ్యూటీ నికిషాపటేల్. అలరించే అందం.. ఆకట్టుకునే అభినయం నికిషా సొంతం. అయితే ఈ బ్యూటీ కెరీర్ అనుకున్నంత వేగంగా సాగలేదు. మధ్యలో కొన్ని సినిమాల్లో అలరించిన ఈ అమ్మడు ఇప్పుడు లేడీ ఓరియెంటెడ్ సినిమాతో రాబోతోంది. ఈ సినిమాలో నికిషా పోలీసు ఆఫీసర్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కన్పిస్తుంది. అందుకు తగ్గట్టుగానే సినిమా టైటిల్‌ను కూడా 'రౌడీ పోలీస్' అని పెట్టారు. టైటిల్‌తోపాటు నికిషా పాత్ర కూడా చాలా పవర్‌ఫుల్‌గా వుంటుందని చెబుతున్నారు. ఈ సినిమాలో ముకుల్‌దేవ్ విలన్‌గా నటిస్తున్నాడు. మరో ముఖ్యమైన పాత్రలో సీనియర్ హీరో భానుచందర్ నటిస్తుండడం విశేషం. ఈ చిత్రంలో రిస్కీగా సాగే రోప్ యాక్షన్ సన్నివేశాలు కూడా ఉంటాయట. వాటిని ఎలాంటి డూప్ లేకుండా అత్యంత సహజంగా చేసింది హీరోయిన్ నికిషా. సినిమా కోసం కాదు కానీ ఆల్రెడీ నికిషా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుని ఉంది. పైగా తను రియల్ బాక్సర్ కూడా. కాబట్టి ఈ యాక్షన్ సీక్వెన్స్ అన్నీ చాలా ఈజీగా చేసేసింది. అంతే కాదు, ఇకపై ఇలాంటి యాక్షన్ ఓరియంటెడ్ సినిమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని చెబుతోంది. జానీ అనే దర్శకుడు తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తామని చెబుతున్నారు.